



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 08, సంచిక: 330 | శనివారం | 01-11-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## కేరళ మరో చరిత్ర

### తీవ్ర పేదరికం నుండి విముక్తి



- దేశంలోనే తొలి రాష్ట్రంగా రికార్డు
- ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ ఘనత
- నేడు సిఎం పినరయి విజయన్ అధికారిక ప్రకటన
- వామపక్ష ప్రత్యామ్నాయ ఆచరణాత్మక విజయమిది : సిపిఐ కేరళ కార్యదర్శి బినోయ్ విశ్వం

**తిరువనంతపురం :** భారతదేశానికే మార్గం చూపే కేరళ రాష్ట్రం మరో చరిత్రను సృష్టించింది. తీవ్ర పేదరికాన్ని సైతం నిర్మూలించిన ఏకైక రాష్ట్రంగా గణుతికెక్కింది. వామపక్ష ప్రజాతంత్ర సంఘటన(ఎల్‌డిఎఫ్) ప్రభుత్వ విశేష కృషితో కేరళను తీవ్ర పేదరిక రహితంగా ప్రకటించడానికి సన్నాహాలు పూర్తయ్యాయి. కేరళ ఆవిర్భావ దినోత్సవం నవంబర్ 1వ తేదీ(శనివారం) ఉదయం 9 గంటలకు శాసనసభలో జరిగే ప్రత్యేక సమావేశంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ 'తీవ్ర పేదరిక రహిత కేరళ'పై తీర్మానాన్ని ప్రవేశపెడతారు. సాయంత్రం 4 గంటలకు చంద్రశేఖరన్ నాయర్ స్టేడియంలో ప్రజల సమక్షంలో ఈ మేరకు ముఖ్యమంత్రి అధికారిక ప్రకటన కూడా చేస్తారు. తీవ్ర పేదరిక జాబితాలో 59,277 కుటుంబాలు ఉన్నాయి. వారందరినీ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం తీవ్ర పేదరికం నుంచి విముక్తి చేసింది.

**మార్గదర్శకంగా కేరళ : బినోయ్ విశ్వం**

భారతదేశంలోనే తొలి తీవ్ర పేదరిక రహిత రాష్ట్రంగా శనివారం నాడు కేరళ ప్రకటించబడుతుందని, ఇది ఐక్య కేరళ ఆవిర్భావం చరిత్రలో ఒక ప్రకాశవంతమైన క్షణం అవుతుందని సిపిఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి, మాజీ మంత్రి బినోయ్ విశ్వం అన్నారు. ఇది కేరళలోని తరువాయి 2లో

# వరద బాధితులకు తక్షణ సాయం



### ఇండ్లకు రూ.15వేలు, మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు

- వరంగల్, హుస్నాబాద్ నియోజకవర్గాలలో సిఎం ఏరియల్ సర్వే
- హన్మకొండ కలెక్టరేట్‌లో మంత్రులు, 12 జిల్లాల కలెక్టర్లతో నష్టంపై సమీక్ష
- కబ్జాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశం

ప్రజాపక్షం/హనుమకొండ

వరద ముంపు ప్రాంతాల్లో బాధితులకు తక్షణమే సహాయం అందించడానికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. వరంగల్, హనుమకొండ, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో వరద బీభత్సంపై మంత్రులతో కలిసి హెలికాప్టర్‌లో శుక్రవారం ఆయన ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లతో కలసి రాష్ట్రస్థాయి అధికారులు, 12 జిల్లాల కలెక్టర్లు, జిల్లా అధికారులతో భారీ వర్షాలతో జరిగిన పంట, ఆస్తి, ప్రాణ నష్టాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అలాగే వరదలు, భారీ వర్షాల కారణంగా నష్టపోయిన ప్రాంతాల్లో తరువాయి 2లో

మొంథా తుఫాన్ విధ్వంసం..

## ఎపికి రూ. 5,265 కోట్ల ఆస్తి నష్టం

**అమరావతి:** మొంథా తుఫాన్ ఆంధ్రప్రదేశ్ (ఎపి)లో తీవ్ర విధ్వంసాన్ని సృష్టించింది. కనీసం రూ. 5,265 కోట్ల రూపాయల మేర ఆస్తి నష్టం జరిగినట్టు ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా 13,000లకుపైగా విద్యుత్ స్తంభాలు, 3,000లకుపైగా ట్రాన్స్‌ఫార్మర్లు పూర్తిగా లేదా పాక్షికంగా ధ్వంసమయ్యాయని ఎపి విద్యుత్ శాఖ మంత్రి రవి కుమార్ తెలిపారు. తుఫాన్‌కు రెడు రోజుల ముందే విద్యుత్ శాఖ ఉద్యోగులందరినీ ఆందుబాటులో ఉంచడంతో, తరువాయి 12లో

ఆదుకోవాల్సిన బాధ్యత

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని


సుజాతనగర్ మండలంలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, వరదలతో వేలాది ఎకరాలు పంటలు దెబ్బతిని రైతులు నష్టాల్లో కూరుకుపోయారని,పంటలు నష్టపోయి దిక్కు తోచని స్థితిలో ఉన్నరైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సుజాతనగర్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. జరిగిన నష్టంపై రైతులతో ముచ్చటించారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ భారీ వర్షాలు, తరువాయి 2లో



## మొంథా తుఫాన్‌కి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ 03

# మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణస్వీకారం

- ప్రమాణం చేయించిన రాష్ట్ర గవర్నర్
- హాజరైన సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ప్రముఖులు




ప్రజాపక్షం/హైదరాబాద్

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, కాంగ్రెస్ సీనియర్ నేత మహమ్మద్ అజారుద్దీన్ తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించారు. అల్లా పేరు మీద అజారుద్దీన్ ప్రమాణం చేశారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సమక్షంలో ఈ కార్యక్రమం నిరాడంబరంగా జరిగింది. కార్యక్రమానికి సిఎం రేవంత్ రెడ్డితో పాటు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సి.దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఇతర మంత్రివర్గ సహచరులు, ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డిజిపి డాక్టర్ జితేందర్ తదితరులు పాల్గొన్నారు. ప్రమాణస్వీకారం పూర్తయిన అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు, నేతలు అజారుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సరిగ్గా మధ్యాహ్నం 12:25 గంటలకు ప్రారంభమైన అజారుద్దీన్ ప్రమాణ స్వీకార కార్యక్రమం కేవలం 9 నిమిషాల్లోనే ముగియడం గమనార్హం. మరోవైపు, అజారుద్దీన్‌కు ఏ శాఖ కేటాయిస్తారనే విషయం ఆసక్తిని కలిగిస్తోంది.




స్వేచ్ఛా వాణిజ్యానికి

## సాయం చేస్తాం

- ఎపెక్ సదస్సులో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్
- డుమ్మా కొట్టిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

**జీయొంగ్జు :** ప్రపంచ స్వేచ్ఛా వాణిజ్యాన్ని కాపాడుకోవడానికి తన దేశం సహాయం చేస్తుందని ఆసియా–పసిఫిక్ నేతలతో చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్ అన్నారు. దక్షిణ కొరియా దేశంలోని జియొంగ్జు నగరంలో ఆసియా–పసిఫిక్ ఆర్థిక సహకార (ఎపెక్) సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సదస్సుకు హాజరయ్యేందుకు తిరస్కరించారు. ఈ సదస్సులో జిన్ పింగ్ పాల్గొని ప్రసంగించారు. దక్షిణ కొరియాలో ట్రంప్– జితో ఒప్పందాలు కుదుర్చుకుని ఒక రోజు ముందుగానే గురువారం దేశం నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ ఏడాది రెండు రోజుల ఎపెక్ శిఖరాగ్ర సదస్సులో భాగంగానే ట్రంప్–జి సమావేశం జరిగింది. అయితే, ట్రంప్ ఎపెక్ సదస్సుకు హాజరుకాకుండా దాటవేశారు. ప్రపంచ సమస్యలను పరిష్కరించడానికి సాంప్రదాయకంగా ఉపయోగించే పెద్ద, బహుళదేశాల వేదికల పట్ల ఆయన తిరస్కార భావనతో ప్రపంచ జనాభాలో దాదాపు 40 శాతం , ప్రపంచ వస్తువుల వాణిజ్యంలో సగానికి పైగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక వేదికలో అమెరికా ఖ్యాతి మరింత దిగజారే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**బహుళపాక్షికతను సమర్థించిన జిన్‌పింగ్**

'కాలాలు ఎంత అల్లకల్లోలంగా ఉంటే, మనం అంతగా కలిసి తరువాయి 2లో

భారత్ – అమెరికా

# రక్షణ చట్రం ఒప్పందంపై సంతకం



**కౌలాలంపూర్ :** భారతదేశం, అమెరికా శుక్రవారం 10 సంవత్సరాల రక్షణ చట్రం ఒప్పందంపై సంతకం చేశాయి. కౌలాలంపూర్‌లో జరిగిన విస్తృత స్థాయి చర్చల తర్వాత భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, అమెరికా యుద్ధ కార్యదర్శి పీట్ హెగ్సేత్ 'యుఎస్–ఇండియా ప్రధాన రక్షణ భాగస్వామ్యం' ఒప్పందం కోసం చట్రం ఒప్పందంపై సంతకాలు చేశారు. ద్వైపాక్షిక రక్షణ సహకారాన్ని మరింతగా పెంచడానికి విస్తృత దృష్టి, విధాన దిశను అందించడానికి ఈ ఫ్రేమ్‌వర్క్ ఒప్పందం ఉద్దేశించబడింది. 2015లో సంతకం చేసిన ఇలాంటి ఒప్పందం గడువు ముగియడంతో ఈ అవసరం ఏర్పడింది. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించిన కొన్ని రోజుల తర్వాత రాజ్‌నాథ్‌సింగ్, హెగ్సేత్ మధ్య జరిగిన మొదటి సమావేశం ఇది. హెగ్సేత్ తో తన చర్చలు 'ఫలవంతమైనవి' అని అభివర్ణించిన సింగ్, ఈ ఫ్రేమ్ వర్క్ ఒప్పందం 'ఇప్పటికే బలంగా ఉన్న మన రక్షణ భాగస్వామ్యంలో కొత్త శకానికి' నాంది పలుకుతుందని అన్నారు. వారిరువురు ఆసియాన్ సమావేశాలలో పాల్గొనేందుకు కౌలాలంపూర్‌కు వెళ్ళారు. 'రక్షణ సహకారంలో అమెరికాకు భారతదేశం ప్రాధాన్యత గల దేశమని, స్వేచ్ఛాయుతమై, బహిరంగ ఇండో–పసిఫిక్‌ను నిర్ధారించడానికి భారతదేశంతో కలిసి పనిచేయడానికి వారు కట్టుబడి ఉన్నారని యుద్ధ కార్యదర్శి పునరుద్ఘాటించారని' అని రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటనలో తెలిపింది. భారతదేశంలో ఎఫ్–414 జెట్ ఇంజిన్ల ఉమ్మడి ఉత్పత్తి కోసం హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఎఎల్), అమెరికా రక్షణ ప్రధాన సంస్థ జిఇ ఏరోస్పేస్ మధ్య ప్రతిపాదిత ఒప్పందం కూడా చర్చలలో ఉందని తెలిసింది. గత కొన్ని సంవత్సరాలుగా భారతదేశం–అమెరికా రక్షణ సహకారం ఊపందుకుంది. దాదాపు 10 సంవత్సరాల క్రితం, కీలకమైన సైనిక పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడానికి మార్గం సుగమం చేస్తూ, అమెరికా భారతదేశాన్ని 'ప్రధాన రక్షణ భాగస్వామి'గా హోదా కల్పించింది.



ఉద్యోగులు, ఆర్&బి బకాయిల

## నిధులు విడుదల


అక్టోబర్ నెల రూ.1,031 కోట్లను విడుదల చేసిన ఆర్థిక శాఖ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలను, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖకు సంబంధించిన పెండింగ్ బిల్లులను అక్టోబర్ మాసానికి సంబంధించి సుమారు రూ 1,031 కోట్లను ఆర్థిక శాఖ ఒకేసారి విడుదల చేసింది. ఇందులో ఉద్యోగుల బకాయిలు రూ. 712 కోట్లు, ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్ శాఖ పెండింగ్ బిల్లులు రూ.320 కోట్లు ఉన్నాయి. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఆర్థిక శాఖ అధికారులతో డిప్యూటీ సిఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం సమావేశమయ్యారు. గత ప్రభుత్వ కాలం నుంచి పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల బకాయిలను దశల వారీగా తరువాయి 2లో

## ఇద్దరు ఎమ్మెల్యేలకు నామినేటెడ్ పదవులు

- ప్రభుత్వ సలహాదారునిగా పి.సుదర్శన్ రెడ్డి
- పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్‌గా ప్రేమ్ సాగర్ రావు



ప్రజాపక్షం/హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారునిగా బోధన్ ఎంఎల్ఎ, మాజీ మంత్రి పి.సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్‌గా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావును ప్రభుత్వం నియమించింది. మంత్రివర్గ సమావేశాలకు ప్రత్యేక ఆహ్వానితుడిగా సలహాదారుడు పి.సుదర్శన్‌రెడ్డికి అవకాశం కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రులకు ఉండే అన్ని సదుపాయాలను సుదర్శన్ రెడ్డికి కల్పించనున్నట్లు ప్రభుత్వ ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, తెలంగాణ మంత్రివర్గంలో స్థానాన్ని ఆశించిన ఇద్దరు ఎంఎల్ఎలకు క్యాబినెట్ హోదాతో పదవులు దక్కాయి. ప్రజలలో, రాజకీయాలలో తరువాయి 2లో

ఎఐబిఇఎ, ఐప్సో నేత

## రామరాజు ఆకస్మిక మృతి



03

సిపిఐ(ఎం) నాయకుడు

# సామినేని రామారావు హత్య

సిపిఐ(ఎం), సిపిఐ నేతలు సహా పలువురి నివాళి



ప్రజాపక్షం/ ఖమ్మం /చింతకాని

సిపిఎం సీనియర్ నాయకులు, రైతు సంఘం ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సామినేని రామారావు (75)ను శుక్రవారం ఉదయం ప్రత్యర్థులు దారుణంగా హత్య చేశారు. ఆయన స్వగ్రామం చింతకాని మండలం పాతర్లపాడులో ఉదయం ఐదు గంటలకు లేచి ఉదయపు నడక అనంతరం ఇంటికి చేరుకున్న రామారావు పక్కనే ఉన్న చావిడిలో పని చేస్తుండగా అప్పటికే అక్కడ మాటు వేసిన దుండగులు ఒక్కసారిగా రామారావుపై పడి కత్తితో పొట్ట, ఛాతీ భాగంలో పొడిచారు. తీవ్ర కత్తి పోట్లతో రక్తస్రావం కావడంతో రామారావు సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. రామారావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రామారావు హత్య ఈ ప్రాంతంలో సంచలనం సృష్టించింది. మృతి వార్త తెలిసిన వెంటనే ఖమ్మం సిపి సునీల్ దత్ సంఘటన స్థలంకు చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్‌టీంను, ఫోరెన్సిక్ బృందాన్ని రంగంలోకి దించారు. ఈ బృందాలు రక్త నమూనాలు, వేలిముద్రలు సేకరించగా డాగ్ స్క్వాడ్‌ను సైతం రంగంలోకి తరువాయి 2లో

# 'ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించాల్సిందే'

- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కీలక వ్యాఖ్యలు
- సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ప్రధాని మోదీపై కాంగ్రెస్ చీఫ్ విమర్శల ఎదురుదాడి



**న్యూఢిల్లీ :** దేశంలో అత్యధికంగా శాంతిభద్రతల సమస్యలు తలెత్తడానికి బిజెపిఆర్‌ఎస్‌ఎస్ కారణమని, ఈ క్రమంలో ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించాలన్నది తన వ్యక్తిగత అభిప్రాయమని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ కాంగ్రెస్ పార్టీపై చేసిన ఆరోపణలను మల్లికార్జున్ ఖర్గే తిప్పికొట్టారు. ప్రభుత్వ ఉద్యోగులను సంఘ్‌తో అనుసంధానించడానికి అనుమతించడం ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోదీ సర్దార్ వల్లభాయ్ పటేల్ వారసత్వాన్ని అవమానించారని ఖర్గే ఆరోపించారు. పటేల్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై విమర్శల దాడికి దిగిన తర్వాత మల్లికార్జున్ ఖర్గే ప్రధాని మోదీపై విమర్శల ఎదురుదాడి చేశారు. 1948లో మహాత్మాగాంధీ హత్య తర్వాత సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆర్‌ఎస్‌ఎస్‌ను విమర్శిస్తూ చేసిన వ్యాఖ్యలను తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## యువరాజు హోదా కోల్పోయిన ఆండ్రూ



**లండన్ :** కుంభకోణంలో చిక్కుకున్న బ్రిటన్ రాజు చార్లెస్–3 తమ్ముడు ఆండ్రూ తన యువరాజు హోదాను కోల్పోయాడని, త్వరలోనే విండ్సర్ క్యాజిల్ ఎస్టేట్‌లోని తన రాయల్ లాడ్జ్ భవనం నుండి బయటకు వెళ్తాడని బకింగ్‌హమ్ ప్యాలెస్ తెలిపింది. ఆయన అధికారిక 'రోల్ ఆఫ్ ది పీరేజ్' నుండి శుక్రవారం తొలగించబడ్డాడని వెల్లడించింది. అమెరికన్ లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ఆండ్రూకు ఉన్న సంబంధం గురించి నిరంతర ఆరోపణల మధ్య, చక్రవర్తితో చర్చించిన అనంతరం ఆండ్రూ స్వచ్ఛందంగా 'డ్యూక్ ఆఫ్ యార్క్' బిరుదు సహా ఇతర రాజ గౌరవాలను వదులుకున్న కొన్ని రోజుల తర్వాత గురువారం సాయంత్రం రాజు నిర్ణయం వెలువడింది.

## హమాస్ – ఇజ్రాయెల్ మృతుల అవశేషాల పరస్పర అప్పగింత



**జెరూసలెం :** ఇజ్రాయెల్ శుక్రవారం 30 మంది పాలస్తీనీయుల మృతదేహాలను అప్పగించినట్లు గాజాలోని ఒక ఆసుపత్రి అధికారులు వెల్లడించారు. హమాస్ ఇద్దరు ఇజ్రాయెల్ బందీల అవశేషాలను రెడ్ క్రాస్‌కు గురువారం నాడు అందజేసింది. అక్కడి నుంచి వాటిని ఇజ్రాయెల్ బలగాలకు అప్పగించగా, వారిని గుర్తించేందుకు నేషనల్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ మెడిసిన్‌కు తరలించినట్లు ఇజ్రాయెల్ మిలిటరీ తెలియజేసింది. ఆ అవశేషాలలో ఒకటి సహర్ బరూచ్ అనే ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ డిగ్రీ చదివేందుకు సన్నద్ధమవుతున్న విద్యార్థిదిగా, మరొకటి అమీరామ్ కూపర్ అనే ఆర్థికవేత్తదిగా గుర్తించారు. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజామిన్ నెతన్యాహూ గురువారం రాత్రి నిర్ధారించారు. వారిరువురిని 2023 అక్టోబర్ 7న హమాస్ దాడి చేసి తీసుకెళ్ళారు. కాల్పుల విరమణ ప్రారంభమైనప్పటి నుంచి హమాస్ 17 మంది బందీల అవశేషాలను తిరిగి ఇచ్చేసింది. మరో 11 మంది అవశేషాలు గాజాలోనే ఉండగా, ఒప్పందంలో నిబంధనల ప్రకారం వాటిని కూడా వెనక్కి ఇస్తారు. ఇజ్రాయెల్ ఇప్పటి వరకు 195 మంది పాలస్తీనీయుల మృతదేహాలను గాజా అధికారిక వర్గాలకు అప్పగించింది. వారి గురించిన వివరాలు ఇప్పటి వరకు తెలియలేదు. వారిని అక్టోబర్ 7న చంపేశారా లేదా ఇజ్రాయెల్ కస్టడీలో బందీలుగా మరణించారా? లేదా యుద్ధ సమయంలో గాజా నుంచి వారిని తీసుకెళ్ళారా? అనేది స్పష్టం కాలేదు. డిఎన్ఏ కిట్లు లేకపోవడంతో మరణించిన వారిని గుర్తించడంతో గాజా వైద్యాధికారులు ఇబ్బందులు పడుతున్నారు.

## పాక్–అఫ్ఘాన్‌ల మధ్య చర్చల పునరుద్ధరణ

### సమ్మతించినట్లు తుర్కియే సంయుక్త ప్రకటన



**ఇస్లామాబాద్ :** గత వారం ప్రతిష్టంభన నెలకొన్న శాంతి చర్చల ప్రక్రియను పునరుద్ధరించేందుకు పాకిస్తాన్, అఫ్ఘానిస్తాన్ దేశాలు శుక్రవారం అంగీకరించాయి. ఇరు దేశాల సరిహద్దుల వెంబడి కాల్పుల విరమణను కొనసాగించాలని నిర్ణయించాయి. పాకిస్తాన్, అఫ్ఘానిస్తాన్‌కు చెందిన తాలిబాన్ ప్రతినిధులకు నడుమ ఇస్తాంబుల్‌లో గత శనివారం రెండవ విడత చర్చలు ప్రారంభమయ్యాయి. అయితే సరిహద్దు వెంబడి దాడులు నిలిపివేసేందుకు హామీ ఇవ్వడంలో తాలిబాన్ అయిష్టంగా ఉందనే పాకిస్తాన్ ఆరోపించడంతో చర్చలు విఫలమయ్యాయి. తాజా చర్చలకు ఆతిథ్యం ఇస్తున్న తుర్కియే శుక్రవారం విడుదల చేసిన సంయుక్త పత్రికా ప్రకటనలో నవంబర్ 6న ఇస్తాంబుల్‌లో ముఖ్యుల స్థాయి సమావేశం జరనున్నట్లు డాన్ పత్రిక పేర్కొంది. ఈ సమావేశంలో అమలు చేయాల్సిన విధివిధానాలపై చర్చించి, నిర్ణయిస్తారని ఆ పత్రిక వార్తలో వెల్లడించారు. అయితే, ''ముఖ్యులు'' ఎవరనే అంశంపై స్పష్టత లేదు. ఉభయ దేశాల రక్షణ శాఖల మంత్రుల మధ్య చర్చలు జరగవచ్చని ఊహిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. గతంలో దోహాలో జరిగిన మొదటి విడత చర్చలకు వారే నేతృత్వం వహించడంతో ఇస్తాంబుల్ సమావేశంలో సైతం వారే కొనసాగుతారని భావిస్తున్నారు. శాంతిని కొనసాగించేందుకు , ఉల్లంఘనలకు పాల్పడే వైపు జరిమానా విధించేందుకు ''పర్యవేక్షణ, పునఃపరిశీలన యంత్రాంగం'' ఏర్పాటుకు ఇరు దేశాలు సమ్మతించినట్లు తుర్కియే విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో పేర్కొంది. మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న తుర్కియే, ఖతార్‌లు ఉభయ పక్షాల క్రియాశీలక భాగస్వామ్యం పట్ల అభినందించాయి. ఈ పరిణామాల పట్ల తాలిబాన్ అధికార ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ వ్యాఖ్యానిస్తూ ఒక ఇస్లాం దేశం ఇతర పొరుగు దేశాల పట్ల మంచి సంబంధాలను కోరుకుంటుందని, పాకిస్తాన్‌తో సానుకూల సంబంధాలను ఆశిస్తున్నామన్నారు. పరస్పర గౌరవం ఆధారంగా సంబంధాలు నిలబడతాయని, అంతర్గత వ్యవహారాలలో జోక్య రహితంగా ఉండటం, ఏ పక్షానికి ముప్పుగా పరిణమించబోదని అన్నారు. కాగా, తేహ్రీక్ ఎ తాలిబాన్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని పాకిస్తాన్ డిమాండ్ చేస్తుంది. ఆ సంస్థ కార్యకలాపాలపై తమకు నియంత్రణ లేదని, తమ భూభాగంలో టిటిపి సభ్యులు ఎవరైనా కనిపిస్తే, వారిని ఖైదు చేసి, బహిష్కరిస్తామని తాలిబాన్ అధికారులు చెబుతున్నారు. వారు పాకిస్తాన్ జాతీయులేనని, పాకిస్తాన్ నుంచే కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని అన్నారు.

## 'మాదకద్రవ్యాల బోట్లు' పేరుతో అమెరికా దాడులు గర్హణీయం

### ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చీఫ్ వొల్కర్ టర్క్

**జెనీవా :** దక్షిణ అమెరికా నుండి అక్రమ మాదకద్రవ్యాలు తీసుకెళ్తున్నాయన్న ఆరోపణలతో పలు బోట్లపై అమెరికా చేస్తున్న సైనిక దాడులు చేయడం గర్హణీయమని, వీటిని అంగీకరించలేమని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల సంస్థ చీఫ్ వొల్కర్ టర్క్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ బోట్లపై దాడులను, అమెరికాలోకి మాదకద్రవ్యాల ప్రవాహాన్ని నిరోధించడానికి అవసరమైన చర్యగా పేర్కొంటున్నప్పటికీ, టర్క్ ఆయనతో విభేదిస్తున్నారు. ఈ దాడులపై విచారణ జరగాలని డిమాండ్ చేశారు.. సెప్టెంబర్ ప్రారంభం నుండి ఆ ప్రాంతంలోని బోట్లపై దాడుల్లో 60కు పైగా మంది చనిపోబడ్డారని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కార్యాలయ అధికార ప్రతినిధి రవీనా షాందాసాని తెలిపారు. దాడులను, తద్వారా పెరుగుతున్న మరణాలను చూస్తూ ఊరుకోలేమని జెనీవాలో ఆమె మీడియాతో మాట్లాడుతూ అన్నారు. కరిబియన్, పసిఫిక్‌లో బోట్లపై అమెరికా ఎయిర్‌స్ట్రైక్స్ అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాన్ని ఉల్లంఘిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. అమెరికా ఈ దాడులను ఆపి, ఈ బోట్లలోని వ్యక్తుల మరణాలను నివారించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. దాడులను మాదకద్రవ్యాలు వ్యతిరేక, ఉగ్రవాద వ్యతిరేక చర్యలుగా అమెరికా పేర్కొంటున్న విషయాన్ని ఆమె ప్రస్తావిస్తూ, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలే తప్ప, దాడులు చేసి మనుషులను హతమార్చడం అన్యాయమని అన్నారు. ఆమెరికా వెంటనే స్పందించి, దాడులకు నిలిపివేయాలని ఆమె కోరారు.

## శాఖాహార ప్రచారం కోసమే ప్రపంచ వేగన్ దినోత్సవం

**ఐక్యరాజ్యసమితి :** పండ్లు, కాయలు, ఆకుకూరలు, కూరగాయలు, ఆహార ధాన్యాలు, పప్పులు, నట్స్, గింజలు, సూపర్‌ఫుడ్స్ లాంటి వృక్ష సంబంధ ఆహార పదార్థాలను వేగన్ ఫుడ్‌గా వర్గీకరిస్తారు. వృక్ష లేదా మొక్కల నుంచి లభించే ఉత్పత్తులను మాత్రమే తమ ఆహారంగా తీసుకునే వ్యక్తులను వేగన్స్ అని, ఇలాంటి ఆహార పదార్థాలను తీసుకోవాలని ప్రచారం చేసే ఉద్యమాన్ని వేగనిజం అని పిలుస్తున్నాం. జంతు సంబంధ మాంసం, పాలు, పాల ఉత్పత్తులు, జంతు కొవ్వు, గుడ్లు, తేనె లాంటి ఆహార పదార్థాలకు దూరంగా కేవలం మొక్కలు లేదా వృక్షాల నుంచి లభించే ఉత్పత్తులను వినియోగించడం, వీటి ప్రాధాన్యాలను వివరించడం, వేగనివ్వండి పాటించడానికి ప్రజలను చైతన్య పరచడం లాంటి ఉన్నత లక్ష్యాలతో 1994 నుంచి ప్రతి ఏట 01 నవంబర్న ప్రపంచ వేగన్ దినోత్సవాన్ని పాటించుట ఆనవాయితీగా మారింది. లూయిస్ వాల్లిస్ చొరవతో యూకెలో ఏర్పడిన తొలి వేగన్ సొసైటీ 50వ వార్షికోత్సవం సందర్భంగా ప్రపంచ వేగన్ దినం పాటించుట జరుగుతున్నది. వేగన్ లేదా శాఖాహార ఉత్పత్తులను మాత్రమే తీసుకొనుట మన జీవనశైలిలో అలవాటు అయితే మన ఆరోగ్యంతో పాటు జంతు సంరక్షణ, భూగ్రహ పర్యావరణ పరిరక్షణ కూడా జరుగుతాయని తెలుసుకోవాలి. జంతు సంబంధ ఆహార పదార్థాలతో పాటు జంతు ఉత్పత్తుల నుంచి తయారైన వస్త్రాలు, ఎముకలతో తయారైన ఉత్పత్తులు, తోలు సంబంధ వస్తువులు మొదలగు వాటి వాడకాన్ని కూడా వేగన్స్ నిషేధిస్తారు. జంతు ఉత్పత్తులు తినడం లేదా వాడడంతో జీవ వైవిధ్యత దెబ్బ తినడం, జంతు హింస, సాదు జంతువుల వల్ల అడవుల్లో హరిత క్షేత్రాలు పలుచబడడం, పర్యావరణ కాలుష్యానికి ఆజ్యం పోయడం, భూతాపం పెరగడం లాంటి ప్రతికూల మార్పులకు దారి తీస్తుందని, కేవలం వృక్ష సంబంధ ఆహారం లేదా ఇతర ఉత్పత్తులు వాడడం వల్ల మానవాళి ఆరోగ్యంతో పాటు సుస్థిర పర్యావరణం, జీవ వైవిధ్యం ఫలిస్తాయని తెలుసుకోవాలి. వరల్డ్ వేగన్ డే సందర్భంగా శాఖాహారాన్ని ప్రోత్సహిస్తూ #గోవేగన్, #వేగన్లైఫ్స్టైల్, #ప్లాంట్బేస్డ్యాయిసెస్ లాంటి హాష్యాగులతో సామాజిక మాద్యమాలు, వేగన్ డే వేదికలు, విద్యాలయాల్లో ముమ్మర ప్రచారం చేయడానికి ప్రతి ఒక్కరం కృషి చేద్దాం, ఆరోగ్యకర పౌర సమాజాన్ని/పర్యావరణాన్ని/జంతుజాలాన్ని నిర్మిద్దాం.

## వియత్నాంలో వరద బీభత్సం : 13 మంది మృతి

**హనోయ్ :** వియత్నాంలో రోజుల తరబడి రికార్డు స్థాయిలో వర్షాలు, కొండచరియలు విరిగిపడటంతో కనీసం 13 మంది మరణించగా, 11 మంది గల్లంతవ్వగా,10వేల మంది నిరాశ్రయులయ్యారు. సహాయక బృందాలు సుమారు 26,000 మందిని వరదలు లేదా కొండచరియలు విరిగిపడే ప్రాంతాల నుండి తరలించారు. హనోయ్, హోచిమిన్ నగరాన్ని కలిపే కీలక రవాణా మార్గం అయిన దేశంలోని ఉత్తరదక్షిణ రైల్వే, మూడు రోజులుగా నిలిచిపోయిన తర్వాత శుక్రవారం తెల్లవారుజామున పునరుద్ధరించబడింది. ఈ వారం ప్రారంభంలో కేవలం 24 గంటల్లో హ్యూలో 1,085 మిల్లీమీటర్లు (42 అంగుళాలు) వర్షం నమోదైంది. ఇది వియత్నాంలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక రోజువారీ వర్షపాతం. ప్రధాన మంత్రి ఫామ్ మిన్ చిన్హ్ సహాయ చర్యలను వేగవంతం చేయాలని, ఎవరూ ఆకలితో లేదా ఆశ్రయం లేకుండా ఉండకుండా చూసుకోవడానికి అత్యవసర చర్యలను ఆదేశించారు. విపత్తు అధికారుల ప్రకారం, మధ్య వియత్నాం ప్రాంతం అంతటా దాదాపు 1.20 లక్షల ఇళ్లు వరదలతో మునిగిపోయాయి.నవంబర్ 4 వరకు మధ్య వియత్నాంలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కొనసాగవచ్చని, కొన్ని ప్రాంతాల్లో 700 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని అధికారుల హెచ్చరించారు.ఈ దేశం ప్రపంచంలోనే అత్యంత వరదలకు గురయ్యే దేశాలలో ఒకటి, దాని జనాభాలో దాదాపు సగం మంది అధిక ప్రమాదం ఉన్న ప్రాంతాలలో నివసిస్తున్నారు.



## తక్షణ సాయం
(మొదటి పేజీ తరువాయి)

స్థానికంగా పర్యటించి ప్రజలను నష్టము గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పర్యటించి పూర్తిస్థాయి నష్టాన్ని అంచనా వేయాలని కలెక్టర్ లకు సూచించారు. ప్రాణ నష్టం, పంట నష్టం, పశు సంపద, అన్ని శాఖలకు సంబంధించి ఇన్ఫ్రాస్ట్రక్చర్ నష్టానికి సంబంధించి నివేదికలు తెప్పించుకోవాలన్నారు. ఇందుకు ప్రజాప్రతినిధుల సహకారం కూడా తీసుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాలకు సంబంధించి కలెక్టర్లకు రిపోర్ట్ ఇవ్వాలన్నారు. తుఫాను ప్రభావంతో 12 జిల్లాల్లో తీవ్ర నష్టం జరిగిందని, కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకోవాలని, కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకోవడంలో అలసత్వం వద్దు అని చెప్పారు. కేంద్రం నుంచి రాబట్టుకోవాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం రాబట్టుకుంటుందని అన్నారు. ముంపు ప్రాంతాల్లో తాత్కాలిక పరిష్కారం కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. అధికారులలో సమన్వయ లోపంతో సమస్యలు పెరుగుతున్నాయని, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నాలాల కబ్జాలను తొలగించాల్సిందేనని, వాటి వెనుక ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేసారు. పది మంది కోసం పదివేలమందికి నష్టం జరుగుతుంటే ఉపేక్షించొద్దు అన్నారు. దీనిపై అధికారులు స్పష్టమైన నిర్ణయంతో ముందు కు వెళ్లాల్సిందేనని చెప్పారు. వరదలు తగ్గిన నేపథ్యంలో శానిటేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. వరదల్లో ప్రాణ నష్టం జరిగినచోట రూ.5 లక్షలు పరిహారం ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందుకు సంబధించి వివరాలు సేకరించాలని, అలాగే పంటనష్టం, పశు సంపద నష్టపోయిన చోట వారికి పరిహారం అందించాలని, ఇసుక మేటలు పేరుకున్న రైతులను ఆదుకునేందుకు అంచనాలు వేయాలన్నారు.

ఇండ్లు మునిగిన వారికి ప్రతీ ఇంటికి రూ.15 వేలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఇండ్లు కోల్పోయి నిరాశ్రయులైన వారిని గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని ఆదేశాలు ఇచ్చారు. మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.స్మార్ట్ సిటీలో చేయాల్సిన పనులపై ప్రత్యేక నివేదిక తయారు చేయాలని, ఎక్కడా పనులు ఆపే ప్రసక్తి ఉండొద్దని,క్షేత్రస్థాయిలో ఒక కోఆర్డినేషన్ కమిటీ వేసుకుని పనిచేయాలన్నారు.

వాతావరణ మార్పులతో క్లౌడ్ బరస్ట్ అనేది నిత్యకృత్యమైందని,దీనికి శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.అధికారులు నిర్లక్ష్యం వదలండి క్షేత్రస్థాయికి వెళ్లండని, కలెక్టర్లు ఫీల్డ్ విజిట్స్ చేయాల్సిందేనని ఆదేశాలు ఇచ్చారు.

**హెలికాప్టర్ ద్వారా సీఎం రేవంత్ ఏరియల్ వ్యూ**

తుఫాన్ ఎఫెక్ట్ కురిసిన భారీ వర్షాలకు ట్రైసిటీస్ అయిన హనుమకొండ, కాజీపేట, వరంగల్లోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఈమేరకు శుక్రవారం వరద ప్రభావిత ప్రాంతాలను సీఎం రేవంత్ హెలికాప్టర్ ద్వారా ఏరియల్ వ్యూ చేశారు. సీఎం వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం హనుమకొండలోని వర్షానికి దెబ్బతిన్న వివిధ ప్రాంతాలలో సిఎం రేవంత్ రెడ్డి మంత్రులతో కలిసి పర్యటించారు. సిఎం వెంట రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ఫైనాన్స్ కమిషనర్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, డిప్యూటీ స్పీకర్ రామచంద్రనాయక్, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు తదితరులు ఉన్నారు.

**ముంపు శాశ్వత పరిష్కారం చూపి నగరాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి**
**సీఎంకి వామపక్షాల నాయకుల వినతి**

ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ఆర్ట్స్, సైన్స్ కాలేజీ గ్రౌండ్‌లో ముఖ్య మంత్రిని జిల్లా వామపక్ష పార్టీల జిల్లా ప్రతినిధి బృందం కలిసి, వరద ముంపు నుండి వరంగల్ మహా నగరానికి శాశ్వత పరిష్కారం చేపట్టాలని, హనుమకొండ నగరాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని వినతి పత్రాన్ని అందచేసి కోరారు. దీనికి స్పందిస్తూ ముఖ్యమంత్రి సమీక్ష సమావేశంలో మాట్లాడు తానని చెప్పారు. ముంథా తుఫాన్ కారణంగా వరంగల్ మహా నగరం తీవ్రంగా నష్టపోయిందని, ప్రధానంగా ముంపు ప్రాంతంలో మునిగిపోయిన ఇండ్లను అధికారులు సందర్శించి వారు కోలుకునే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నామన్నారు. అలాగే ప్రతికుటుంబానికి తగిన నష్టపరిహారాన్ని చెల్లించాలని, యుద్ధ ప్రాతిపదికన తెగిపోయిన రోడ్లను, డివైడర్లను పునర్నిర్మాణం చేయాలని,ఆరోగ్య సమస్యలు తలత్తెకుండా డ్రైనేజీ, పారిశుద్ధ్య, సానిటేషన్ పనులను నిరంతర ప్రక్రియగా చేపట్టాలి. నగరంలో అండర్గ్రౌన్ సిస్టమ్ను ఏర్పాటు చేయాలని కోరారు. వరంగల్ మహానగరానికి ప్రత్యేకంగా వరద సహాయం కొరకు సియం సహాయనిధి నుండి నిధులు కేటాయించాలని, అలాగే హైద్రాబాద్ తరువాత 2వ నగరంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్ మహానగరానికి అభివృద్ధి నిధులు కేటాయించాలని కోరుతున్నామన్నారు. ఈ వినతి పత్రాన్ని అందచేసిన వామపక్షాల ప్రతినిధి బృందంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సిరబోయిన కరుణాకర్,ఆదరి శ్రీనివాస్, సీపీఎం జిల్లా కార్యదర్శి జి. ప్రభాకర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎం. చుక్కయ్య, బోట్ల చక్రపాణి, గౌడుగు వెంకట్, ఆర్ఎస్పీ జిల్లా కార్యదర్శి కౌడగాని శివాజీలు ఉన్నారు.

## 'ఆర్ఎస్ఎస్‌ను నిషేధించాల్సిందే'
(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ఉదహరించారు. ఆర్ఎస్ఎస్‌ను నిషేధించాలని మరోసారి వ్యాఖ్యానించడాన్ని విలేకరులు ప్రశ్నించగా మల్లికార్జున్ ఖర్గే స్పందిస్తూ 'ఇది నా వ్యక్తిగత అభిప్రాయం. శాంతిభద్రతలకు సంబంధించిన చాలా సమస్యలు బిజెపిఆర్ఎస్ఎస్ వల్లే తలెత్తుతున్నాయి కాబట్టి నేను దీనిని బహిరంగంగానే చెబుతా' అని సమాధానమిచ్చారు. పటేల్ మనముందు ఉంచిన విషయాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా గమనించాలని కాంగ్రెస్ చీఫ్ కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు ఆర్ఎస్ఎస్‌తో సహవాసం చేయడంపై నిషేధాన్ని ఎత్తివేయడం గురించి అడిగినప్పుడు, పటేల్ స్వయంగా ఆర్ఎస్ఎస్‌ను నిషేధించినప్పుడు 'అప్పుడు ఆయన సహజంగానే మన వల్లభాయ్ పటేల్ జీని అగౌరవపరుస్తున్నారు. పటేల్ జీ ఆర్ఎస్ఎస్‌ను నిషేధించడానికి అన్ని కారణాలను తెలియజేశారు. అక్కడ ఎలాంటి అస్పష్టత లేదు' అని ఖర్గే అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఐక్యత, శాంతిని తీసుకురావాలని కోరుకున్నారని, దాని కోసం నేను పోరాడుతున్నాను అని కాంగ్రెస్ చీఫ్ పేర్కొన్నారు. 'కానీ దేశంలో ఐక్యతను తీసుకువచ్చిన తర్వాత, ఆ ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించే ఎవరికైనా గుణపాఠం నేర్పించాలి. ఆ ఐక్యతను విచ్ఛిన్నం చేసే వ్యక్తులు ఎవరో మీకు తెలుసు' అని ఖర్గే చెప్పారు. పటేల్‌ను నెహ్రూ భారతదేశ ఐక్యత నిర్మాణశిల్పి అని పిలిచారని మల్లి కార్జున్ ఖర్గే గుర్తుచేశారు.

**స్వాతంత్ర్యఉద్యమంలో పాత్రలేని భావజాలం దుర్వినియోగం:జైరాంరమేశ్**

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్‌పార్టీ బిజెపిఆర్ఎస్ఎస్‌పై విమర్శలదాడితో విరుచుకుపడింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరాం రమేశ్ విమర్శలదాడితో విరుచుకుపడ్డారు.'పటేల్ మాటల్లోనే చెప్పాలంటే మహాత్మాగాంధీ హత్య అనే దారుణమైన వాతావరణాన్ని సృష్టించిన వారి దుర్వినియోగ భావజాలాన్ని చూసి నిస్వార్థ పరులైన వ్యక్తులు భయపడి ఉండేవారు. ముఖ్యంగా 2014 నుంచి చరిత్ర 'G2, వారి పర్యావరణ వ్యవస్థ' ద్వారా స్పష్టమైన తప్పుడు ప్రాతినిధ్యంతోపాటు వక్రీకరణకు గురైంది' అని జైరాంరమేశ్ పేర్కొన్నారు. ఆయన ఈ విషయాన్ని తన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే
(మొదటి పేజీ తరువాయి)

వరదల కారణంగా జరిగిన పంటల నష్టంపై యుద్ధ ప్రాతిపదికన సర్వే చేపట్టి పూర్తి చేయాలని ప్రభుత్వానికి నివేదికలు ఇవ్వాలన్నారు. జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం కోసం కృషి చేస్తానని చెప్పారు. అప్పులు చేసి సాగు చేసిన రైతులకు తగిన ప్రతిఫలం దక్కకుండా ఆర్థికంగా దెబ్బతిన్నారని, రైతాంగ నష్టంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, విద్యుత్ పునరుద్దరణ పనులు తక్షణమే పూర్తి చేయాలని, ఇండ్లు కోల్పోయిన నిరాశ్రయులైన పేదలకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, తహశిల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపిడిఓ భారతి,వ్యవసాయాధికారిణి నర్మద, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, వీర హనుమంతరావు, సిపిఐ నాయకులు సలిగంటి శ్రీనివాస్, భూక్యా ధ్రస్తు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు పాల్గొన్నారు.

## నామినేటెడ్ పదవులు
(మొదటి పేజీ తరువాయి)

మంచి పట్టు ఉన్న సీనియర్ నాయకులు సుదర్శన రెడ్డిని ప్రభుత్వ సలహాదారునిగా నియమించడం, ఎంఎల్ఎ ప్రేమ్ సాగర్ రావ్‌ను అత్యంత కీలకమైన పౌర సరఫరాల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడం హర్షించదగ్గ విషయమని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుపై సలహాదారునిగా సుదర్శన్ రెడ్డిని నియమించడం వల్ల రాష్ట్రంలో పథకాల అమలు మరింత వేగంగా జరిగే అవకాశాలు ఉంటాయన్నారు. సుదర్శన్ రెడ్డి అనుభవం, చిత్తశుద్ధి రాష్ట్ర అభివృద్ధి కి మరింత తోడ్పడుతుందన్నారు. ప్రేమ్‌సాగర్ రావ్‌కు పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం ఇవ్వడం వల్ల ప్రభుత్వం అమలు చేస్తున్న రేషన్ కార్డులు, సన్న బియ్యం పథకాలు, ధాన్యం కొనుగోలు లాంటి కీలకమైన పనులు మరింత వేగంగా జరుగుతాయన్నారు.

## రామారావు దారుణ హత్య
(మొదటి పేజీ తరువాయి)

దించారు. రామారావు శరీరంపై ఏడు కత్తి గాట్లు ఉన్నాయి. రామారావు సుదీర్ఘకాలం పాతర్లపాడు గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. సౌమ్యుడిగా పేరున్న రామారావు హత్య ఈ ప్రాంతంలో ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామంలో పికెట్ ఏర్పా టు చేశారు. లా అండ్ ఆర్డర్ అడిషనల్ డిసిపి ఆర్. ప్రసాదరావు, వైరా, మధిర సబ్ డివిజన్ పోలీసులు గ్రామంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**సిపిఎం నేతల నివాళి :**

రామారావు మృతిపట్ల సిపిఎం, జిల్లా రాష్ట్ర కమిటీలు తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశాయి. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర నాయకులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, వై. విక్రం, మదుపల్లి గోపాలరావు తదితరులు అరుణ పతాకాన్ని ఉంచి నివాళులర్పించారు.

**సిపిఐ నేతల నివాళి :**

రామారావు మృతిపట్ల సిపిఐ తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సిపిఎం కార్యాలయంలో రామారావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ రామారావు హత్యను సిపిఐ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. హత్య కారకులను కనుగొని కఠినంగా శిక్షించాలన్నారు. హత్యా రాజకీయాలతో ఎవరు మనుగడ సాగించలేరని ఆయన స్పష్టం చేశారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేశ్, సహయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి , పావులూరి మల్లికార్జున్, చింతకాని మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, వివిధ సంఘాల నాయకులు ఇటికాల రామకృష్ణ, తాటి నిర్మల, ఆళ్ల రవీందర్, తాళ్లూరి యాదగిరి, కొత్తపల్లి రమేశ్, చింతల రమేశ్, శివ తదితరులు ఉన్నారు.

## కేరళ మరో చరిత్ర
(మొదటి పేజీ తరువాయి)

ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పేదల పట్ల చూపే పక్షపాతాన్ని వెల్లడిస్తుంది. 'కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, ధనిక పక్షపాత పాలనా విధానాలకు ఒక సవాలుగా ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం తీసుకున్న చర్య ఫలితంగా ఒక ప్రత్యామ్నాయంగా ముందుకు వచ్చింది. మనుషులకు ఆహారం, దుస్తులు, నివాసం వంటి ప్రాథమిక అవసరాలను నిర్ధారించడమే అభివృద్ధి ప్రాథమిక లక్ష్యం అని వామపక్షాలు విశ్వసిస్తాయి' అని బినోయ్ విశ్వం హర్షం వ్యక్తం చేశారు. 'ఐక్య కేరళ ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రగతిశీల వామపక్ష ప్రభుత్వాల దార్శనికత, విధానాలు ఈ దిశలోనే ఉన్నాయి. 1957లో మొదటి కేరళ ప్రభుత్వం ఆక్రమణలను నిషేధించింది. 1970లలో భూసంస్కరణలను అమలు చేసి, భూమిపై పని చేసే వారికి భూమిపై శాశ్వత హక్కులు కల్పించి, నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించడానికి 'లక్ష్యం వీడు' పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వం, నేడు మనం సాధించిన గర్వించదగ్గ స్థితికి పునాది రాయి వేసిందన్నారు. ఇటువంటి అనేక చర్యల ద్వారానే ఒకప్పుడు కులాల పిచ్చి, పేదరికం, కరువు విపరీతంగా ఉన్న కేరళను భారత దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా మార్చగలిగామని ఆయన గర్వంగా ప్రకటించారు. వాటి ఫలితం ఏమిటంటే అన్ని మానవ వనరుల సూచికలలో మనం నిరంతరం మొదటి స్థానాన్ని నిలబెట్టుకోగలిగాము. ఆహార లోటు రాష్ట్రంగా ఉన్నప్పటికీ , సమర్థవంతమైన ప్రజాపంపిణీ వ్యవస్థ, మార్కెట్ జోక్యం ద్వారా ధరల పెరుగుదలను ఆపగలిగాము. ఆహార భద్రతను నిర్ధారించగలిగాము. 2021లో నీతి ఆయోగ్ గణాంకాల ప్రకారం కేరళ రాష్ట్రంలో తీవ్ర పేదరిక సూచిక 0.7 శాతం మాత్రమే, ఇది దేశంలోనే అత్యల్పంగా ఉంది. గత నాలుగున్నర సంవత్సరాల కృషి ద్వారా కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం తీవ్ర పేదరికాన్ని నిర్మూలించడం ద్వారా మార్గదర్శకంగా ఉందని బినోయ్ విశ్వం తెలిపారు.

## నిధులు విడుదల
(మొదటి పేజీ తరువాయి)

ప్రతినెలా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు విడుదల చేస్తున్నట్టు ఆర్థిక శాఖ అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇందులో భాగంగా అక్టోబర్ మాసానికి సంబంధించి ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ 712 కోట్లను అలాగే 10 లక్షల లోపు పెండింగ్‌లో ఉన్న బిల్లులను కూడా చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖకు చెందిన 46,956 బిల్లుల తాలూకు రూ 320 కోట్లను విడుదల చేయాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రోడ్లు,భవనాల శాఖకు చెందిన రూ.10 లక్షల లోపు విలువగల 3,610 బిల్లుల మొత్తం సుమారు రూ.95 కోట్లను కూడా ఆర్థిక శాఖ విడుదల చేసింది. అలాగే పంచాయతీరాజ్, గ్రామీణ స్థానిక సంస్థలకు సంబంధించిన 43,364 బిల్లుల మొత్తం రూ 225 కోట్ల రూపాయలను కూడా విడుదల చేశారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

## సాయం చేస్తాం
(మొదటి పేజీ తరువాయి)

పనిచేయాలి' అని ఎపెక్ ప్రారంభ సమావేశంలో జి జిన్ పింగ్ అన్నారు. 'ప్రపంచం వేగవంతమైన మార్పుల కాలంలోకి వెళుతోంది, అంతర్జాతీయ పరిస్థితి మరింత సంక్లిష్టంగా, అస్థిరంగా మారుతోంది. చైనా నుండి సరఫరా గొలుసులను విడదీయడానికి అమెరికా చేసిన ప్రయత్నాలకు ప్రతీకారంగా, సరఫరా గొలుసు స్థిరత్వాన్ని కొనసాగించాలని' ఆయన పిలుపునిచ్చారు. హరిత పరిశ్రమలు, క్లీన్ ఎనర్జీలో సహకారాన్ని విస్తరించడానికి ఇతర దేశాలతో కలిసి పనిచేసేందుకు ఆశాభావం వ్యక్తం చేశారు.

పదకొండు సంవత్సరాలలో జిన్‌పింగ్ మొదటి సారి దక్షిణ కొరియాలో పర్యటించారు. శిఖరాగ్ర సమావేశంలో భాగంగా శుక్రవారం జపాన్ ప్రధాన మంత్రి సనే తకైచి, కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ, థాయ్ ప్రధానమంత్రి అనుతిన్ చార్ విరాకుల్‌లతో జిన్ పింగ్ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. ఉత్తర కొరియా అణు కార్యక్రమం గురించి చర్చించే సమావేశం కోసం జిన్‌పింగ్ శనివారం దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌తో సమావేశం కానున్నారు.

ట్రంప్ తరపున శిఖరాగ్ర సమావేశానికి హాజరైన అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ మాట్లాడుతూ, తన వాణిజ్య సంబంధాలను తిరిగి సమతుల్యం చేసుకునేందుకు అమెరికా తీసుకున్న చర్య 'ప్రతి దేశం న్యాయమైన, పరస్పర నిబంధనలపై పనిచేస్తుందని' నిర్ధారిస్తుందని అన్నారు. అమెరికా 'బలహీన రంగాలపై ఆధారపడటాన్ని తగ్గించే ప్రస్తుతం ఉన్న ఉత్పత్తి నెట్‌వర్క్‌లను నిర్మించడానికి తన వాణిజ్య భాగస్వాములతో పెట్టుబడి పెడుతోంది' అని ఆయన అన్నారు.

**సవాళ్ళు ఎదుర్కొంటున్న ఎపెక్**

1989లో పెరిగిన ప్రపంచీకరణ కాలంలో స్థాపించబడిన ఎపెక్, ప్రాంతీయ ఆర్థిక ఏకీకరణను వేగవంతం చేయడానికి స్వేచ్ఛా, బహిరంగ వాణిజ్యం, పెట్టుబడిని సమర్థిస్తుంది. కానీ, ఎపెక్ ప్రాంతం ప్రస్తుతం అమెరికా, చైనా మధ్య వ్యూహాత్మక పోటీలు, సరఫరా గొలుసు బలహీనతలు, వృద్ధాప్య జనాభా, ఉద్యోగాలపై ఎఐ ప్రభావం వంటి సవాళ్లను ఎదుర్కొంటోంది. ఆసియా–పసిఫిక్ రిమ్ దేశాలలోని 21 దేశాల ఆర్థిక వ్యవస్థల నాయకులు, ఇతర ప్రతినిధులు ఎపెక్ సమావేశంలో పాల్గొంటూ ఆర్థిక సహకారాన్ని ఎలా ప్రోత్సహించాలో, ఉమ్మడి సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో అనే అంశాలపై చర్చించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## తుపాను బాధిత కుటుంబాలను ఆదుకోండి

కార్పొరేట్ సంస్థలకు మంత్రి శ్రీధర్ బాబు పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మొంథా తుపానుతో పాటు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు ఆపన్న హస్తం అందించాల్సిందిగా పారిశ్రామిక, వాణిజ్య సంస్థలకు ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. ముఖ్యంగా భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల్లోని పౌరులు, రైతుల కోసం సహాయ, పునరావాస శిబిరాలు నిర్వహించాలని పలు సంస్థలకు లేఖలు రాసారు. సామాజిక బాధ్యతగా నిత్యావసర వస్తువులు, ఔషధాలు, వైద్య సహాయం అందించాని శ్రీధర్ బాబు కోరారు. ఆపత్కాలంలో వారికి అండగా నిలిచి చితికిన కుటుంబాలను తిరిగి నిలబెట్టాలని ఆయన పేర్కొన్నారు. పొలాల్లోని పంటలు వరదలకు దెబ్బతిన్నాయని, మార్కెట్లకు తరలించిన ధాన్యం, మక్కలు వాన నీటిలో తడిసాయని ఆయన వెల్లడించారు.



## బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో అన్ని రంగాలలో విధ్వంసం సృష్టించింది

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ తమ పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని భవిష్యత్తులో కోలుకోలేనివిధంగా అన్ని రంగాలలో కూడా ఊహకు అందని రీతిలో విధ్వంసం సృష్టించిందని రాష్ట్ర రెవెన్యూ , గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. అయినప్పటికీ ప్రజలపై భారం మోపకుండా రాష్ట్ర ఆర్థిక స్దితిగతులను మెరుగుపరుచుకుంటూ, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో రెహమత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జులతో మంత్రి పొంగులేటి శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎన్నికల్లో తాము ఇచ్చిన హామీలను తూ.చ. తప్పకుండా అమలు చేస్తున్నామని, గడచిన 22 నెలల్లో సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే జుబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తాయన్నారు. గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని ఆరోపించారు. ఈ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం 14వేల కొత్త రేషన్ కార్డులు ఇచ్చిందని, 8వేల మంది పేర్లను రేషన్ కార్డులలో జతచేశామని వివరించారు. ఈ సమావేశంలో ఎంఎల్‌ఎలు వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, ఎంఎల్‌సి శంకర్ నాయిక్, రోడ్ సేఫ్టీ అధారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంఎల్‌ఎ నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను సాధనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టు బడి ఉన్నదని మంత్రి వాటికి శ్రీహరి తెలిపారు. రిజర్వేషన్ల సాధనకు అవసరమైతే ప్రజలతో కలిసి ఉద్యమానిన చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు 'ఒయుబిసి జెఎసి' ఆధ్వర్యంలో 'చట్టసభలలో బిసిల రిజర్వేషన్ల సాధన''కు హైదరాబాద్‌లోని ఒయులో శుక్రవారం ధర్మ దీక్షను నిర్వహించారు. ఈ దీక్షకు నిజ్జన రమేష్ ముదిరాజ్, దేశాగాని సాంబశివ గౌడ్ అధ్యక్షత వహించారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య దీక్ష శిబిరంలో ఉన్న వారికి పూల మాల వేసి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లను సాధించే వరకు ఉద్యమం ఆగదన్నారు. విద్యార్థులతో కలిసి పెద్ద ఉద్యమాన్ని నిర్మిస్తామన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని శాసనసభ ఏక గ్రీవంగా బిల్లులను ఆమోదించినప్పటికీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు చేసే పోరాటంలో న్యాయం ఉందన్నారు. టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల కోసం అందరూ కలిసి కట్టుగా పోరాటం చేయాలన్నారు. మాజీ ఎంపి వి.హనుమంతరావు మాట్లాడుతూ రిజర్వేషన్ల అమలు కోసం త్వరలోనే ఢిల్లీ ఉద్యమించాలని , అందరూ కలిసి ఢిల్లీకి వెళ్దామన్నారు. బిసి జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిసిల పట్ల కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రేమ ఉంటే వెంటనే రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల అంశాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని తాను మొదటి నుంచి కూడా చెబుతున్నానని గుర్తు చేశారు. ఈ దీక్షకు ప్రొఫెసర్ రామయ్య శాపర్డ్ మద్దతునివ్వగా, విద్యార్థి సంఘం నాయకులు వట్టి కూటి రామారావు గౌడ్, అల్లుడు జగన్ ముదిరాజ్, మాలిగ లింగ స్వామి,శివరాత్రి ప్రశాంత్,రెడ్డి శ్రీనివాస్ బొల్లెపల్లి స్వామి గౌడ్, మాసంపల్లి అరుణ్ కుమార్, నక్క శ్రీశైలం యాదవ్, బైరు నాగరాజు గౌడ్, అవార్‌వేణు, బొమ్మహన్మంత్‌రావు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు

ఇంటర్మీడియట్ బోర్డ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలను నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డ్ ప్రకటించింది. ఈ మేరకు ఇంటర్మీడియట్ బోర్డ్ కార్యదర్శి ఎస్.కృష్ణ ఆదత్య శుక్రవరాం షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమై, 21వ తేదీ నాటికి పూర్తవుతాయి. ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు బోర్డ్ తెలిపింది. ఇప్పటివరకు కేవలం సెకండ్ ఇయర్ విద్యార్థులకు మాత్రమే ప్రాక్టికల్ పరీక్షలు జరుగగా, ఈసారి ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు కూడా ల్యాబ్ ప్రాక్టికల్స్ నిర్వహించాలని బోర్డు నిర్ణయించింది. దీంతో జనవరి 21వ తేదీన ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష, జనవరి 23వ తేదీన ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, జనవరి 24వ తేదీన ఎన్విరాన్ మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలను ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహించనున్నారు.

**ఇంటర్ మొదటి సంవత్సరం షెడ్యూల్..**

| **తేదీ...** | **పరీక్ష** |
|---|---|
| 25022026 | సెకండ్ లాంగ్వేజ్. |
| 27022026 | ఇంగ్లీష్ పేపర్ 1. |
| 02032026 | మ్యాథ్స్ పేపర్ 1ఎ (బోటని పేపర్1, పొలిటికల్ సైన్స్ పేపర్ 1) |
| 05032025 | మ్యాథ్స్ పేపర్ 1బి, (జువాలజీ పేపర్ 1,హిస్టరీ పేపర్1) |
| 09032025 | ఫిజిక్స్ పేపర్1, ఎకనామిక్స్ పేపర్ 1 |
| 12032025 | కెమెస్ట్రీ పేపర్1, కామర్స్ పేపర్1 |
| 14032025 | పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్1,బ్రిడ్జ్ కోర్స్ మ్యాథ్స్ పేపర్1 |
| 17032025 | మాడ్రన్ లాంగ్వేజ్ పేపర్1, జియోగ్రఫి పేపర్ 1 |

**ఇంటర్ ద్వితీయ సంవత్సరం షెడ్యూల్..**

| **తేదీ...** | **పరీక్ష** |
|---|---|
| 26022026 | సెకండ్ లాంగ్వేజ్ పేపర్ 2. |
| 28022026 | ఇంగ్లీష్ పేపర్ 2. |
| 03032026 | మ్యాథ్స్ పేపర్ 2ఎ(బోటని పేపర్2, పొలిటికల్ సైన్స్ పేపర్ 2) |
| 06032025 | మ్యాథ్స్ పేపర్ 2బి, (జువాలజీ పేపర్ 2, హిస్టరీ పేపర్2) |
| 10032025 | ఫిజిక్స్ పేపర్2, ఎకనామిక్స్ పేపర్ 2 |
| 13032025 | కెమెస్ట్రీ పేపర్2, కామర్స్ పేపర్2 |
| 16032025 | పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్2, బ్రిడ్జ్ కోర్స్ మ్యాథ్స్ పేపర్2 |
| 18032025 | మాడ్రన్ లాంగ్వేజ్ పేపర్2, జియోగ్రఫి పేపర్ 2 |

# మొంథా తుఫాన్‌కి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ





**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** మొంథా తుఫాన్‌కి నష్టపోయిన రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ పట్టణంలో తుఫాన్‌కి నేలకు పడ్డ వరి పంటను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నష్టపోయిన రైతాంగానికి మన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఎకరాకు రూ.10వేలు ఇస్తామని చెప్పడం మంచిదే కానీ, పెట్టుబడులు ఎక్కువ కావడంతో అవి సరిపోవన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం రూ.20వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. స్థానిక వ్యవసాయ అధికారులు ఈ ప్రాంతంలో కేవలం 2 శాతం మాత్రమే నష్టం జరిగిందని తెలుపుతున్నారని ఇది సరికాదన్నారు. ఇలా ప్రకటిస్తే నష్టపరిహారం రాదని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. పంట పొలాలను పరిశీలించిన అనంతరం స్థానిక ఆర్‌డిఓకు వివిధ డిమాండ్లతో కూడిన మెమోరాండాన్ని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంబాల శ్రీనివాస్, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి, సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, రైతు సంఘం పట్టణ అధ్యక్షులు జక్కుల రమేష్, మండల అధ్యక్షులు పోనుగుబాటి వాసుదేవరావు, సోమగాని కృష్ణ, చన్నగాని సైదులు, దేవరం శ్రీనివాస్‌రెడ్డి, గోసుల శ్రీనివాస్, కటారి వెంకన్న, కాకి అమృతారెడ్డి, లింగరాజు, జంగాల సైదులు, బొంబో సైదులు, తెల్లబోయిన సింహాద్రి, తెల్లబోయిన వెంకన్న, మైకు శ్రీను పాల్గొన్నారు.

**అంచనాలు కాదు పరిహారమివ్వండి : రైతు సంఘం సమావేశంలో బాగం**

**ఖమ్మం :** రైతాంగం దెబ్బతిన్న ప్రతిసారి పంటల నష్టపరిహారం అంచనా వేయడం వరకే పరిమితమవుతున్నారని పరిహారం పరిహాసంగా మారుతుందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు ఆరోపించారు. ప్రకృతి విపత్తు ఏర్పడిన ప్రతిసారి పాలకులు పంటల అంచనాలంటూ ప్రకటనలకే పరిమితమవుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం ఖమ్మంలో శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ అధ్యక్షత వహించగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ ఈ ఏడాది అతివృష్టి రైతులను తీవ్రంగా నష్టపరిచిందన్నారు.

మొన్నటి వరకు అతివృష్టి కారణంగా మెట్ట పంటలైన పత్తి, అపరాలు, ఉద్యానవన పంటలు దెబ్బతినగా మొంథా తుఫాన్ కారణంగా వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఎకరాకు రూ. 30వేల పైబడి పెట్టుబడులు పెట్టారని తీరా కోతకు వచ్చే సమయంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి పూర్తిగా నేలవాలిందన్నారు. భారీ వర్షాల కారణంగా నదులు, వాగుల పరివాహక ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయని ఆయన తెలిపారు. పెట్టుబడులు పెరిగి దిగుబడులు తరిగి రైతులు నష్టపోతున్నారని ప్రకృతి సైతం రైతులపై పగబట్టినట్లుగా ఉందని హేమంతరావు తెలిపారు. ప్రకృతి విపత్తులు సంభవించగానే నష్టం అంచనాలను వేస్తున్నామంటూ పాలకులు ప్రకటనలను జారీ చేస్తున్నారని కాని పరిహారం మాత్రం అందించడం లేదన్నారు. గడిచిన రెండేళ్లలో పలుమార్లు ప్రకృతి విపత్తులు సంభవించాయని ఆయన తెలిపారు.

ఈ ఏడాది పత్తి రైతులను ఆదుకోవాలనే డిమాండ్ డిమాండ్‌గానే మిగిలిందని ఇప్పుడు వరి రైతులకు ఆ పరిస్థితి తీసుకు రాకుండా వెంటనే పరిహారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు జాగర్లమూడి రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఎఐబిఇఎ, ఐప్సో నేత**

# రామరాజు ఆకస్మిక మృతి

సిపిఐ నేతల తీవ్ర దిగ్భ్రాంతి





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐబిఇఎ), అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) నేత ఎఆర్.రామ రాజు (69) ఆకస్మికంగా మరణించారు. హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని తన నివాసంలో గురువారం రాత్రి 9 గంటలకు ఆయనకు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో, వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను హైదర్‌గూడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్థరాత్రి 12.30 గంటల సమయంలో తుది శ్వాస విడిచారు. రామరాజు రంగారెడ్డి జిల్లా సిపిఐ ఉద్యమ నిర్మాత ఎ.ఆర్.దేవరాజు ప్రథమ కుమారుడు. రామరాజుకు భార్య రాధ, కుమారులు ఉత్తమ్, ఉదయ్ ఉన్నారు. విద్యార్థి దశలోనే ఎఐఎస్‌ఎఫ్‌లో చేరిన రామరాజు ఆ తర్వాత బ్యాంకు ఉద్యోగంలో చేరి ఎఐబిఈఎ నాయకులుగా, ఐప్సో నేతగా బాధ్యతలు నిర్వర్తించారు. రామరాజు తుది శ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా కొనసాగారు. గురువారం సాయంత్రం 5 గంటలకు దోమలగూడలోని శ్మశాన వాటికలో రామరాజు భౌతికాకయానికి ఆయన పెద్ద కుమారుడు ఉత్తమ్ అంత్యక్రియలను నిర్వహించారు.

**నేతల ఘన నివాళి :** రామరాజు మరణం పట్ల పలువురు సిపిఐ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, ఆంధ్రాబ్యాంక్ అవార్డు ఎంప్లాయిస్ యూనియన్ మాజీ నేత, నవచేతన విజ్ఞాన సమితి కార్యదర్శి బి.ఎస్.ఆర్. మోహన్‌రెడ్డిలు రామరాజు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు .అంతకు ముందు రామరాజు భౌతికకాయంపై సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టినరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, కార్యవర్గ సభ్యులు, ఎస్.ఛాయాదేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ పార్టీ పతాకాన్ని కప్పి నివాళి అర్పించారు. రామరాజుకు ఐప్సో నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. రామరాజు భౌతికకాయంపై ఐప్సో రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్, ప్రధాన కార్యదర్శి జి.నాగేశ్వర రావు ఐప్సో పతాకాన్ని కప్పి నివాళులు అర్పించారు. ఐప్సో అధ్యక్షవర్గ సభ్యులు తిప్పర్తి యాదయ్య, ప్రధాన కార్యదర్శి కాచం సత్య నారాయణ, రాష్ట్ర కార్యదర్శి అనూష, హైదరాబాద్ జిల్లా కమిటీ అధ్యక్షుడు గురుబచ్చన్ సింగ్, ఉపాధ్యక్షులు బొమ్మగాని నాగభూషణం, కార్యదర్శులు సుధావన్ నివాళులు అర్పించారు. ఎఐబిఇఎ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు, ఎఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు ఎన్.శ్రీకాంత్ నివాళి అర్పించారు.

**రామరాజు అకాల మరణం తీవ్ర విషాదం: కూనంనేని సాంబశివరావు**

ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎఆర్.రామరాజు ఆకస్మిక మరణం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రామరాజు అకాల మరణం తీవ్ర విషాదాన్ని కలిగించిందని ఒక ప్రకటనలో తెలిపారు. రామరాజు మృతి పట్ల సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రామరాజు మరణం పట్ల అమెరికాలో ఉన్న సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కె.నారాయణ, ఎఐటియుసి జాతీయ మాజీ నాయకురాలు డాక్టర్ బి.వి.విజయలక్ష్మి సంతాపాన్ని ఆయన కుటుంబ సభ్యలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సంతాపం**

ఎఐబిఇఎ నాయకులు ఎ.ఆర్.రామరాజు అకాల మరణం పట్ల సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రగాఢ సంతాపాన్ని కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. రామరాజుతో పాటు ఆయన కుటుంబ సభ్యులు చిన్నతనం నుండి పార్టీ పట్ల నిబద్ధతతో, అంకితభావంతో పనిచేశారని సంతాప సందేశంలో ఆయన పేర్కొన్నారు.

# కార్మిక నాలుగు కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

ఎఐటియుసి రాష్ట్ర 106వ ఆవిర్భావ దినోత్సవంలో అధ్యక్షుడు ఎం.డి.యూసుఫ్ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్రంలో బిజెపినేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంపెట్టుబడి వర్గాలకు ఊడిగం చేస్తూ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి.యూసుఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎఐటియూసి 106వ ఆవిర్భావదినోత్సవ సందర్భంగా జీడిమెట్ల లో ఎఐటియుసి పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూసుఫ్ మాట్లాడుతూ ఎఐటియూసి 1920వ సంవత్సరంలో ఆవిర్భావించిన తర్వాతనే కార్మిక చట్టాలు వచ్చాయన్నారు. 1921లో ఫ్యాక్ట్రిస్ యాక్ట్‌కు సవరణలు, 1923లో కార్మిక నష్టపరిహార చట్టం, 1926లో ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్ యాక్ట్, 1936లో వేతనాలచెల్లింపు చట్టం, 1946 ఇండస్ట్రియల్ ఎంప్లాయిమెంట్ యాక్ట్(స్టాండింగ్ ఆర్డర్స్) చట్టం, 1947లో పారిశ్రామిక వివాదాల చట్టాలను బ్రిటిష్ హయాంలోనే అనేక పోరాటాల ద్వారా ఎఐటియుసి ద్వారా సాధించుకున్నామని తెలిపారు. ఈ కార్మిక వ్యతిరేక కోడ్లను రద్దు చేసి, 44 కార్మిక చట్టాలను పునరుద్ధరిచాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్‌టిసి డిపో వద్ద జిల్లా అధ్యక్షులు కె. స్వామి, గుట్ట యార్డ్ ఐడిపిఎల్ ఆటో అడ్డా వద్ద జిల్లా ఉపాధ్యక్షులుఇ. ఉమా మహేష్, జగద్ గిరి గుట్టలో మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసు రత్నం, రంగారెడ్డి నగర్ భవన నిర్మాణ అడ్డా మరియు గాంధీ నగర్ ఎఐటియూసి కార్యాలయం వద్ద జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్, శ్రీనివాస్ నగర్, హమాలీ అడ్డా 3, మున్సిపల్ కార్యాలయం వద్ద నియోజకవర్గం అధ్యక్షులు వి. హరినాధ రావు, ప్రీమియర్ అలయిస్ కంపెనీ వద్ద దేవేందర్ ప్రసాద్, జి.ఆర్. పవర్ స్విచ్ గేర్ కంపెనీ వద్ద రమేష్ రెడ్డిలు పతాకవిష్కరణ చేసారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ఎమ్. నర్సింహా రెడ్డి, హమాలీ యూనియన్ నాయకులు సుంకి రెడ్డి, సీ. నర్సింలు, కె. మహేష్, బి నాగయ్య, బి. కనకయ్య, భవన నిర్మాణ సంఘం నాయకులు సామ్యూయెల్, మున్సిపల్ యూనియన్ నాయకురాలు టీ. కమల పాల్గొన్నారు.

**కీలక పారిశ్రామిక కారిడార్‌గా**

# ఒఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతం

మంత్రి శ్రీధర్ బాబు పిలుపు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో కీలక పారిశ్రామిక కారిడార్‌గా ఒఆర్ఆర్‌ఆర్ఆర్ మధ్య ప్రాంతం మారబోతుందని.. కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిలో 'జిడిపి' అంటే కేవలం 'గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్' కాదని, గ్రాస్ ఎంపవర్మెంట్ ఆఫ్ పీపుల్(జిఇపి) అని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. భారత్ '15' ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారే ప్రయాణంలో 'తెలంగాణ'ను కీలక భాగస్వామిగా మార్చుతామన్నారు. బేగంపేట్‌లోని ఐటిసి శుక్రవారం నిర్వహించిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) సదరన్ రీజినల్ కౌన్సిల్ సమావేశంలో 'డ్రైవింగ్ ఇండస్ట్రియల్ గ్రోత్ అండ ఇన్నోవేషన్, తెలంగాణ రోడ్ మ్యాప్ టూ త్రీ ట్రిలియన్ డాలర్స్ ఎకానమీ' అనే అంశంపై ఆయన కీలక ఉపన్యాసం చేశారు. 'అర్బన్ ఇంజిన్', 'ఇండస్ట్రియల్ హార్ట్ ల్యాండ', 'రూరల్ ట్రాన్స్ఫర్మేషన్ జోన్' అనే మూడు మూల స్థంభాలుగా తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని ఆయన వివరించారు. కార్యక్రమంలో సిఐఐ సదరన్ రీజియన్ ఛైర్మన్ థామస్ జాన్ ముత్తూట్, డిప్యూటీ ఛైర్మన్ రవి చంద్రన్, సిఐఐ తెలంగాణ కౌన్సిల్ ఛైర్మన్ శివ ప్రసాద్ రెడ్డి, వైస్ ఛైర్మన్ గౌతం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్** GHMC

NIT No. 33/EE/Circle-12/KZ/GHMC/2025-26 తేది: 30.10.2025

**పని పేరు:** బిటి రోడ్-2, జెన్ ఇంప్రూవ్‌మెంట్-1. **అంచనా విలువ / ఇసివి:** రూ.94.00లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** ప్రారంభ తేది: 31.10.2025న మ.3.30గం.ల నుండి, ఆఖరి తేది: 03.11.2025న మ.3.30గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-12, కెజెడ్, జిహెచ్‌ఎంసి, ఖైరతాబాద్. ఫోన్: 9492067578. కమిషనర్, జిహెచ్‌ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-12, (కెజెడ్), జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 9988-PP/CL/ADVT/1/2025-26, Date: 31-10-2025

**కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం**

ఇ-మెయిల్: knrcmnr@rediffmail.com

'ఇ'- ప్రొక్యూర్‌మెంట్ రీకాల్ టెండర్ నోటీసు

నెం. E1/DB/MCK/8201/234/MCK/2025-26, తేది: .10.2025

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్యాలయ భవనానికి చిన్న పనులు మరియు ప్రాథమిక సౌకర్యాలను అందించడానికి ఎంజిఎఫ్ క్రింద **అంచనా వ్యయం:** రూ.49.96 లక్షలు. **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది:** 31.10.2025న సా.04.00గం.ల నుండి, **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ఆఖరి తేది:** 11.11.2025న సా.04.00గం.ల వరకు. మరిన్ని వివరాలకు www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సం/- కమిషనర్, మున్సిపల్ కార్పొరేషన్, కరీంనగర్.

DIPR R.O. No. : 10001-PP/CL/ADVT/1/2025-26, Date: 31-10-2025

తెలంగాణ ప్రభుత్వం

**జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ - మంచిర్యాల జిల్లా**

ఫైల్ ఆర్.సి. సంఖ్య B3/122/2022-23 తేది: 31.10.2025

పత్రిక ప్రకటన

(టెండర్లకు ఆహ్వానం)

మంచిర్యాల జిల్లాలోని షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ (SCDD) ద్వారా నిర్వహించబడుతున్న (17) ప్రభుత్వ యస్.సి. ప్రీమెట్రిక్ మరియు (08) పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలకు 2025-26 ఆర్థిక సంవత్సరమునకు గాను క్రింద తెలుపబడిన సామాగ్రి సరఫరా చేయుట కొరకు గుర్తింపు పొందిన సంస్థల నుండి నాణ్యత గల సామాగ్రి సరఫరా చేయుటకు గాను జిల్లా షెడ్యూల్డు కులముల అభివృద్ధి అధికారి, మంచిర్యాల జిల్లా గారి ద్వారా టెండరుకై దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు మరియు సామాగ్రి యొక్క నమూనా (Samples) కచ్చితంగా తీసుకురాగలరు.

| వ. సం. | పంపిణీ చేయవలసిన సామాగ్రి | EMD మొత్తము | టెండర్ షెడ్యూల్ ఫారమ్ యొక్క ధర |
|---|---|---|---|
| 1 | All in one Books | రూ. 1,00,000/- | రూ. 3,000/- |
| 2 | 10th Class Model Papers | | |
| 3 | Stationery Items: (SSC Boarders) Geometry Boxes, Exam Writing Pads, Ball Point Pens (Blue, Black & Red), Pencils, Sharpeners, Long Scales, Erasers & Water Bottles | | |
| 4 | Sweaters with Monkey Caps | | |
| 5 | Woolen Blankets | | |
| 6 | Slippers | | |
| 7 | Sports Shoes | | |
| 8 | Leather Shoes | | |
| 9 | 3 pairs shocks | | |
| 10 | College & School Bags | | |

| | |
|---|---|
| టెండర్ షెడ్యూలు అమ్మడానికి మరియు స్వీకరించే తేదీలు మరియు స్థలము | 01-11-2025 నుండి 06-11-2025 సాయంత్రం 5-00 గంటల వరకు (SC Development Department, IDOC., Room No. F-3, 1st Floor, Naspur, Mancherial మంచిర్యాల కార్యాలయము సమయంలో) |
| టెండర్ షెడ్యూలు తెరుచు తేది మరియు సమయము | 07-11-2025 రోజున సాయంత్రం 3-00 గంటలకు (జిల్లా అదనపు పాలనధికారి, మంచిర్యాల గారి చాంబరు నందు) |
| EMD, DD జారీ చేయవలసిన వివరాలు | Deputy Director, SC Development Department, Mancherial గారి పేరిట (SBI Branch Mancherial గారి బ్రాంచ్ చెల్లుబాటు అవునట్లు (DD రూపములో ) |

సం/- జిల్లా అదనపు పాలనధికారి / చైర్మన్ District Purchase Committee మంచిర్యాల

DIPR R.O. No. : 10031-PP/CL/ADVT/1/2025-26, Date: 31-10-2025




# జనరల్
STATE & REGIONAL NEWS

## ఐఎఎస్, ఐపిఎస్‌లకు వెసులుబాటు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని నాగారం భూముల వ్యవహారంలో ఐఏఎస్లు, ఐపీఎస్లకు సంబంధించిన స్థలాల విషయంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను డివిజన్ బెంచి రద్దు చేసింది ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చాలని సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. అయితే సర్వే నెం.181, 182ల్లో మాత్రం యథాతథస్థితి ఉత్తర్వులు కొనసాగుతాయని పేర్కొంది. నాగారం భూములపై సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేసిన పిటీషన్లను జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్కుమార్లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించి మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. అధికారులు కొనుగోలు చేసిన భూములపై ఆరోపణలు లేవంది. అందువల్ల యథాతథస్థితి ఉత్తర్వులు కేవలం 181, 182కే పరిమితం చేస్తూ సర్వే నెం.194, 195లను మినహాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## 35 నుంచి 65 ఏళ్ల లాయర్లకు అవకాశం

### అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్‌లో చేర్చేందుకు బార్ కౌన్సిల్ నిర్ణయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** న్యాయవాదుల సంక్షేమ నిధి ద్వారా ప్రయోజనం పొందేందుకు వీలుగా 35 ఏళ్ల పైబడి 65 ఏళ్ల వరకు ఉన్న న్యాయవాదులకు స్టేట్ బార్ కౌన్సిల్ ఒక నిర్ణయం తీసుకుంది. అడ్వొకేట్స్ వెల్ఫేర్ ఫండ్ లో చేరడానికి ఒకే ఒక్క అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. ఈమేరకు అక్టోబరు 18న బార్ కౌన్సిల్ సమావేశం తీర్మానం చేసినట్టు బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. బార్ కౌన్సిల్ నిర్ణయించిన మొత్తాన్ని నవంబరు 1 నుంచి డిసెంబరు 31లోగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. 2026 జనవరి నుంచి సభ్యత్వం అమల్లోకి వస్తుంది. వయస్సుల వారీగా ఫీజు వివరాలు ఇలా ఉన్నాయి.

| వయస్సు | సర్వీసు | చెల్లించాల్సినది |
|---|---|---|
| 36–40 ఏళ్లు | 7 ఏళ్ల | రూ. 50 వేలు |
| 41–45 ఏళ్లు | 10 ఏళ్లు | రూ.55 వేలు |
| 46–50 ఏళ్లు | 15 ఏళ్ల | రూ.60 వేలు |
| 51–55 ఏళ్లు | 20 ఏళ్లు | రూ.65 వేలు |
| 56–60 ఏళ్లు | 25 ఏళ్లు | రూ.70 వేలు |
| 61–65 ఏళ్లు | 30 ఏళ్లు | రూ.75 వేలు |

## హైడ్రా కమిషనర్ హాజరుకు హైకోర్టు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్లోని బతుకమ్మకుంట ప్రాంత భూమి విషయంలో తామిచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించి పనులు నిర్వహించాలని కేసులో హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు హైకోర్టు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. కోర్టు వివాదంలో ఉన్న ప్రైవేటు స్థలంపై ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించారంటూ దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్ను ధర్మాసనం శుక్రవారం విచారించింది. కోర్టు ధిక్కరణ కింద ఎందుకు చర్యలు తీసుకోరాదో వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలంటూ హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్కు ఫాం1 నోటీసులు జారీ చేసింది.

యథాతథస్థితి కొనసాగించాలన్న ఉత్తర్వులను ఉల్లంఘించారంటూ.సుధాకర్రెడ్డి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ బి.మధుసూదన్రావులతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. పిటీషనర్ సమర్పించిన ఫోటోలను పరిశీలిస్తే కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా పనులు జరిగాయని అర్థం అవుతుందని చెప్పింది. అక్కడ శిలాఫలకం కూడా ఉందని గుర్తించింది. విచారణను నవంబరు 27కు వాయిదా వేసింది.

# హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్న కిషన్ రెడ్డి



## పార్లమెంట్ ఎన్నికల్లో.. బిఆర్ఎస్ సచ్చి.. బిజెపిని గెలిపించింది

### జూబ్లీహిల్స్ ఎన్నికల సభలో సిఎం రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ సచ్చిపోయి బిజెపిని గెలిపించిందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విమర్శించారు. బిఆర్ఎస్ నేతలు బిజెపికి ఓటేసి తెలంగాణలో 8 మంది ఎంపిలను గెలిపించారని అన్నారు. హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్నది కేంద్ర మంత్రి కిషన్ రెడ్డినేనని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా శుక్రవారం వెంగళరావు నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా సిఎం రేవంత్ రెడ్డి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి, బిఆర్ఎస్ రెండు ఒక్కటేనని, ఆ రెండు పార్టీలది ఫెవికాల్ బంధమన్నారు. బిఆర్ఎస్‌తో కలిసి జూబ్లీహిల్స్ అభివృద్ధికి బిజెపి అడ్డుపడుతోందని సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచి కేంద్ర మంత్రులుగా ఉన్న బండి సంజయ్, కిషన్ రెడ్డి తెలంగాణకు ఒక్క పైసా అయినా తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. తెలంగాణకు, జూబ్లీహిల్స్‌కు ఏం చేశారని బిజెపి నేతలు ఇక్కడికి వచ్చి ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామనే నమ్మకం ఉందన్నారు. రాజకీయాల్లో ఒడిదొడుకులు, ఎత్తుపల్లాలు ఉంటాయని, అవకాశం అందరికీ అన్నిసార్లు రాకపోవచ్చన్నారు. అవకాశం వస్తే మన కోసం కష్టపడే వ్యక్తిని నెగ్గించుకోవాలని కోరారు. మన కోసం కష్టపడే వ్యక్తిని నెగ్గించుకోకపోతే చారిత్రక తప్పిదమే అవుతుందన్నారు. జూబ్లీహిల్స్‌లో సెంటిమెంట్ పేరుతో ఆశీర్వదించాలంటూ బిఆర్ఎస్ ముందుకొచ్చిందని, 2007లో పేద ప్రజల ఆశాజ్యోతి పిజెఆర్ చనిపోయారని, పిజెఆర్ అకాల మరణంతో ఆనాడు ఎన్నిక ఏకగ్రీవం చేశారన్నారు. పిజెఆర్ గౌరవార్థం రాజకీయ వైరుధ్యాన్ని పక్కనపెట్టి ఎన్నిక ఏకగ్రీవానికి చంద్రబాబు సహకరించారని గుర్తు చేశారు. కానీ పిజెఆర్ కుటుంబంపై పోటీకి బిఆర్ఎస్ అభ్యర్థిని నిలబెట్టిందన్నారు. ఇవాళేమో సానుభూతి పేరుతో ఓట్లు బిఆర్ఎస్ ఓట్లు అడుగుతుందని విమర్శించారు. ఈ దుష్ట సాంప్రదాయాన్ని తీసుకొచ్చింది బిఆర్ఎస్ నేతలు కాదా?, పిజెఆర్ కుటుంబంపైనే అభ్యర్థిని నిలబెట్టిన బిఆర్ఎస్‌కు ఇప్పుడు సానుభూతి ఓట్లు అడిగే హక్కు ఉందా? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికలో కూడా బిఆర్ఎస్ సానుభూతి ముసుగులో గెలవాలని చూసిందని, కానీ శ్రీగణేష్‌తోనే కంటోన్మెంట్ అభివృద్ధి సాధ్యమని ప్రజలు అతడికి పట్టం కట్టారన్నారు. నాకు కుడి భుజంగా నవీన్ గెలుపును ఇవ్వండి, అభివృద్ధి నేను చూపిస్తానన్నారు. రాబోయే 40 ఏళ్లు మీకు నవీన్ అండగా ఉంటాడన్నారు. అతడిని భారీ మెజారిటీతో గెలిపించాలని సిఎం ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఓట్ల కోసం బిఆర్ఎస్ నేతలు వస్తే కర్రుకాల్చి వాత పెట్టాలన్నారు.



## రైల్వే అధికారుల 'రన్ ఫర్ యూనిటీ'

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయ ఐక్యత దినోత్సవం వేడుకల్లో భాగంగా దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. సికింద్రాబాద్‌లోని రైల్వే క్రీడా ప్రాంగణంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవంలో భాగంగా 'ఇంటిగ్రిటీ వాకథాన్‌తో పాటు జాతీయ ఐక్యత దినోత్సవంలో భాగంగా రన్ ఫర్ యూనిటీ' కార్యక్రమాలు జరిగాయి. దక్షిణ మధ్య రైల్వేలోని ఉద్యోగులలో ఐక్యత, సమగ్రతను పెంపొందించడంపై రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన 'రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించి 'రన్ ఫర్ యూనిటీ'తో పాటు 'సమగ్రత వాకథాన్' కార్యక్రమంను జెండాఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, సికింద్రాబాద్ హైదరాబాద్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్, సంతోష్ కుమార్ వర్మ, దక్షిణ మధ్య రైల్వే ప్రధాన విభాగాధిపతులు, అధికారులు, సిబ్బంది, ఆర్.పి.ఎఫ్ మరియు క్రీడా కారులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. తరువాత జనరల్ మేనేజర్ శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయం రైల్ నిలయంలోని అధికారులు మరియు సిబ్బందిచేత రాష్ట్రీయ ఏకతా దివాస్ ప్రతిజ్ఞను చేయించారు. ఈ రెండు కార్యక్రమాలు దక్షిణ మధ్య రైల్వే ఐక్యత, సమగ్రత మరియు శ్రేష్ఠత సంస్కృతిని పెంపొందించడం అనే భావంతో ముగిశాయి.

## టెట్ మినహాయింపు కుదరదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల పాఠశాలల్లోని (భవితా కేంద్రాలు) స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లకూ టెట్ (టీచర్ ఎల్జిబిలిటీ టెస్ట్) అర్హతను మినహాయించలేమంటూ శుక్రవారం హైకోర్టు స్పష్టం చేసింది. మినహాయింపు కోరుతూ వారు దాఖలు చేసిన మూడు పిటిషన్లను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. సెకండరీ గ్రేడ్ టీచర్, స్కూల్ అసిస్టెంట్ టీచర్ల కేడర్లలోని స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల నియామకంలో టెట్ అర్హత నుంచి మినహాయింపునివ్వాలంటూ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మోహియుద్దీన్లతో కూడిన బెంచ్ విచారించింది. పిటిషన్లను కొట్టివేసింది.




## జిహెచ్ఎంసిలో 35 మంది రిటైర్డ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్ఎంసి పురోగతిలో పదవీవిరమణ పొందిన ఉద్యోగుల సేవలు మరువలేనివని అదనపు కమిషనర్ కె. వేణుగోపాల్ అన్నారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం పదవీవిరమణ పొందిన వివిధ స్థాయిలోని 35 మంది అధికారులు, ఉద్యోగులను అదనపు కమిషనర్ వేణుగోపాల్, పిఆర్ఓ మామిండ్ల దశరథం శాలువా, పూలధండలతో సత్కరించారు. ఉద్యోగులకు పదవీవిరమణ ఆర్థిక ప్రయోజనాల ధృవీకరణ పత్రాలు అందజేశారు. అదనపు చీఫ్ సిటీప్లానర్(టౌన్ ప్లానింగ్) గంగాధర్‌ను వేణుగోపాల్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి శారద, పర్యవేక్షకులు మహేశ్వరి, రమేష్ పాల్గొన్నారు.



## జూబ్లీహిల్స్ ఓటర్లు.. తెలంగాణ ప్రజల గోస తీర్చాలి

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నాలుగు లక్షల మంది జూబ్లీహిల్స్ ఓటర్లకు 4 కోట్ల మంది తెలంగాణ ప్రజల గోస తీర్చే అవకాశం వచ్చిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా షేక్‌పేట్ డివిజన్‌లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి రోత మాటలు, పనికిమాలిన భాష మాట్లాడుతున్నాడన్నారు. హామీలపై ప్రజలు నిలదీస్తే వారిని దబాయిస్తూ మీరు నన్ను ఏం చేస్తారు కోసుకు తింటారా?, కొడుతారా? అని హుంకరిస్తున్నారన్నారు. ఇది కుటుంబ పెద్దకు ఉండాల్సిన లక్షణమా? అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఎన్నికలు వస్తాయి, పోతాయి, 4 లక్షల మంది జూబ్లీహిల్స్ ఓటర్లకు 4 కోట్ల తెలంగాణ ప్రజల గోస తీర్చే అవకాశం వచ్చిందన్నారు. మీరు జూబ్లీహిల్స్‌లో గట్టి తీర్పు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ డిపాజిట్ జప్తు చేస్తే కచ్చితంగా 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వాల్సిన పథకాలన్ని బ్రహ్మాండంగా ప్రజలకు అందుతాయన్నారు. కాంగ్రెస్ డిపాజిట్ గల్లంతు కావాలన్నారు. పెన్షన్లు, తులం బంగారం, స్కూటీలు, 2500 రావాలంటే కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించాలని ఓటర్లను కెటిఆర్ కోరారు.



## ఆర్థిక సహాయం

ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిని ప్రాణాపాయ స్థితిలో ఉన్న సౌమ్యకు "సిఎం ప్రజావాణి" అండగా నిలిచింది. ఆమె చికిత్సకు అవసరమైన రూ. 9 లక్షలు ఆర్థిక సాయం సమకూర్చింది.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on X @SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

ఇ-టెండర్ నోటీసు నం. 39-2025
తేదీ: 31/10/2025 PUB/1367

భారత రాష్ట్రపతి తరపున మరియు ఆయన తరపున సీనియర్ డివిజనల్ ఇంజనీర్/ కోఆర్డినేషన్/ గుంతకల్ ఈ క్రింది పనులకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

ముగింపు తేదీ & సమయం: 27.11.2025 మధ్యాహ్నం 15:00 గంటలకు

క్ర.నెం.: 1, టెండర్ నం.:- ఇంజనీరింగ్-జిటిఎల్-కో-ఆర్డ్-1978, పని వివరణ: గుంతకల్ డివిజన్: SWI:గుంతకల్- వంటగది, భోజనం, పారిశుద్ధ్య ఏర్పాటు క్యూబికల్స్‌తో పాటు టిటిఇలలో ఎసి సౌకర్యం కోసం ఏర్పాటు- గుంతకల్లోని జెంట్స్ రెస్ట్ రూమ్. SWII:గుంతకల్-గుంతకల్‌లో ఎసి సౌకర్యంతో కూడిన లేడీస్ టిటిఇ విశ్రాంతి గదికి మెరుగుదలలు. SW III: గుంతకల్లు: క్యూబికల్స్‌తో పాటు ఎసి, వంటగది, భోజన వినోద కార్యకలాపాలు మొదలైన సౌకర్యాలతో కూడిన 30 పడకల సామర్థ్యం గల కొత్త TTE విశ్రాంతి గృహం ఏర్పాటు, ప్రకటించబడిన విలువ రూ.: 5,23,78,291.93, బిడ్ సెక్యూరిటీ డిపాజిట్ రూ.: 4,11,900.00

క్ర.సం. 2, టెండర్ నంబర్:- Engg-GTL-West-1979, పని వివరణ: గుంతకల్ డివిజన్: CRS/TPTY-CF షాపులో రూఫ్ గట్టర్లు, వర్క్‌షాప్‌లోని వీల్ షాపు మరియు TL షాపులకు అనుబంధ పనులు మరియు రెండు చివర్లలో CF షాపుకు వాల్ క్లాడింగ్., ప్రకటించబడిన విలువ రూ.: 81,59,185.83, బిడ్ సెక్యూరిటీ డిపాజిట్ రూ.: 1,63,200.00

క్ర.సం. 3, టెండర్ నంబర్:- Engg-GTL-West-1980, పని వివరణ: SWI: గుంతకల్ డివిజన్: ADEN/MPL సబ్ డివిజన్: కూలిపోయిన PF ఫెన్సింగ్ గోడకు మరమ్మతులు, ADEN/MPL అధికార పరిధిలోని CCI TAT మరియు KBA స్టేషన్ల వద్ద అప్రోచ్ రోడ్‌కు మరమ్మతులు, ప్రకటించబడిన విలువ రూ.: 2,29,71,936.99, బిడ్ సెక్యూరిటీ డిపాజిట్ రూ.: 2,64,900.00

క్ర.సం: 4, టెండర్ నెం.:- ఇంజనీరింగ్-జిటిఎల్-సెంట్రల్-1981, పని వివరణ: గుంతకల్ డివిజన్: జక్కల చెరువు (జెకెట): గూటి (జివై) - రేణిగుంట (ఆర్‌యు) సెక్షన్ కొండాపురం (కెడిపి)లో కామన్ లూప్ సౌకర్యాల కోసం క్రాస్‌ఓవర్లు - కామన్ లూప్ కోసం క్రాస్‌ఓవర్లు గూటి (జివై)-రేణిగుంట (ఆర్‌యు) సెక్షన్‌లో డౌన్ లూప్‌కు సౌకర్యం., ప్రకటించిన విలువ రూ.: 56,53,637.15, బిడ్ సెక్యూరిటీ డిపాజిట్ రూ.: 1,13,100.00

క్ర.సం.5, టెండర్ నం.:- Engg-GTL-Central-1982, పని వివరణ: గుంతకల్ డివిజన్: సీనియర్ DEN/ సెంట్రల్ జురిస్డిక్షన్‌లోని ADEN/ DHNE సబ్-డివిజన్‌లోని DHNE, BMH & PDL స్టేషన్లలో కాలనీలకు (క్వాటర్లు/ నీటి పైపులైన్/ డ్రైనేజీ/ రోడ్లు, పార్కులు మొదలైనవి) మెరుగుదల, ప్రకటించబడిన విలువ రూ.: 2,03,23,203.54, బిడ్ సెక్యూరిటీ డిపాజిట్ రూ.: 2,51,600.00

క్ర.సం. 6, టెండర్ నం.:- Engg-GTL-నార్త్-1983, పని వివరణ: గుంతకల్ డివిజన్: GY-WADI (UP/DN): ADEN/AD సబ్ డివిజన్ కింద SSE/ P.Way/ AD అధికార పరిధిలో ప్రతిపాదిత సెస్ మరమ్మతులు. (RWP 2025-26), ప్రకటించబడిన విలువ రూ.: 97,68,282.16, బిడ్ సెక్యూరిటీ డిపాజిట్ రూ.: 1,95,400.00

క్ర.సం: 7, టెండర్ నంబర్:- Engg-GTL-నార్త్-1984, పని వివరణ: గుంతకల్ డివిజన్ (i) GY-వాడి (UP/DN/UP&DN): ADEN/నార్త్ సబ్ డివిజన్ కింద SSE/P.Way/BG/GTL అధికార పరిధిలో ప్రతిపాదిత సెస్ మరమ్మతులు. (RWP 2025-26). (ii) BAY-GTL (UP/DN) ADEN/నార్త్ సబ్ డివిజన్ కింద SSE/P.WAY/BAY అధికార పరిధిలో ప్రతిపాదిత సెస్ మరమ్మతులు. (RWP 2025-26)., రూ.లలో ప్రకటించబడిన విలువ రూ.: 1,76,19,668.92, బిడ్ సెక్యూరిటీ డిపాజిట్ రూ.: 2,38,100.00

ఏదైనా కొరిజెండా ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది.

నం. G/W.496/TC/E-నోటీస్-39-2025 తేదీ.31/10/2025

డివిజనల్ రైల్వే మేనేజర్/వర్క్స్/, గుంతకల్

ఇ-టెండర్ నోటీసు నం. 476/DRM/W/GNT తేదీ 30.10.2025 PUB/1368

క్రింద పేర్కొన్న పనుల కోసం కింద సంతకం చేసిన వారు 25.11.25 మధ్యాహ్నం 3:30 గంటల వరకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం. 1, టెండర్ ID: 2821, DEN విభాగం: ఉత్తరం, పని వివరణ: 1) గుంటూరు - నడికుడి విభాగం: TFTR - ADEN/నార్త్/GNT విభాగంలో మొత్తం 6.99 Tkm పొడవున సెస్‌కు వెడల్పు చేయడం / మరమ్మతులు (సెస్ వర్క్: 6643cum & Toe బ్యాంక్: 77148cum) 2) గుంటూరు తెనాలి విభాగం: TFTR - ADEN/నార్త్/GNT విభాగంలో సెంట్రల్ డ్రెయిన్ (800 మీ) ఏర్పాటుతో సహా మొత్తం 21.87 Tkm పొడవున సెస్‌కు వెడల్పు చేయడం / మరమ్మతులు (సెస్ వర్క్: 72222 cum & Toe బ్యాంక్: 60898 cum) 3) తెనాలి రేపల్లె విభాగం: TFTR - ADEN/నార్త్/GNT విభాగంలో మొత్తం 11.00 Tkm పొడవున సెస్‌కు వెడల్పు చేయడం / మరమ్మతులు (సెస్ వర్క్: 28675cum), సుమారు విలువ రూ.లో: 7,97,56,320.00, ఈఎండీ రూ.: 5,48,800.00

1. ఇ-బిడ్లను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి చివరి తేదీ 25.11.2025 మధ్యాహ్నం 15.30 గంటల వరకు. వివరణాత్మక సమాచారం కోసం www.ireps.gov.in వెబ్‌సైట్‌కు లాగాన్ అవ్వండి

2. ఏదైనా తదుపరి కమ్యూనికేషన్/ కోరిజెండమ్‌ను ఇ-పోర్టల్ www.ireps.gov.in ద్వారా తెలియజేయాలి.

డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్), గుంటూరు

టెండర్ నోటీసు నం. 7-CWMLGDRBK-ET-2025-26, తేదీ: 30.10.2025 PUB/1369

భారత రాష్ట్రపతి తరపున మరియు ఆయన తరపున వ్యవహరించే CWM/LGDS టెండర్ నం. 7-CWMLGDRBK-ET-2025-26 కు వ్యతిరేకంగా ఇ-టెండర్లను ఆహ్వానిస్తుంది తేదీ: 30.10.2025 ముగింపు తేదీ 21.11.2025 ఉదయం 11:00 గంటలకు. బిడ్డర్లు తమ అసలు / సవరించిన బిడ్లను ముగింపు తేదీ మరియు సమయం వరకు మాత్రమే సమర్పించగలరు. ఈ టెండర్‌కు వ్యతిరేకంగా మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు మరియు అటువంటి మాన్యువల్ ఆఫర్లు ఏవైనా ఉంటే విస్మరించబడతాయి.

టెండర్ నంబర్: 7-CWMLGDRBK-ET-2025-26, పని వివరణ: కర్ణాటక రాష్ట్రం - 585221, యడ్గిర్ జిల్లా, రైల్ బోగీ కార్ఖానా, ఎస్.సి. రైల్వే వద్ద వెల్డింగ్ టార్చ్ వినియోగ వస్తువులతో సహా LHB ఫియట్ బోగీ ఫ్రేమ్ల తయారీ మరియు పెయింటింగ్, పరిమాణం (సంఖ్యలు): 1000, వ్యవధి: 12 నెలలు, టెండర్ విలువ రూ. GST: 2,85,00,950.00 (రూపాయలు రెండు కోట్ల ఎనభై ఐదు లక్షలు తొమ్మిది వందల యాభై మాత్రమే), EMD (రూ.): 2.92.500.00, ముగింపు తేదీ: 21.11.2025 ఉదయం 11:00 గంటలకు

టెండర్ యొక్క పూర్తి వివరాలను చూడగలిగే నోటీసు బోర్డు స్థానం: చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ కార్యాలయం, క్యారేజ్ వర్క్‌షాప్, లాలాగూడ, సికింద్రాబాద్-500017

మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం (టెండర్ పత్రాలలో అందుబాటులో ఉంది) మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దిద్దుబాటు కోసం, దయచేసి మా వెబ్‌సైట్ http://www.ireps.gov.in/ ని సందర్శించండి

చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్/CWS/లాలాగూడ/ సికింద్రాబాద్
A1729

మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.




## సీవరేజి సమస్యలు పరిష్కరించాలి

### బిఆర్ఎస్ నేత ఆనంద్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గోషామహల్ నియోజకవర్గంలో సీవరేజీ సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో జలమండలి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బిఆర్ఎస్ నేత ఎం. ఆనంద్ కుమార్ గౌడ్ జలమండలి ఎండి అశోక్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎండి అశోక్ రెడ్డి గోషామహల్ నియోజకవర్గంలో అక్రమంగా కలిపిన బహుళ అంతస్తుల సీవరేజీ పైప్‌లైన్‌లను గుర్తించి తొలగించాలని విజిలెన్స్ డిఎస్‌పికి ఆదేశాలు జారీ చేశారు.

## సమాచార శాఖ డిడి ప్రసాద రావు పదవీ విరమణ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమాచార పౌర సంబంధాల శాఖలో డిప్యూటీ డైరెక్టర్ గా ఉన్న జి ప్రసాదరావు శుక్రవారం పదవీ విరమణ చేశారు. వివిధ హోదాల్లో దాదాపు 41సంవత్సరాల పాటు ఆయన బాధ్యతలు నిర్వహించారు. ప్రసాద రావు పదవి విరమణ కార్యక్రమాన్ని సమాచార భవన్ లో ఘనంగా నిర్వహించారు. ఖమ్మం వరంగల్ ఆదిలాబాద్ హైదరాబాద్ జిల్లాల్లో వివిధ హోదాల్లో పని చేసిన ప్రసాదా రావు సేవలను ఈ పదవీ విరమణ కార్యక్రమానికి హాజరైన సీనియర్ అధికారులు కొనియాడారు. ఈ పదవి విరమణ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్లు డి.ఎస్ జగన్, డి శ్రీనివాస్, కే వెంకటరమణ డిప్యూటీ డైరెక్టర్లు హాష్మి, వై వెంకటేశ్వర్లు సురేష్, ఆర్.ఐ.ఈ జయరాం మూర్తి, తెలంగాణ మాసపత్రిక ఎడిటర్ శాస్త్రి లతోపాటు సమాచార శాఖ అధికారులు, సిబ్బంది, డిడి ప్రసాద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రూ. 30 కోట్ల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా

### కబ్జాల చెర నుంచి 4 వేల గజాల పార్కుకు విముక్తి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘటకేసర్ మండలం పోచారం మున్సిపాలిటీ చౌదరిగూడ, డాక్టర్స్ కాలనీలో 4000 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడింది. దీని విలువ రూ. 30 కోట్లకు పైగా ఉంటుందని అంచనగా ఉంది. 1985లో 26.9 ఎకరాలపరిధిలో 500 ప్లాట్లతో లేఔట్ ఏర్పాటు చేసిన నాటి భూ యజమానులే ఈ కబ్జాలకు పాల్పడడం గమనార్హం. ఇదే విషయమై చౌదరిగూడలోని డాక్టర్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఆదేశాల మేరకు ఈ ఫిర్యాదును హైడ్రా అధికారులు సంబంధిత శాఖలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లేఔట్ ఏర్పాటు చేసినప్పుడు 4 వేల గజాల స్థలాన్ని పార్కుగా చూపించిన వారి కుటుంబ సభ్యుల్లో ఆముదాల నరసింహ కొడుకు ఆముదాల రమేష్ తప్పుడు డాక్యుమెంట్స్‌తో 4 వేల గజాలను 800 గజాల చొప్పున 5 ప్లాట్లుగా కులకర్ణి అనే వ్యక్తికి అమ్మేసినట్టు తేలింది. కులకర్ణి అనే వ్యక్తి వాటిని 200 గజాల చొప్పున 20 ప్లాట్లుగా చేసి రాజేష్, సోమానితో పాటు పలువురికి అమ్మేశారు. ఈ విషయమై మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేశారు. హైకోర్టును కూడా కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఆశ్రయించారు. ఇలా దశాబ్దాలుగా పరిష్కారం కానీ సమస్యతో గత నెల సెప్టెంబరులో హైడ్రాను ప్రతినిధులు ఆశ్రయించారు. విచారణ పూర్తి చేసి, పార్కు స్థలంగా నిర్ధారించుకున్న హైడ్రా అధికారులు శుక్రవారం ఆక్రమణలు తొలగించారు. 4 వేల గజాల పార్కు స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి హైడ్రా బోర్డు లు ఏర్పాటు చేశారు. దీంతో పార్కు కబ్జాకు తెరపడింది. కాలనీ ప్రతినిధులు హైడ్రాకు ధన్యవాదాలు తెలిపారు.




బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం నవంబర్ 4 నుండి 8వ తేదీ వరకు ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జరిగే 'బిసి విద్యార్థి దీక్ష' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం. చిత్రంలో మహిళా సమాఖ్య నేత ఎన్.జ్యోతి, ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఆర్.ఎన్.శంకర్, బిసి విద్యార్థి జెఎసి చైర్మన్ కొమ్మబోయిన సైదులు, రాష్ట్ర అధ్యక్షుడు చేరాల వంశీ, నూకల మధుయాదవ్, కడారి రమేష్ యాదవ్, శివ.

## ది కలెక్టిబుల్స్ – థియరీ ఆఫ్ ఎవ్రితింగ్‌లో క్రాఫ్ట్, డిజైన్ వేడుక

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వివిధ సంస్కృతులు కలిసినపుడే కొత్త అర్థాలు, కొత్త అందాలు ఎప్పుడూ ఆకట్టుకుంటాయి. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ ఒకటి లోని సత్వ సిగ్నేచర్ టవర్స్ లోని శుక్రవారం థియరీ ఆఫ్ ఎవ్రితింగ్ లో ఎస్ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, ఎంఐఐఎల్ డైరెక్టర్ సుధా రెడ్డి ప్రారంభించారు. థియరీ ఆఫ్ ఎవ్రితింగ్ సంస్థను కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి కె శివ కుమార్ కుమార్తె, వ్యాపారవేత్త ఐశ్వర్య హెగ్డే ప్రారంభించారు. ఆ సంస్థ ప్రాంగణంలోనే ది కలెక్టిబుల్స్ ప్రదర్శన జరుగుతోంది. ఇది రెండు రోజులపాటు కొనసాగుతుంది. ఈ ప్రదర్శనను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుమార్తె నైమిషా రెడ్డి తో పాటు పింకీ రెడ్డి తదితర సెలబ్రిటీలు సందర్శించారు. ది కలెక్టిబుల్స్ సేకరణకు ప్రేరణ గుజరాత్ సంప్రదాయ బీడ్‌వర్క్. ఇందులో ప్రదర్శించే గాజు ముత్యాలు, బంగారం, వెండి, వజ్రాలు, రత్నాల కలయికతో కూడిన ప్రతి ఆభరణం ఒక కథగా నిలుస్తుంది. ఇక్కడ 'కలెక్టిబుల్స్' అనేది కేవలం సేకరణ కాదు – అది సంరక్షణ, అర్థం, జ్ఞాపకంగా నిలిచే భావన అని సుధా రెడ్డి, ఐశ్వర్య హెగ్డే తెలిపారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## రాజస్థాన్‌లో ఎంబిబిఎస్ విద్యార్థి ఆత్మహత్య

**జైపూర్:** రాజస్థాన్‌లో ఎంబిబిఎస్ మూడో సంవత్సరం చదువుతున్న 23 ఏళ్ల అవిరల్ సైనీ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, శుక్రవారం అతను పరీక్షకు హాజరు కావాల్సి ఉంది. హాస్టల్ రెండో అంతస్థులో ఉన్న అతనిని నిద్రలేపేందు వెళ్లిన మిత్రులు ఎంత ప్రయత్నించినా సమాధానం రాలేదు. దీనితో వారు కిటికీ నుంచి చూడగా, సైనీ ఫ్యాన్‌కు ఉరివేసుకోవడాన్ని గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సైనీను స్థానిక ఆర్‌బిఎం ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు. కాగా ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు మొదలు పెట్టారు.

## బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు

# భారీ హామీలతో ఎన్‌డిఎ మేనిఫెస్టో

కోటి ఉద్యోగాలు.. కోటి మంది 'లక్‌పతి దీదీ'లు

కెజి నుంచి పిజి వరకు నాణ్యమైన ఉచిత విద్య..10పారిశ్రామిక పార్కులు



**పట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం ఎన్‌డిఎ శుక్రవారం తన మేనిఫెస్టోను విడుదల చేసింది. ఇందులో ఒక కోటి యువతకు ఉద్యోగాలు, ఒక కోటి 'లక్షపతి దీదీ'లను తయారుచేయడం, నాలుగు నగరాల్లో మెట్రో రైలు సేవలు, రాష్ట్రంలో ఏడు అంతర్జాతీయ విమానాశ్రయాలు ఏర్పాటు చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ మేనిఫెస్టోలో ఏడు ఎక్స్‌ప్రెస్‌వేలు, 10 పారిశ్రామిక పార్కులు, కెజి నుండి పిజి వరకు నాణ్యమైన ఉచిత విద్య, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు ఉన్నత విద్యలో నెలకి రూ. 2,000 ఆర్థిక సహాయం వంటి ఇతర ముఖ్య అంశాలు ఉన్నాయి. ఎన్‌డిఎ అధికారం చేపడితే, ప్రపంచస్థాయి మెడిసిటీ ఏర్పాటు చేయడం, ప్రతి జిల్లాలో ఒక వైద్య కళాశాల నిర్మించడం, ఉచిత రేషన్, రూ. 5 లక్షల వరకు ఉచిత చికిత్స , 50 లక్షల పక్కా ఇళ్లు నిర్మించడం వంటి సంకల్పాలు మేనిఫెస్టోలో ఉన్నాయి. సీతామరిలోని 'పునౌర ధామ్ జాన్కీ మందిరం', గోమాత సీతమ్మ పుట్టిన స్థలంగా పేర్కొంటున్న ఈ హిందూ తీరయాత్ర కేంద్రాన్ని 'సీతాపురం'గా మారుస్తామని కూడా ఎన్‌డిఎ తన మేనిఫెస్టోలో పేర్కొంది. ఈ మేనిఫెస్టోను బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఉప ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరీ, బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా, కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, జితన్ రామ్ మంజీ, చిరాగ్ పస్వాన్, మిత్రపక్షాల నేతలు హాజరైన మీడియా సమావేశంలో విడుదల చేశారు. ఎన్‌డిఎ అధికారం చేపట్టినట్లయితే, ప్రభుత్వం ఒక కోటి ప్రభుత్వ ఉద్యోగాలు, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని, స్కిల్ ఆధారిత ఉద్యోగాల ప్రోత్సాహనికి స్కిల్ సెన్సస్ నిర్వహిస్తామని చౌదరీ చెప్పారు. ప్రతి జిల్లాలో మెగా స్కిల్ సెంటర్లు ఏర్పాటు చేసి, వాటిని అంతర్జాతీయ స్థాయి స్కిలింగ్ సదుపాయాలుగా అభివృద్ధి చేస్తామని ఎన్‌డిఎ ప్రకటించింది. ముఖ్యమంత్రి మహిళా ఉపాధి పథకం ద్వారా మహిళలకు స్వయం ఉపాధి, రూ. 2 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తామని పేర్కొంది. 'ఎన్‌డిఎ ద్వారా ఒక కోటి 'లక్షపతి దీదీ'లు తయారవుతారు. 'మిషన్ కోట్లపతి' ప్రారంభం ద్వారా, గుర్తించినమహిళా వ్యాపారస్తులను లక్షలపతులుగా మార్చడమే మా లక్ష్యం,' అని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. లక్షపతి దీదీ పథకం, మహిళలకు సొంత గ్రూప్‌లలో శిక్షణ ఇచ్చి, ప్రతి కుటుంబం నుంచి కనీసం రూ. 1 లక్ష సంవత్సరానికి ఆదాయం ఆర్జించేలా చేయడం 2023లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతుల (ఇబిఎస్) అభ్యున్నతికి రూ. 10 లక్షల ఆర్థిక సహాయాన్ని వివిధ వృత్తి సమూహాలకు అందిస్తామని ఎన్‌డిఎ హామీ ఇచ్చింది. ఉచిత రేషన్, రూ. 5 లక్షల వరకు ఉచిత చికిత్స, పేదలకు 50 లక్షల కొత్త పక్కా ఇళ్ల నిర్మాణం మొదలయినవి 'పంచామృత' హామీల్లో ప్రకటించింది. పిఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు ఆర్థిక సహాయం రూ. 6,000 నుండి రూ. 9,000 వరకు, అదే విధంగా మత్స్యకారులకు రూ. 4,500 నుండి రూ. 9,000 వరకు పెంచుతామని, ఆహార పంటలకు కనీస మద్దతు ధర ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది. బిహార్ స్పోర్ట్స్ సిటీ, రాష్ట్రంలోని ప్రతి విభాగంలో క్రీడా కేంద్రాలు ఏర్పాటు చేయడం, ప్రతి జిల్లాలో ఒక పరిశ్రమ మరియు 10 కొత్త పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తామని కూడా హామీ ఇచ్చింది. పాట్నా మినహా బిహార్‌లోని నాలుగు ఇతర ప్రధాన నగరాల్లో మెట్రో రైలు సేవలు ప్రారంభిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారు. పేద విద్యార్థులకు కెజి నుండి పిజి వరకు ఉచిత నాణ్యమైన విద్యను అందించడం, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ప్రముఖ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయడానికి రూ. 5,000 కోట్లను ఖర్చు చేయడం వంటి అనేక హామీలు కూడా ఎన్‌డిఎ మేనిఫెస్టోలో ఉన్నాయి. ఏడు ఎక్స్‌ప్రెస్‌వేలు, 3,600 కిలోమీటర్ల రైల్వే ట్రాక్స్ ఆధునీకరించడం వంటి అంశాలను సైతం ఎన్‌డిఎ తన మేనిఫెస్టోలో చేర్చింది. కాగా, ఇది రైతుల సంక్షేమం, యువతకు ఉపాధి, మహిళా సాధికారత, మౌలిక వసతుల అభివృద్ధి, కొత్త వ్యాపారాల స్థాపన, ఒక అభివృద్ధి చెందిన, స్వయం ఆధారిత బిహార్ నిర్మాణానికి ఎన్‌టిఎ నిబద్ధతను చాటుతున్నదని కేంద్ర మంత్రి జెపి నడ్డా 'ఎక్స్' పోస్టులో పేర్కొన్నారు.

### అబద్ధాల సమాహారం

ఎన్‌డిఎ మేనిఫెస్టోపై కాంగ్రెస్ విమర్శ

నితీశ్‌ను మాట్లాడనివ్వకపోవడం బిహార్‌కు అవమానమని ఆగ్రహం

**పట్నా:** రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం అధికార కూటమి విడుదల చేసిన మేనిఫెస్టోను అబద్ధాల సమాహారంగా కాంగ్రెస్ అభివర్ణించింది. ప్రజా సభల్లో ఈ విషయాన్ని ప్రస్తావిస్తామని పేర్కొంది. అదే విధంగా 20 ఏళ్ల ఎన్‌డిఎ పాలనకు లెక్కచెప్పాలని డిమాండ్ చేయనున్నట్టు వెల్లడించింది. మేనిఫెస్టో విడుదల సందర్భంగా ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను మాట్లాడనివ్వకపోవడం బిహార్‌కి, బిహారీలకు అవమానం అని విమర్శించింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అశోక్ గెహ్లోత్ ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, ఎన్‌డిఎ మేనిఫెస్టో విడుదల కార్యక్రమం కేవలం 26 సెకన్ల పాటు మాత్రమే కొనసాగిందని, ఎందుకంటే నాయకులు తమ 20 ఏళ్ల పాలనపై పాత్రికేయులు అడగవచ్చిన ప్రశ్నలకు భయపడ్డారని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నుంచి బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా వరకూ పలువురు నాయకులు హాజరైన ఈ మేనిఫెస్టో విడుదల కార్యక్రమం కేవలం ఒక నిమిషంలోపే ముగియడం విచిత్రంగా ఉందని వ్యాఖ్యానించారు. తరువాత అందరూ వేదికను విడిచిపెట్టగా, ఉప ముఖ్యమంత్రి మాత్రమే అక్కడ ఉండి పాత్రికేయుల కొన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. 'ఎన్‌డిఎ నాయకులు కేవలం 26 సెకన్లపాటు మాత్రమే ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఉన్నారు. వారు పాత్రికేయుల ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి భయపడ్డారు' అని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను మాట్లాడనివ్వలేదు అని గెహ్లోత్ ఆరోపించారు.

# రాష్ట్ర హోదా అంశం పనులకు అడ్డంకి కాదు

జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా

ఇంతకెంతకాలం నిరీక్షించాలి ఒమర్ అబ్దుల్లా





**శ్రీనగర్:** రాష్ట్ర హోదా అనే అంశం పనులకు ఎంత మాత్రం అడ్డంకి కాదని జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వ్యాఖ్యానించారు. అయితే, హోదా కోసం ఎంతకాలం ఎదురు చూడాలని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రశ్నించారు. కేంద్రం సృష్టించిన అడ్డంకులు ఉన్నప్పటికీ తన పని చేస్తున్నానని అన్నారు. ఎస్‌కెఐసిసి వద్ద జెకెయుటి ఫౌండేషన్ డే వేడుకల్లో పాల్గొన్న సిన్హా ప్రసంగిస్తూ, రాష్ట్రంలో పనులు చాలా నెమ్మదిగా జరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వ పనితీరు నిర్లిప్తతంగా ఉందని ఆరోపించారు. ప్రజల ద్వారా ఎన్నికైన ప్రభుత్వానికి అన్ని అధికారాలు ఉంటాయని, రాష్ట్ర హోదాతో ఏ మాత్రం సంబంధం లేకుండా పనులు చేయవచ్చని సూచించారు. కేంద్ర గృహ మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో ప్రకటించినట్లు, జమ్మూకశ్మీర్‌లో ముందుగా డెలిమిటేషన్, ఆపై అసెంబ్లీ ఎన్నికలు, తర్వాత సరైన సమయంలో రాష్ట్ర హోదా లభిస్తుందని వివరించారు. 'కానీ, కొంత మంది వ్యక్తులకు కొన్ని సమస్యలు ఉన్నట్టుగా తోస్తున్నది. ఎన్నికలు కేంద్రపాలిత ప్రాంతానికి జరుగుతున్నాయని వారికి స్పష్టంగా తెలుసు. కాబట్టి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత, రాష్ట్ర హోదాతో పనులను నిర్లక్ష్యం చేయడం తగదు' అన్నారు.

అయితే, సిన్హా వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి అబ్దుల్లా తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ పనితీరును తప్పుపట్టం సరికాదని అన్నారు. రాష్ట్ర హోదాకోసం ఇంకెంత కాలం వేచి చూడాలని ప్రశ్నించారు. అయినప్పటికీ, ఆ విషయాన్ని పక్కకుపెట్టి, ప్రభుత్వం విధి నిర్వహణను కొనసాగిస్తున్నదని, ఏవేవో ఊహించుకొని, తమకు సలహాలు ఇవ్వడం మానుకోవాలని ఈద్‌గాహ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న అబ్దుల్లా అన్నారు. 'ఈరోజు మనం చూస్తున్న ధ్వంసం, నిరుద్యోగం, జిఎస్‌టి ఆదాయంలో తగ్గింపు, ఖాళీ హోటళ్లు, రెస్టారెంట్లు, టాక్సీలు, హౌస్‌బోట్లు, మన హస్తకళ ఉత్పత్తుల అమ్మకాల తగ్గుదల ఎందుకు? పహల్గామ్‌లో ఒక దాడి జరిగినందుకే కదా? ఇక్కడ భద్రతకు బాధ్యత ఎవరిది? అది నా నియంత్రణలో లేదు. ఉంటే, జమ్మూకశ్మీర్‌లో పరిస్థితి ఇలాగా మారకుండా చూసేవాళ్లం' అని అన్నారు. తాను జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రిగా ఉన్న ఆరు సంవత్సరాల్లో (2009–2014) ఒక్కసారైనా పర్యాటకుల మీద దాడి జరగలేదని అన్నారు. 'మా అతిథులు 26 మంది పహల్గామ్‌లో మృతి చెందారు. మేము ఎలా పని చేయాలో మీరు చెప్తున్నారు. మా పని మాకు తెలుసు. మేము మా పని చేస్తాం. మీరు మీపని చేయండి' అంటూ సిన్హాపై ఎదురు దాడి చేశారు.

## దేశ ఆత్మగౌరవం కంటే' మరేదీ ముఖ్యం కాదని...

# ఇందిరాగాంధీ మాకు అదే నేర్పించారు

మాజీ ప్రధానికి కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ నివాళి

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, మాజీ చీఫ్ సోనియాగాంధీ ఘననివాళులు



న్యూఢిల్లీ : దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆమెకు ఘనంగా నివాళులు అర్పించింది. కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత రాహుల్‌గాంధీ మాట్లాడుతూ శక్తివంతులను ఎదుర్కొనేటప్పుడు ఇందిరాగాంధీ నిర్భయంగా, స్థిరంగా ఉండేవారని పేర్కొన్నారు. 'భారతదేశ ఆత్మగౌరవం కంటే మరేదీ ముఖ్యం కాదని ఆమె మాకు నేర్పించారు' అని రాహుల్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, ఇతర సీనియర్ నాయకులు ఇక్కడి శక్తిస్థల్ వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ఇందిరాగాంధీకి నివాళులు అర్పించారు. సఫ్దర్ గంజ్ రోడ్ నెంబర్ 1లో ఉన్న ప్రధానమంత్రి స్మారకాన్ని కూడా వారు సందర్శించారు. మల్లికార్జున్ ఖర్గే తన హిందీ 'ఎక్స్' పోస్ట్‌లో మాట్లాడుతూ ధైర్యసాహసాలకు ప్రతిరూపమైన మన రోల్ మోడల్ భారతదేశపు తొలి ప్రధాని ఇందిరాగాంధీ అన్నారు. ఆమె బలిదానం రోజున ఆమెకు వినయపూర్వకమైన నివాళి అని ఖర్గే పేర్కొన్నారు.' ఆమె తన దృఢ సంకల్పం, నైపుణ్యం కలిగిన నాయకత్వం, దార్శనికత ద్వారా భారతదేశం ఐక్యత, సమగ్రతను కాపాడటంలో, బలమైన ప్రగతిశీల భారతదేశాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషించారు' అని మల్లికార్జున్ ఖర్గే అన్నారు. 'ఎక్స్'లో పోస్ట్ చేసిన రాహుల్‌గాంధీ మాట్లాడుతూ 'భారత్ కీ ఇందిర' నిర్భయంగా, దృఢ సంకల్పంతో, శక్తివంతులను ఎదుర్కొనే శక్తిని కలిగి ఉండేది. భారతదేశం గుర్తింపు, ఆత్మగౌరవం కంటే మరేదీ ముఖ్యం కాదని మీరు మాకు నేర్పించారు. మీ ధైర్యం, కరుణ, దేశభక్తి నేను వేసే ప్రతీ అడుగులోనూ నన్ను ప్రేరేపిస్తునే ఉన్నాయి అని పేర్కొన్నారు. తన నానమ్మ ఇందిరాగాంధీకి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, వాయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ కూడా ఘన నివాళులు అర్పించారు. 'నేను మీ నుండి నిర్భయతను నేర్చుకున్నాను. మీ నుండి దేశభక్తిని తెలుసుకున్నాను. మీ నుండి సేవా స్ఫూర్తిని అర్థం చేసుకున్నాను. మీ నుండి నేను ఒక స్త్రీ శక్తి అనుభవించాను. మీరు లక్షలాది మంది హృదయాలలో ఎప్పటికీ జీవిస్తారు. నా హృదయం కూడా వారి మధ్యే ఉంది' అని ఆమె తన హిందీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ 1977, ఆగష్టు 13న వర్షాకాలంలో బిహార్‌లోని బెల్చ్చిలో దివంగత ఇందిరా గాంధీ తొలుత కారులో, ఆ తర్వాత జీపులో, ట్రాక్టర్‌లో, ఏనుగు మీద ప్రయాణించి కులపరమైన దురాగతాలతో నాశనమైన కుటుంబాల కోసం అసాధారణమైన రీతిలో ఆకస్మింగా ప్రయాణించి పరామర్శించిన స్మృతులను గుర్తు చేసుకున్నారు.ఇందిరాగాంధీ అసాధారణ ధైర్యసాహసాలు, ధైర్యం, పట్టుదల, స్థితిస్థాపకత కలిగిన వ్యక్తి అని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరాం రమేశ్ కొనియాడారు. జైరాం రమేశ్ ఇందిరాగాంధీ బెల్చ్చి గ్రామాన్ని ఏనుగుపై సందర్శించిన ఫోటోలను 'ఎక్స్'లో షేర్ చేశారు. 1984లో అక్టోబరు 31న అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీని ఆమె ఇంటి ముందే ఆమె అంగరక్షకులు కాల్చిచంపారు. ఇందిరాగాంధీ భారతదేశపు తొలి మహిళా ప్రధానమంత్రి. ఆమె 1917సంవత్సరం నవంబరు 19న జన్మించారు. కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి ఇన్‌చార్జి ఆర్గనైజేషన్ కె.సి.వేణుగోపాల్ మాట్లాడుతూ '1984లో ఇదే రోజున భారతదేశపు గొప్ప లీడర్లలో ఒకరైన ఇందిరాగాంధీ అమరులయ్యారు' అని ఆయన తన 'కోసం మా జీవితాలను అంకితం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నాం అని వేణుగోపాల్ తన 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపారు.

## యావత్ కశ్మీర్‌ను భారతదేశంలో ఏకంచేయాలన్న

# పటేల్ ఆకాంక్షను నెహ్రూ నెరవేర్చలేదు

ప్రధానమంత్రి మోదీ ధ్వజం

గుజరాత్‌లో సర్దార్ పటేల్ 150వ జయంతి సభలో

కాంగ్రెస్‌పై విమర్శనాస్త్రాలు




**ఏక్తానగర్ (గుజరాత్) :** సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా ప్రధానమంత్రి మోదీ కాంగ్రెస్‌పై విమర్శల దాడికి దిగారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇతర సంస్థానాలతో చేసినట్లుగానే యావత్ కశ్మీర్‌ను భారతదేశంలో ఏకం చేయాలని కోరుకున్నారు కానీ, అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ దానిని అనుమతించలేదని శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆరోపించారు. సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతి సందర్భంగా ఇక్కడ జరిగిన రాష్ట్రీయ ఏక్తా దివస్ పరేడ్ తర్వాత జరిగిన బహిరంగసభను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. చొరబాటుదారులు భారతదేశ సమతుల్యతను దెబ్బతీస్తున్నారని, దీనికి వ్యతిరేకంగా నిర్ణయాత్మక పోరాటం చేయాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. 'చరిత్ర రాయడంలో సమయం వృథా చేయకూడదని, చరిత్రను సృష్టించడానికి మనం కష్టపడి పనిచేయాలని సర్దార్ వల్లభాయ్ పటేల్ నమ్మాడు' అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. పటేల్ రూపొందించిన విధానాలు, ఆయన తీసుకున్న నిర్ణయాలు కొత్త చరిత్రను సృష్టించాయి అని ప్రధానమంత్రి అన్నారు. 'వన్ ఇండియా, ఎక్స్‌లెంట్ ఇండియా' అనే ఆలోచన ఆయనకు అత్యంత ప్రధానమైనది అని మోదీ చెప్పారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ కాంగ్రెస్ పార్టీపై విమర్శనాస్త్రాలు సంధించారు. ఈ సమస్యను పరిష్కరించడంలో పార్టీ చేసిన తప్పులకు కశ్మీర్ మరియు భారతదేశం మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని వివరించారు. 'సర్దార్ పటేల్ ఇతర సంస్థానాలను విలీనం చేసినట్లే, మొత్తం కశ్మీర్ ప్రాంతాన్ని భారతదేశంలో విలీనం చేయాలని కోరుకున్నారు, కానీ నెహ్రూ తన కోరికను నెరవేర్చడానికి అనుమతించలేదు. కశ్మీర్ విభజించబడింది. ఒక రాజ్యాంగం, ప్రత్యేక జెండా ఇవ్వబడింది. కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పు కారణంగా దేశం దశాబ్దాలుగా బాధపడింది' అని ప్రధాని చెప్పారు. సర్దార్ పటేల్‌కు దేశ సార్వభౌమాధికారం అన్నింటికన్నా గొప్పదని, కానీ ఆయన మరణం తర్వాత వచ్చిన సంవత్సరాలలో వరుసగా వచ్చిన ప్రభుత్వాలు దేశ సార్వభౌమాధికారం పట్ల అదే గంభీరతను చూపించలేదని మోదీ తెలియజేశారు.కశ్మీర్‌లో జరిగిన తప్పులు, ఈశాన్యంలో తలెత్తిన సమస్యలు, దేశవ్యాప్తంగా వ్యాపించిన నక్సలైట్‌మావోయిస్ట్ ఉగ్రవాదం అన్నీ దేశ సార్వభౌమత్వానికి తీవ్రమైన సవాళ్లు అని మోదీ చెప్పారు. కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తూ భారతదేశాన్ని పాలించిన బ్రిటిష్ వారి నుంచి కాంగ్రెస్ పార్టీ విదేశీ మనస్తత్వాన్ని, వారసత్వంగా పొందిందని విమర్శించారు. 'ఈ వ్యక్తులు బాబా సాహెబ్ అంబేద్కర్ జీవించిన కాలంలో, ఆయన మరణించిన తర్వాత ఆయన కోసం ఏమిచేశారు? నేతాజీ సుభాష్ చంద్రబోస్ కోసం, డాక్టర్ లోహియా, జయప్రకాష్ నారాయణ్ కోసం ఏమిచేశారు' అని మోదీ నిప్పులుచెరిగారు.

**బలమైన, సామరస్యపూర్వకమైన, అద్భుతమైన భారతదేశాన్ని నిర్మిద్దాం : రాష్ట్రపతి ముర్ము**

సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. బలమైన, సామరస్యపూర్వకమైన, అద్భుతమైన భారతదేశాన్ని నిర్మించడానికి అందరూ సంకల్పించుకోవాలని ముర్ము పిలుపునిచ్చారు. రాష్ట్రపతి మాట్లాడుతూ సర్దార్ పటేల్ గొప్ప దేశభక్తుడు, దార్శనిక నాయకుడు, జాతి నిర్మాత అని శ్లాఘించారు. తన అచంచల సంకల్పం, అద్వితీయ ధైర్యం, ప్రవీణ నాయకత్వం ద్వారా దేశాన్ని ఏకం చేసే చరిత్రాత్మక పనిని పటేల్ సాధించారన్నారు. 'జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా మనందరం కలిసి బలమైన, సామరస్యకపూర్వకమైన, అద్భుతమైన భారతదేశాన్ని నిర్మించడానికి సంకల్పించుకుందాం' అని రాష్ట్రపతి ముర్ము 'ఎక్స్' హిందీ పోస్ట్‌లో పిలుపునిచ్చారు.

# 10 రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేయండి

పంజాబ్, హర్యానా బార్ కౌన్సిల్ ఎన్నికలపై సుప్రీం కోర్టు ఆదేశం



**న్యూఢిల్లీ:** పంజాబ్, హర్యానా బార్ కౌన్సిల్‌ల ఎన్నికలను డిసెంబర్ 31, 2025లోపు నిర్వహించాలని, దానికి సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్‌ను 10 రోజుల్లో విడుదల చేయాలని భారత బార్ కౌన్సిల్ (బిసిఐ)కు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీలతో కూడిన సుప్రీం కోర్టు బెంచ్ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. అదే విధంగా ఉత్తరప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎన్నికలను జనవరి 31, 2026లోపు పూర్తి చేయాలని, ఓటర్ల చట్టబద్ధమైన సమస్యలను పరిష్కరించాలని కూడా ఆదేశించింది. కోర్టు దృష్టికి వచ్చిన అంశాల ప్రకారం, పంజాబ్, హర్యానా బార్ కౌన్సిల్ ఎన్నికలు ఇంకా నోటిఫై కాలేదు, ఉత్తరప్రదేశ్‌లో ఓటర్ల జాబితా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయలేదని తేలింది. బిసిఐ చైర్మన్, సీనియర్ న్యాయవాది మనన్ కుమార్ మిశ్రా ఈ విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నియమాల ప్రకారం ఎన్నికల నోటిఫికేషన్, ఎన్నికల మధ్య కనీసం 180 రోజుల వ్యవధి ఉండాలని, పంజాబ్, హర్యానా ఎన్నికల విషయంలో కొంత సాంకేతిక ఇబ్బంది తలెత్తవచ్చునని అన్నారు. దీనిపై జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ, బార్ కౌన్సిల్ ఎన్నికల పర్యవేక్షణ కోసం హైకోర్టు రిటైర్డ్ జడ్జి ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. దానికి మిశ్రా సమాధానమిస్తూ, ఇప్పటికే అలాంటి కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. అయితే, కోర్టు పంజాబ్, హర్యానా ఎన్నికల కోసం మరో రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలోని ప్రత్యేక ప్యానల్‌ను నియమించాలని ధర్మాసనం సూచించింది.

డిసెంబర్ 31, 2025 నాటికి ఎన్నికలు నిర్వహించేలా ప్రయత్నించాలని, ఏవైనా ఇబ్బందులు వస్తే కోర్టు ఆ విషయాన్ని పరిశీలిస్తుందని పేర్కొంది. 'బార్ కౌన్సిల్ ఎన్నికలు చాలాకాలంగా జరగలేదు. ఇప్పుడు ఎన్నికలు నిర్వహించడానికి బిసిఐ అంగీకరించింది. మనం ప్రజాస్వామ్య సంస్థలపై విశ్వాసం ఉంచి, సహకరించి, న్యాయసమ్మతమైన ఎన్నికలు జరగడానికి సహకరించాలి' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. బిసిఐ పాలక వర్గం గరిష్టంగా ఏడు సంవత్సరాల మాత్రమే కొనసాగవచ్చని నిబంధనల్లో ఉందని సీనియర్ న్యాయవాది నరేందర్ హూడా కోర్టుకు తెలిపారు. దీనికి కోర్టు స్పందిస్తూ, ఎన్నికలకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

## ఎస్పీ స్థాయి అధికారుల అనుమతి లేనిదే

న్యాయవాదులను విచారణకు పిలవకూడదు

'సుప్రీం' స్పష్టీకరణ

**న్యూ ఢిల్లీ:** ఎస్పీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) స్థాయి అధికారుల అనుమతి లేకుండా న్యాయవాదులను విచారణకు పిలవకూడదని విచారణ సంస్థలకు సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. మనీలాండరింగ్ కేసులో న్యాయవాదులు అర్వింద్ దాతర్, ప్రతాప్ వేణుగోపాల్ లకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) జారీ చేసిన సమన్లను రద్దు చేసింది. నిందితుల ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఆ సమన్లు జారీ చేసినట్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్, న్యాయమూర్తులు జస్టిస్ కె. వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్‌వి అంజారియాలతో కూడిన బెంచ్ వ్యాఖ్యానించింది. ఎస్పీ అనుమతి లేనిదే విచారణకు పిలవరాదని తీర్పునిచ్చింది. విచారణాధికారులు లేదా పోలీసు అధికారులు, నిందితుడి తరఫున ఉన్న న్యాయవాదిని విచారణకు పిలవాలంటే, భారతీయ సాక్ష్యాధినియమం (బిఎస్‌ఎ) సెక్షన్ 132లో పేర్కొన్న మినహాయింపులకే పరిమితం కావాలని ధర్మాసనం తెలిపింది. అటువంటి సమన్లు జారీ చేసే ముందు, ఎస్పీ లేదా అంతకన్నా ఉన్నత స్థాయి అధికారి లిఖితపూర్వక అనుమతి పొందాల్సి ఉంటుందని తెలిపింది. న్యాయవాదులు లేదా క్లయింట్లు భారతీయ నాగరిక భద్రతా సంహిత 2023 ప్రకారం కోర్టులో సమన్లపై పునఃసమీక్ష కోరవచ్చని తెలిపింది. ఈ తీర్పును అనుసరించి న్యాయవాది–కస్టమర్ మధ్య గోప్యతా సంబంధాన్ని పరిరక్షించాలి. అయితే, క్లయింట్ పత్రాలను సమర్పించాల్సి వస్తే ఆ పత్రాలు గోప్యతా పరిరక్షణ పరిధిలోకి రావు. డిజిటల్ పరికరాలను సమర్పించే సందర్భంలో, సంబంధిత కోర్టు మాత్రమే వాటి పరిశీలన ఆదేశించగలదు. అయితే, కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేయని ఇన్‌హౌస్ కౌన్సిల్స్ ఈ రక్షణ పరిధిలోకి రావని స్పష్టం చేసింది.

## తమిళనాడులో

# చట్టవిరుద్ధ ఇసుక తవ్వకాలు!

ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశాలివ్వాలని హైకోర్టును ఆశ్రయించిన ఇడి



**చెన్నై:** తమిళనాడు రాష్ట్రంలో చట్టవిరుద్ధ ఇసుక తవ్వకానికి సంబంధించిన సుమారు రూ. 130 కోట్లు రెవెన్యూ నష్టం కలిగిందని తెలిపే సమాచారం ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెట్ డైరెక్టరేట్ (ఇడి) మద్రాస్ హైకోర్ట్‌ను ఆశ్రయించింది. ప్రమాదాన్ని సమర్థవంతంగా పరిశీలించేందుకు, ఇడి వాటర్ రిసోర్సెస్ తదితర శాఖల సహకారం అందించాలని కోరుతూ అన్ని అవసరమైన డాక్యుమెంట్లు, సమాచారం, మద్దతును అందించమని కోరింది. సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఎంఎం శ్రీవాత్సవ, న్యాయమూర్తి జి. అరుల్ మురుగన్‌తో కూడిన ఫస్ట్ బెంచ్ ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. రాష్ట్ర ప్రభుత్వం, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి)కు నోటీసులు జారీ చేయాలని ఆదేశిస్తూ, కేసును మూడు వారాలకు వాయిదా వేసింది. ఇడి చెన్నై జోనల్ ఆఫీస్, ఆర్థిక మంత్రిత్వ శాఖ, రెవెన్యూ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. కాంతి కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌లో, 987 హెక్టార్ల విస్తీర్ణంలో చట్ట విరుద్ధంగా ఇసుక తవ్వకం జరుగుతున్నదని ఆరోపించారు. అనుమతించిన క్వారీ ప్రాంతం కంటే ఎక్కువ ప్రాంతాన్ని ఇసుకు తవ్వకాలకు ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. అందులో సుమారు 23,64,871.96 యూనిట్ల ఇసుక, అంటే 66,21,641.5 క్యూబిక్ మీటర్ల అదనపు తవ్వకాన్ని గుర్తించామని, ఇది ప్రభుత్వ అధికారిక రికార్డులో నమోదు కాలేదని తెలిపారు. చట్టవిరుద్ధంగా తవ్విన ఇసుక విలువ సుమారు రూ. 4,730 కోట్లు ఉండగా, అదే కాలంలో వాటర్ రిసోర్సెస్ డిపార్ట్‌మెంట్ ఖాతాల్లో చూపిన ఆదాయం కేవలం రూ. 36.45 కోట్లు మాత్రమేనని వివరించారు. ఇప్పటి వరకు జరిపిన దర్యాప్తును అనుసరించి, అనేక ప్రైవేట్ కాంట్రాక్టర్లు, వారి సంబంధిత వ్యక్తులు పరిమితులకు మించి ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారని, అంతేగాక, అనుమతించని ప్రాంతాల్లోనూ తవ్వకం కొనసాగుతున్నదని వివరించారు. దీనివల్ల ప్రభుత్వానికి భారీ నష్టం కలుకుతున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్య తీసుకోకపోవడంతో, పలు ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయని ఇడి తరఫున దాఖలైన పిటిషన్ కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. పరిస్థితిని గమనించి, వెంటనే ఎఫ్ఐఆర్ నమోదుకు మార్గనిర్దేశనం చేయాలని కోరింది. కాగా, పిటిషన్‌ను పరిశీలించిన ధర్మాసనం, సమాధానం కోసం తమిళనాడు ప్రభుత్వానికి, డిజిపికి నోటీసులు జారీ చేయాల్సిందిగా ఆదేశాలిచ్చింది.

ప్రజాపక్షం
శనివారం, 01 నవంబరు

## కేరళ ఎల్.డి.ఎఫ్. మరో సాఫల్యం

వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) పరిపాలనలో ఉన్న కేరళ రాష్ట్రం తన ధగద్ధాయమాన కిరీటంలో మరో ఆణిముత్యం చేర్చుకుంటున్నది. అక్షరాస్యత, వైద్యం, గృహవసతి, పేదరికం నిర్మూలన, ప్రజా పంపిణీ వ్యవస్థ వంటి సూచికల్లో దేశంలో ప్రథమ స్థానంలో ఉన్న కేరళ అత్యంత దారిద్ర్యం నుంచి విముక్తి పొందిన తొలి రాష్ట్రంగా రికార్డులకు ఎక్కుతున్నది. 'భగవంతుని స్వదేశం'గా పిలవబడే ఈ రాష్ట్రం సాధించిన ఈ విజయాన్ని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఈరోజు (నవంబర్ 1) తిరువనంతపురంలో సెంట్రల్ స్టేడియంలో జరిగే ఉత్సవంలో అధికారికంగా ప్రకటించనున్నారు. 2021లో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ తొలి మంత్రివర్గ సమావేశ నిర్ణయాల్లో ఒకటిగా అత్యంత దారిద్ర్య నిర్మూలన కార్యక్రమం ఆరంభమైంది. దేశంలో అతి తక్కువ దారిద్ర్యం రేటు–రాష్ట్ర జనాభాలో 0.7శాతం ఉన్న రాష్ట్రం కేరళ అని నీతి ఆయోగ్ అధ్యయనం ప్రకటించింది. ఈ అతి తక్కువ జనాభాను కూడా చేరుకోవడానికి, వారి అవసరాలు తీర్చేందుకు చర్యలు తీసుకున్నట్లు స్థానిక స్వపరిపాలన ప్రభుత్వాల మంత్రి ఎం.బి రాజేష్ చెప్పారు.

ఆహారం, ఆరోగ్యం, జీవనోపాధి, తలదాచుకునే ఇల్లు లేకపోవడం వంటి అంశాలు ప్రాతిపదికగా క్షేత్రస్థాయి సర్వే చేయగా 64,006 కుటుంబాలు అత్యంత దారిద్ర్యంలో ఉన్నట్లు నిర్ధారణ జరిగింది. వారిలో చాలామంది పేర్లు ఓటర్ల జాబితాలో లేవు, రేషన్ కార్డు లేదా ఆధార్ కార్డు లేవు. ఒక్కొక్క కుటుంబం తక్షణ, దీర్ఘకాలిక అవసరాలు తీర్చేందుకు సూక్ష్మ ప్రణాళికలు రూపొందించబడినాయి. అవసరమైన పత్రాలు లేని 21,263 మందికి వాటిని సమకూర్చడం జరిగింది. 3,913 కుటుంబాలకు గృహాలు, 1,338 కుటుంబాలకు భూమి ఇవ్వగా, 5,651 కుటుంబాలకు ఒక్కొక్కదానికి రూ.2 లక్షల చొప్పున గృహ మరమ్మతు పనులకు ఇవ్వడం జరిగింది. 2021 సర్వేలో గుర్తించబడిన 64,006 కుటుంబాల్లో, 4,421 మంది వ్యక్తులు (ఏక వ్యక్తి కుటుంబాలు) అనంతర కాలంలో మరణించారు. 261 సంచారజాతుల కుటుంబాలను గుర్తించేందుకు సకల ప్రయత్నాలు చేసినప్పటికీ వారి జాడ దొరకలేదు. వారు ఇతర రాష్ట్రాలకు వలసపోయారు. ఈ 4,729 కుటుంబాలు పోను మిగతా 59,277 కుటుంబాలను దుర్భర దారిద్ర్యం నుంచి బయటకు తెచ్చినట్లు మంత్రి చెప్పారు. ఐక్యరాజ్యసమితి శాశ్వత అభివృద్ధి లక్ష్యాలైన ఆహారం, ఆరోగ్యం, ఆదాయం, గృహవసతి కొలబద్దలుగా దుర్భర దారిద్ర్యంలో ఉన్న కుటుంబాలను గుర్తించడం జరిగింది.

రాష్ట్ర ప్రభుత్వ దృఢ సంకల్పం, అధికార వికేంద్రీకరణ, స్థానిక స్వపరిపాలన వ్యవస్థ స్వరూపం కారణంగా ఈ ప్రాజెక్టు విజయవంతమైంది. ప్రాథమిక సర్వే, సూక్ష్మ ప్రణాళికల తయారీ, వాటి అమలులో స్థానిక సంస్థలు పెద్దపాత్ర వహించాయి. 72,73 రాజ్యాంగ సవరణ చట్టాల ప్రకారం 29 అధికారాలను స్థానిక సంస్థలకు బదలాయించిన ఆదర్శ రాష్ట్రం కేరళ. పౌర సరఫరాల శాఖ ప్రాధాన్యతతో రేషన్‌కార్డులిచ్చింది. రెవెన్యూ శాఖ ఇళ్ల నిర్మాణానికి స్థలాలు గుర్తించింది. ఆరోగ్యశాఖ వైద్య పరీక్షలు, ఉచితంగా మందులు ఇస్తున్నది. సాధారణ, ఉన్నత విద్యాశాఖలు ఆ కుటుంబాల పిల్లలకు ఉచిత విద్య అందిస్తుండగా, రవాణా శాఖ ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించింది.

కాలనిర్ణయ, నిర్మాణాత్మక కృషి వల్ల ఈ కార్యక్రమం విజయవంతమైంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం చేసిన మంచి పనులను సైతం మెచ్చుకోగల సంస్కారం కొరవడిన ప్రతిపక్షాలున్న రాజకీయ వ్యవస్థ మనది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ ఘనత ఏమీ లేదని, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజక పథకాల వల్లనే సాఫల్యం సాధ్యమైందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ కుళ్లుబోతుతనం వెళ్లగక్కారు. ప్రతిపక్ష యుడిఎఫ్ నాయకుడు వి.డి.సతీశన్ (కాంగ్రెస్) కూడా అటువంటి సన్నాయి నొక్కులే నొక్కారు. అయితే ఏ కేంద్ర పథకాలను ఈ కార్యక్రమానికి వినియోగించామో చెప్పాలని ముఖ్యమంత్రి విజయన్ వారికి సవాలు విసిరారు.

ఇదిలా వుండగా, కార్మికవర్గ విభాగాల సంక్షేమానికి మరో రూ.10 వేల కోట్లు వెచ్చించే అనేక సంక్షేమ చర్యలను ముఖ్యమంత్రి విజయన్ ప్రకటించారు. వరుసగా రెండో సారి అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టించిన ఎల్‌డిఎఫ్ వచ్చే సంవత్సరం జరిగే ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధనకు కృషి చేస్తున్నది.

# ఇసి నియామకాలపై కోర్టు జాప్యం ప్రభుత్వానికి వరం

అఖిల్ యాదవ్, ఆదిత్య ప్రతాప్ సింగ్

ఎన్నికల కమిషనర్‌లను నియమించే కమిటీ నుండి భారత ప్రధాన న్యాయమూర్తి(సిజెఐ)ని పక్కనబెట్టిన ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్‌ల చట్టం– 2023ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లను నవంబర్ 11న సుప్రీంకోర్టు విచారించనుంది. ఈ రిట్‌లు దాఖలు అయ్యాయి, వాయిదాలు వేయబడ్డాయి, తరువాత ఒక సంవత్సరంపాటు పదే పదే విచారణ జాబితాలో చోటు కల్పించబడ్డాయి. ఈలోగా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నియామకంతో సహా మూడు నియామకాలు జరిగిపోయాయి. అదే సమయంలో చట్టం కోర్టులో ఇంకా సవాలు చేయబడిన స్థితిలోనే కొనసాగుతుంది.

విచారణకు షెడ్యూలు చేయడం కంటే మించిన అంశం అందులో ఉంది. వాయిదాలు ఎన్నికల తటస్థత మూలాలను అతిక్రమించింది. 2023 చట్టం అమలులో ఉంటూ, నెలలు నెలలు గడుస్తున్నకొద్దీ, దానిని పర్యవేక్షించే బాధ్యత కలిగిన సంస్థపై కార్యనిర్వాహక అధికారాన్ని చెలాయించే ప్రక్రియ బలపడుతుంది. అనిశ్చితి స్థితి ఎంత ఎక్కువ కాలం కొనసాగితే, ప్రజాస్వామ్యంపై ప్రతికూల ప్రభావాన్ని సరిదిద్దడం అంత కష్టతరమవుతుంది. 2023 మార్చిలో అనూప్ బరన్వాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీం కోర్టు ఒక మధ్యంతర ముందు జాగ్రత్త చర్యను నిర్దేశించింది. దీనికి సంబంధించి పార్లమెంటు చట్టం అమలులోకి వచ్చే వరకు, భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) నియామకాలను ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, సిజెఐలతో కూడిన త్రిసభ్య కమిటీ చేపట్టాలి.

> *2023 మార్చిలో అనూప్ బర–న్వాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఒక మధ్యంతర ముందు జాగ్రత్త చర్యను నిర్దేశించింది. దీనికి సంబంధించి పార్లమెంటు చట్టం అమలులోకి వచ్చే వరకు, భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) నియామకాలను ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, సిజెఐలతో కూడిన త్రిసభ్య కమిటీ చేపట్టాలి. ఈ ఆలోచన ప్రతీకవాదం లేదా మెజారిటీవాదం కాదు, నిర్మా–ణాత్మక సమతుల్యత. ఈ ప్రక్రి–యలో ప్రభుత్వంలోని ఏ ఒక్క అంగం కూడా ఆధిపత్యం చెలా–యించకుండా నివారించడం.*




ఈ ఆలోచన ప్రతీకవాదం లేదా మెజారిటీ వాదం కాదు, నిర్మాణాత్మక సమతుల్యత. ఈ ప్రక్రియలో ప్రభుత్వంలోని ఏ ఒక్క అంగం కూడా ఆధిపత్యం చెలాయించకుండా నివారించడం.

నెలల తర్వాత సిజెఐ స్థానంలో కేంద్ర క్యాబినెట్ మంత్రిని నియమించే 2023 బిల్లు, కాగితంపై నుంచి పార్లమెంటు శాసన అధికారం ఉపయోగించబడి చట్ట రూపం తీసుకుంది. అయితే, ఆచరణలో నిస్సందేహంగా త్రాసును కార్యనిర్వాహక వర్గం వైపు తిప్పారు. కార్యనిర్వాహక వర్గం ప్రభావం లేకుండా ఉండాల్సిన సంస్థకు నియామకాలను నిర్ణయించడంలో అదే కార్యనిర్వాహక సంస్థ మూడు ఓట్లలో రెండు ఓట్లను కలిగి ఉంది. దీనిని సాంకేతిక పరివర్తన అని పిలుస్తారు, కానీ ఇది రాజ్యాంగపరమైన నష్టాన్ని కలిగిస్తుంది. మోహిందర్ సింగ్ గిల్ వర్సెస్ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (1977)కేసులో సుప్రీంకోర్టు ప్రముఖంగా పేర్కొన్నట్లు ''స్వేచ్ఛాయుత, న్యాయబద్ధమైన ఎన్నికలు ప్రజాస్వామ్యానికి జీవనాడి''. ఆ సూత్రం ప్రస్తుతం ఒత్తిడిలో ఉంది.

న్యాయపరమైన నియంత్రణ అనేది ప్రశంసనీయమైన ధర్మం. న్యాయపరమైన ఆలస్యం మాత్రం కాదు. ఈ కేసును సుప్రీంకోర్టు పదే పదే వాయిదా వేయడం ద్వారా 2023 చట్టాన్ని పర్యవేక్షణ లేకుండా అమలు చేయడానికి అనుమతించింది. ఈ చట్టం ప్రకారం అనుసరించే ప్రతి కొత్త నియామకం యథాతథ స్థితిని మరింత స్థిరపరుస్తుంది. స్థిరపడిన ఏర్పాట్లను ఇబ్బంది పెట్టకుండా కోర్టు విజయవంతంగా జోక్యం చేసుకోవడం చాలా కష్టతరం చేస్తుంది. ప్రభావం బహుళమైంది. కోర్టు పేర్కొన్న అనూప్ బరన్వాల్ తీర్పు తటస్థ, రాజ్యాంగపరంగా విశ్వసనీయమైన ప్రక్రియను ఆశించింది. ఈ వ్యాజ్యంపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా కొనసాగినంత కాలం, ఆ దృష్టి ఆచరణాత్మక ప్రాసంగికత మసకబారుతుంది. విధానపరమైన జాప్యాలు రాజ్యాంగ రక్షణను తిరిగి రాస్తాయా అని పౌరులు ఆశ్చర్యపోతారు.

న్యాయవ్యవస్థ పరిధి మించిపోతుందనే ప్రశ్నతో ఈ చర్చకు సంబంధం లేదు; ఇది న్యాయ కార్యకలాపాల వేగానికి సంబంధించినది. వినీత్ నారాయణ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1997)లో సంస్థల స్వతంత్రత చట్ట పాలన హృదయం వద్ద ఉందని కోర్టు సరిగ్గానే వ్యాఖ్యానించింది. అటువంటి స్వతంత్రతను పరిరక్షించడం క్రియాశీలతగా చూడలేము, కానీ రాజ్యాంగ విశ్వసనీయతకు హామీగా చూస్తాము.

ఈ సంక్షోభం తప్పనిసరిగా న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థల మధ్య ఘర్షణగా ఉండవలసిన అవసరం లేదు. మరింత సమతుల్య నమూనా సాధ్యమే, సముచితం కూడా. పార్లమెంటు 2023 చట్టాన్ని సమీక్షించి, ఎంపిక ప్యానెల్‌లో తటస్థ సభ్యుడిగా సిజెఐ, రిటైర్డ్ న్యాయమూర్తి లేదా కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్ వంటి రాజ్యాంగ అధికారులను చేర్చవచ్చు. అదనంగా, ఎంపిక ప్రమాణాలను పారదర్శకం చేయడం, స్పష్టమైన ఎంపిక హేతుబద్ధతను ప్రచురించడం నియామకాల ఉద్దేశ్యాల విశ్వసనీయతను పెంచుతుంది. ఎన్నికల కమిషన్ అనేది స్వతంత్రతకు ఆటంకం కలిగించే అడ్డంకి కాదు, ప్రజాస్వామ్య చట్టబద్ధతకు హామీ. ఎన్నికల సంస్కరణలపై దినేష్ గోస్వామి కమిటీ (1990) కూడా నొక్కిచెప్పినట్లుగా, కమిషన్‌ను కార్యనిర్వాహక ప్రభావం నుండి దూరంగా ఉంచటం ప్రజల విశ్వాసం పెంపొందించేందుకు ఎంతో అవసరం. నిష్పాక్షికత సంపూర్ణంగా ఉండే సంస్థ ద్వారా ఎన్నికలు నిర్వహించినప్పుడు ప్రభుత్వాలు కూడా మెరుగ్గా ఉంటాయి. భారతదేశ ప్రజాస్వామ్య చట్రం సంకీర్ణ అస్థిరత నుండి ప్రజాదరణ వరకు అనేక పరీక్షలను తట్టుకుంది. కానీ అది అపనమ్మకం కంటే గౌరవాన్ని రేకెత్తించే సంస్థలపై ఆధారపడి ఉంటుంది. ఈ విషయాన్ని విచారించడానికి ధర్మాసనం కూర్చున్నప్పుడు, అది ఒక చట్టాన్ని మించి న్యాయ నిర్ణయాన్ని వెలువరిస్తుంది. శాసన సౌలభ్యం నుండి పర్యవేక్షణ, సమతుల్యత (చెక్స్ అండ్ బ్యాలెన్సెస్) సూత్రం బయటపడగలదా లేదా అని ఇది నిర్ణయిస్తుంది. సుప్రీంకోర్టు విధి కేవలం ఒక చట్టాన్ని కొట్టివేయడం లేదా సమర్థించడం కాదు, ఆలస్యం ద్వారా స్వతంత్రత పలుచబారదని సంకేతమివ్వాలి.

ఈ కేసుపై నిర్ణయం వెలువడటంలో జాప్యం జరిగే ఒక్కో రోజూ ప్రభుత్వానికి, రిఫరీకి మధ్య రేఖ అస్పష్టంగా మారే మరో రోజుగా మారుతుంది. జస్టిస్ కృష్ణ అయ్యర్ 'మొహిందర్ సింగ్ గిల్ తీర్పులో రాసినట్లుగా, 'కమిషన్ ప్రజాస్వామ్యానికి కాపలాదారు'. ఆ కాపలాదారు న్యాయంగా ఉండటమే కాకుండా న్యాయంగా ఉన్నట్లుగా కనిపించాలి. కాబట్టి కోర్టు తుది తీర్పు నియామక ప్రక్రియను మించి నిర్వచించాలి. భారత ప్రజాస్వామ్యం దాని సంస్థల బలంపై మరింత మనుగడ సాగిస్తుందా లేదా దాని పాలకుల సౌలభ్యం మేరకా అనేది నిర్ణయించబడాలి. విచారణ తుది దశకు సమీపిస్తున్న కొద్దీ, తదుపరి ఎన్నికల చక్రభ్రమణం ప్రారంభమయ్యే ముందు విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి కోర్టు సకాలంలో చర్య తీసుకుంటుందా? అనే ప్రశ్న తలెత్తుతుంది. ప్రశ్న సరళమైనదే అయినప్పటికీ లోతైనది. ఎందుకంటే న్యాయం కోసం ఎదురుచూస్తున్నప్పుడు, ప్రజాస్వామ్యం ఊగిసలాడుతుంది. రెండింటి మూల్యాన్ని ఓటరే భరించాలి.

> *న్యాయవ్యవస్థ పరిధి మించి పోతుందనే ప్రశ్నతో ఈ చర్చకు సంబంధం లేదు; ఇది న్యాయ కార్యకలాపాల వేగానికి సంబం–ధించినది. వినీత్ నారాయణ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1997)లో సంస్థల స్వతంత్రత చట్ట పాలన హృదయం వద్ద ఉందని కోర్టు సరిగ్గానే వ్యాఖ్యానించింది. అటువంటి స్వతంత్రతను పరిర–క్షించడం క్రియాశీలతగా చూడ–లేము, కానీ రాజ్యాంగ విశ్వసనీ–యతకు హామీగా చూస్తాము.*

(ఐపిఎ సర్వీస్)

# అన్నదాత గుండె మంట.. క్రాప్ హాలీడే ఇస్తే?

**కార్పొరేట్‌లకు రూ.వేలకోట్లు మాఫీ.. రైతన్నకు రూపాయి రాలదు**



భారతదేశ ఆర్థిక వ్యవస్థలో అట్టడుగున ఉన్న అన్నదాత మరియు అత్యున్నత స్థాయిలో ఉన్న కార్పొరేట్ శక్తుల మధ్య నెలకొన్న వైరుధ్యాన్ని దేశ పౌరులు తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు విజయ్ మాల్యా (రూ.9,000 కోట్లు), నీరవ్ మోదీ (రూ.13,000 కోట్లు), సందేశార సోదరులు (రూ.14,500 కోట్లు), రామచంద్రన్ విశ్వనాథన్ (రూ.22,842 కోట్లు) మరియు అనిల్ అంబానీ గ్రూప్ (రూ.28,874 కోట్ల వరకు) వంటి ప్రముఖులు బ్యాంకులను మోసం చేసి, వేల కోట్ల రూపాయల రుణాలను ఎగవేసి, విదేశాల్లో స్వేచ్ఛగా బతుకుతుంటే, వారిని దేశానికి రప్పించడంలో ప్రభుత్వాల అలసత్వం స్పష్టంగా కనిపిస్తోంది. మరోవైపు, అకాల వర్షాలు, తుపాన్లు మరియు వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయి, క్రాప్ హాలీడే తీసుకునేందుకు సిద్ధంగా ఉన్న రైతన్నకు మాత్రం కనీసం ఒక్క రూపాయి నష్టపరిహారం కూడా దక్కడం లేదు. ఒకవేళ దేశవ్యాప్తంగా రైతులు క్రాప్ హాలీడే ఇస్తే పరిస్థితి ఏంటి? దేశంలో ఆకలి చావులు పుట్టవా? ఈ దారుణమైన అసమానత దేశ ప్రగతికి అతిపెద్ద ఆటంకంగా నిలుస్తోంది. కార్పొరేట్ శక్తులకు ఎలాంటి హామీలు లేకుండా, సులభంగా, కోట్లాది రూపాయల రుణాలు ఇచ్చే బ్యాంకులు అన్నం పెట్టే రైతులకు అప్పు ఇవ్వడానికి మాత్రం పది నిబంధనలు విధిస్తున్నాయి. ఒక రైతు తన పాస్‌బుక్‌తో బ్యాంకుకు వెళితే, అతన్ని కుక్కల కంటే హీనంగా చూసే పరిస్థితులు ఉన్నాయని, చిన్న రుణం కోసం కూడా తీవ్ర అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేట్ మొసళ్లకు దండాలు పెడుతూ ఏసీ గదుల్లో స్వాగతం పలికే బ్యాంక్ అధికారులు, రైతును మాత్రం బడ్డీ కొట్టు యజమాని కంటే హీనంగా చూస్తున్నారు. ఈ సిగ్గుమాలిన పరిస్థితి దేశ చట్టాలు పనిచేస్తున్నాయా అనే ప్రశ్నను లేవనెత్తుతోంది. మరోవైపు, లక్ష రూపాయల రుణం కోసం రైతు పడే కష్టం అంతా ఇంతా కాదు. బ్యాంకులు మొహం చాటేస్తే, అతను 12% నుండి 30% వరకు అనధికార వడ్డీలకు ప్రైవేట్ వ్యక్తులపై ఆధారపడాల్సి వస్తుంది. ఒకవేళ పంట నష్టపోతే, ప్రభుత్వం నుండి సాయం అందదు, బ్యాంకు వడ్డీ లు భరించలేక చివరికి ఆత్మహత్యలకు పాల్పడే దయనీయ పరిస్థితి నెలకొంది. ఈ విధంగా రైతును అప్పుల ఊబిలోకి నెట్టడంలో బ్యాంకులు మరియు ప్రభుత్వాల పర్యవేక్షణ వైఫల్యం ప్రధాన పాత్ర పోషిస్తోంది. రైతంటే ఎందుకంత చులకన భావం? పెద్ద కార్పొరేట్ సంస్థలకు వేల కోట్లలో రుణాలు ఇచ్చేటప్పుడు పాటించాల్సిన నిబంధనలను బ్యాంకులు ఉద్దేశ పూర్వకంగా ఉల్లంఘించాయనేది దర్యాప్తు సంస్థల ప్రధాన ఆరోపణ. కేవలం కాగితాలపై చూపించిన ఆస్తుల ఆధారంగా, రుణాలను చెల్లించే సామర్థ్యం ఉందో లేదో సరిగ్గా పరిశీలించకుండా కోట్ల రూపాయలు అప్పగించారు. పైగా, ఈ కార్పొరేట్ రుణ ఎగవేతదారులు తమ కంపెనీల నిధులను విదేశాలకు తరలించినా, వాటిని పట్టుకోవడంలో మన దేశ దర్యాప్తు సంస్థలు మరియు బ్యాంకింగ్ చట్టాలు తీవ్ర జాప్యాన్ని ఎదుర్కొంటున్నాయి. అదే రైతు రుణం కట్టకపోతే, వెంటనే అతని ఆస్తులను జప్తు చేసే కఠిన చట్టాలు అమలులో ఉన్నాయి. ఒకరికి ఒక న్యాయం, మరొకరికి మరొక న్యాయం అనే ఈ ద్వంద్వ ప్రమాణం భారతీయ న్యాయ వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలను పెంచుతోంది. ప్రభుత్వాలు, ఉచిత పథకాలు, రాయితీల పేరుతో దేశ ప్రజలను సోమరిపోతులుగా తయారుచేస్తున్నాయనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ పథకాలపై ఖర్చు చేసే వేలాది కోట్ల రూపాయలతో, కార్పొరేట్ శక్తులు ఎగవేసిన డబ్బుతో కలిపి, దేశవ్యాప్తంగా ఉన్న రైతులందరికీ వడ్డీ లేని రుణాలు అందించవచ్చు. రైతు తనకు నష్టం కలిగినప్పుడు లేదా పంట పండనప్పుడు చెల్లింపుల విషయంలో మినహాయింపునిస్తూ, స్వేచ్ఛగా వ్యవసాయం చేసుకునే వాతావరణాన్ని సృష్టిస్తే, దేశం ఆర్థికంగా అద్భుతాలు సృష్టించగలుగుతుంది. వీరు ఎగవేసిన డబ్బులతో (సుమారుగా రూ.78,000 కోట్లకు పైగా), భారతదేశంలోని రైతులందరూ స్వేచ్ఛగా వ్యవసాయం చేసుకునే విధంగా వడ్డీ లేని రుణాలు ఇస్తే, రైతులు మరింత పంటలు పండించి దేశాన్ని ఆర్థికంగా అన్నపూర్ణగా తీర్చిదిద్దకపోలేరా? తుపాను కారణాల వల్ల దేశంలో రైతులు ఎంతో పంటలు నష్టపోతున్న కనీసం ప్రభుత్వాలు రూపాయి కూడా మాఫీ చేయని పరిస్థితి నెలకొంది. ఇంత ఆర్థికంగా వెనుకబడి పెట్టుబడి పెట్టి నష్టపోతున్న కనీసం రూపాయి రైతులకు ఇవ్వలేని పరిస్థితి ప్రభుత్వం ఉందంటే, ఈ పాలకులు రైతుల పట్ల ఏమాలోచిస్తున్నారో చెప్పాల్సిన పరిస్థితి లేదా? రైతు పడుతున్న కష్టం, నష్టాన్ని చూసి కూడా ప్రభుత్వాలు కనువిప్పు పొందకపోవడం అత్యంత విచారకరం. 'జై కిసాన్, జై జవాన్' అనే నినాదం పలికే ముందు, రైతుకు మనం ఏమి చేశామనేది ప్రతి పాలకుడు చెప్పాల్సిన సమయం ఇది. రైతుకు గౌరవం ఇవ్వని, భరోసా ఇవ్వని ఈ వ్యవస్థపై అన్నదాతల గుండె పగిలింది. రైతులు తలుచుకుంటే, దేశంలో ఆకలి కేకలు పుట్టడానికి ఎక్కువ సమయం పట్టదు. ఈ విపత్తు సమయంలో తమ భూముల్లో పంటలు పండించడం మానేసి, 'క్రాప్ హాలిడే' ప్రకటిస్తే, ఆహార భద్రత ప్రమాదంలో పడుతుంది. అప్పుడు కార్పొరేట్ సంస్థల లాభాలు కూడా వారికి ఉపయోగపడవు. ఏ కార్పొరేట్ శక్తులకు ఏ ఆధారంతో కోట్లాది రూపాయలు ఇచ్చారో తెలియదు కానీ, కనీసం అన్నం పెడుతున్న రైతన్నకు మాత్రం ఒక్క రూపా యి కూడా ఇవ్వలేని పరిస్థితి ఈ బ్యాంకుల్లో నెలకొని ఉంది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మారి రైతులకు వడ్డీ లేని రుణాలు ఇస్తూ, రైతు చెల్లించినప్పుడే తీసుకునే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. కార్పొరేట్ శక్తులకు తలొగ్గి రైతులను దోపిడీ చేయడం కాదు. కనీసం ఎరువులు కూడా సప్లై చేయలేని పరిస్థితి భారతదేశంలో నెలకొంది అంటే, సిగ్గుపడాల్సింది ప్రభుత్వమే. అప్పుడే దేశం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచి, ప్రపంచం మొత్తానికి అన్నం పెట్టే విధంగా భారత్ ఎదగగలుగుతుంది. రైతులు వారి పాస్ బుక్కులు ఇచ్చి కూడా రుణం తీసుకునేందుకు వచ్చిన గౌరవం ఉండదు. ఇంకా ఎదురు తిడుతూ రైతును ఏదైనా చేస్తారు. ఇది భారతదేశంలో రైతుకున్న విలువ. ఈ విలువను మార్చాల్సిన బాధ్యత నేటి పాలకుల చేతుల్లో ఉంది.

లేఖ

— వెంకగారి భూమయ్య

# ఆర్థిక 'అక్షరాస్యత'ను పాఠ్యాంశంగా చేర్చలేమా!

రెక్కాడితేనే డొక్క నిండని అత్యాధునిక అకాలాలు. నిరుద్యోగుల బతుకు బహు వెతలు. నిరుపేదల అనంత ఆకలి పోరాటాలు. నైపుణ్య చేతులకే పరిమితమైన పనులు, ఆదాయాలు. దినసరి కూలీ రేట్ల పతనాలు. ఆదాయం బహు పలుచన, కోరికలు ఆకాశాన. చుట్టూ సమస్యల విష వలయాలు. రేపటికి లేదు భరోసా. నేడు పని దొరుకుతుందన్న ఆశలు కరువు. ఇన్ని సంక్షోభాల నడుమ డిజిటల్ యువత తమ కుటుంబ స్థాయిని మరిచి, విచ్చలవిడిగా, అనాలోచితంగా, విచక్షణారహితంగా ధనాన్ని నీళ్ల వలె ఖర్చు చేయడం చూస్తున్నాం. ఆదాయానికి, ఖర్చుకు సంబంధం లేకుండా పోతున్నది. నేటి ఆదాయం రేపటి విపత్తుల్లో ఆదుకుంటుందన్న ఇంగితం మరిచారు యువజనులు. ఆర్థిక క్రమశిక్షణ లోపించి కుటుంబాలు విచ్ఛిన్నం అవుతూ, అశాంతి నిలయాలుగా దర్శనమిస్తున్నాయి. రాబడి కన్న ఖర్చులు అధికం అవుతున్నాయి. ఎంత సంపాదిస్తున్నామనేది ముఖ్యం కాదని, ఎంత ఆదా లేదా పొదుపు చేస్తున్నామనేది ప్రధానమని తెలుసుకోని యువత నేడు ఆర్థిక నిరక్షరాస్యులుగా మిగిలిపోతున్నారు. రేపటి ఆపదలు చెప్పి రావు. ఆపద వచ్చినపుడు బ్యాంకు బ్యాలెన్స్ ఖాళీగా ఉంటుంది. ఇలాంటి ఆర్థిక సంకట స్థితికి కారణం నేటి ప్రజల్లో, ముఖ్యంగా యువతలో పొదుపు ప్రాధాన్యం తెలియకపోవడమే అని నిర్ధారించాల్సిన సమయం ఆసన్నమైంది. నేటి విద్యా వ్యవస్థలో ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు పాఠాలు చెప్పడానికి అవకాశం లేకుండా పోయింది. ఎంత ఖర్చు పెడితే అంత గౌరవం పెరుగుతుందనే దురభిప్రాయంలో యువత కొట్టుమిట్టాడుతోంది. చిన్నపాటి నుంచే పిల్లల్లో పొదుపు పట్ల అవగాహన కల్పించాలి. పొదుపునకు, పిసినారితనానికి వ్యత్యాసం నేర్పాలి. సంపాదించిన నెలసరి వేతనంతో కొంత మేరకు పొదుపు చేయడం కనీస కర్తవ్యమని నేర్పుకోవాలి. మొక్కై వంగనిదే, మానై వంగదు కదా. లేత మనసుల్లో ఆర్థిక అక్షరాస్యత బీజాలు నాటాలి. చిన్నతనంలో పొదుపు పాఠాలు నేర్పిన పిల్లలు రేపటి కుంబానికి సుఖ సంతోషాలను అందించగలడని తెలుసుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా పొదుపు ప్రాధాన్యాన్ని అవగాహన కల్పించటానికి ప్రతి ఏట 31 అక్టోబర్ రోజున ప్రపంచ పొదుపు దినోత్సవం (వరల్ థ్రిఫ్ట్ లేదా సేవింగ్స్ డే) పాటించడం 1925 నుంచి ఆనవాయితీగా వస్తున్నది. భారత మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ 31 అక్టోబర్ 1984 రోజు మరణించడంతో, 1985 నుంచి ప్రపంచ పొదుపు దినాన్ని భారత ప్రభుత్వం 30 అక్టోబర్ రోజున నిర్వహించడం కొనసాగుతున్నది. నేటి డిజిటల్ యువత ఉద్యోగాలు చేస్తూ పరిమిత వేతనాలను పొందుతున్నారు. తాము పొందిన వేతనాలతో కుటుంబాలను సజావుగా నడపడం లేదు. ప్రాధాన్యాలు మరిచి పోతున్నారు. విలాసాలు కూడా కనీస అవసరాలు అనుకుంటున్నారు. డబ్బు చేతిలో ఉన్నపుడు చేతులకు ఎముకలు లేవన్నట్లు అనాలోచితంగా ఖర్చు చేస్తున్నారు. ధనం ఉన్నపుడు ఎగిరి పడడంతో పాటు లేనపుడు అప్పులు చేయడానికి కూడా వెనకాడడం లేదు. విలాసాలకు, కనీస అవసరాలకు వ్యత్యాసాలు మరిచి పోతున్నారు. ఎంత సంపాదించిన నెలలోని తొలి వారంలోనే ఖర్చు పెడుతున్నారు. రేపటి అనుకోని ఆపదలను తట్టుకోవడానికి పొదుపు ధనం వినియోగపడుతుందనే కనీస అవగాహన కోల్పోతున్నారు. నేటి విద్యాలయాలు మార్కులు, ర్యాంకుల పాఠాలు నేర్పుతున్నారు. ఉద్యోగాలు పొందడానికి అవసర విద్యను బోధిస్తున్నారు. సంపాదించిన ధనాన్ని పొదుపుగా వాడుకోవడాన్ని నేర్పే విద్య కరువైయ్యింది.



చాప ఉన్నంత వరకే కాళ్లు చాపుకోవడం నేర్పాలి. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దు కోవడం బోధించాలి. ప్రమాదాలు తెప్పి రావని, అనారోగ్యాలు అడిగి రావని తెలుసుకోవాలి. అనుకోని విపత్తుల్లో ఆదా చేసిన డబ్బు ఆదుకుంటుందనే ఇంగితం మరిచాం. చిన్నతనం నుంచే పాకెట్ మనీని దాచుకోవడం నేర్పించాలి. తొలి దశలో గల్ల గురిగిలో చిల్లర డబ్బుల్ని దాచుకోవడం నేర్పాలి. పిల్లలతో పాటు యువతకు డబ్బు ప్రాధాన్యాన్ని, ఖర్చు చేసే పద్ధతులను, పొదుపు చేయవలసిన అవసరాన్ని బోధించాలి. తమ బ్యాంక్‌లో పొదుపు ధనాన్ని దాచుకోవడం బోధించాలి. ప్రతి నెల వేతనంలో కొంత శాతాన్ని విధిగా పొదుపు చేయడం నేర్చుకోవాలి. మన అలవాట్లకు, వ్యయానికి సమీప సంబంధం ఉందని తెలపాలి. నేటి పొదుపు రేపటి భరోసా కావాలి. వృత్తిలో ఎదగడం, కుటుంబంలో శాంతి నెలకొనడం, పిల్లల చదువులు, గృహ నిర్మాణం, వాహనాల నిర్వహణ, పిల్లల పెళ్లిళ్లు, అనుకోని ఖర్చులు లాంటివని మన ఆర్థిక క్రమశిక్షణతో ప్రత్యక్ష సంబంధాలను కలిగి ఉంటాయని మరువరాదు. తెలియక పోవడం పొరపాటు కాకపోవచ్చని, తెలుసుకోకపోవడం నేర సమానమని తెలుసుకోవాలి. ఆర్థిక క్రమశిక్షణ లోపించిన కుటుంబాల్లో మానసిన ఒత్తిడి, అనారోగ్యాలు, అశాంతి, గొడవలు, పిల్లల పెంపకంలో ఇబ్బందులు, భవిష్యత్తు పట్ల అనిశ్చితి లాంటివని వెంటాడుతుంటాయి. నేటి విద్యావిధానంలో పాఠ్యాంశాలు, నైపుణ్యాలు, మానవీయ విలువలు, మంచి అలవాట్లు, కంప్యూటర్ అక్షరాస్యత లాంటి అంశాలతో పాటు ఆర్థిక అక్షరాస్యతను చిన్నతనం నుంచే కూడా విధిగా బోధించాలి. సకల విలువలను నేర్పే కేంద్రాలుగా తరగతి గదులు మారాలి. నేటి బాలలే రేపటి పౌరులని, నేటి ఆదాయమే రేపటి ప్రమాదాలకు చికిత్స అని, నేటి పొదుపు చేసిన ధనమేరా రేపటి కుటుంబ సంతోషాలకు పునాది అని తెలుసుకుందాం. పొదుపు మంత్ర మహత్యాన్ని చిన్నారుల మనస్సుల్లో ముద్రిద్దాం.

— మధుసూదన్ రెడ్డి

# విపత్తులతో కకావికలమవుతున్న జన జీవితాలు

ఇటీవల కాలంలో సంభవిస్తున్న పెను తుఫానులు పెను విధ్వంసం సృష్టిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌ను దాటిన మొంథా తుఫాను తీవ్ర విధ్వంసం సృష్టిస్తుందనే భయంకరమైన పరిస్థితుల నుండి ప్రజలు బయటపడి ఊపిరి పీల్చుకున్నారు.అయితే తుఫాను తీరం దాటిన తర్వాత ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాల వలన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇలాంటి పరిస్థితులు ఎందుకు ఏర్పడుతున్నాయి? ప్రకృతిలో ఎందుకు అవాంఛనీయ పరిణామాలు సంభవిస్తున్నాయి? ఆకస్మిక వాతావరణ మార్పులకు కారణమేమిటి? ఇలాంటి కీలకమైన అంశాలపై తీవ్రమైన పరిశీలన,మేథో మధనం జరగాలి. మానవ చర్యల వలన ప్రకృతిలో సంభవించే విపత్తులనుండి ప్రజలను కాపాడుకోవాలి. ప్రకృతి విధ్వంస దుష్ఫలితాలను కనీస స్థాయికి తగ్గించాలి. ప్రకృతి భూమికి రక్షణ కవచం వంటిది. అలాంటి ప్రకృతిని విధ్వంసం చేయడం మనల్ని మనం ప్రమాదంలో పడేసుకోవడమే. మన చుట్టూ ఆవరించి ఉన్న ప్రకృతిని నిర్లక్ష్యం చేసి, పర్యావరణానికి ముప్పు కలగచేయడం క్షమార్హం కాదు. పర్యావరణ విధ్వంసంతో మానవ ప్రపంచం విలపిస్తున్నది. ప్రపంచాన్ని పచ్చదనంతో నింపితేనే భూగ్రహాన్ని కాపాడగలం. స్వీడన్, ఫిన్లాండ్, న్యూజిలాండ్, ఐస్‌లాండ్, డెన్మార్క్, యు.కె, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్ వంటి దేశాలు హరిత దేశాలుగా పేర్కొనబడుతున్నాయి. సహజ వనరులను పరిరక్షించి, కర్బన ఉద్గారాలను తగ్గించడం ద్వారా డెన్మార్క్ గ్రీనెస్ట్ కంట్రీ దిశగా పయనిస్తున్నది. ఖతార్,నైజర్, గ్రీన్ లాండ్ వంటి దేశాల్లో పచ్చదనం తక్కువగా ఉంది. ప్రస్తుత కలుషితభరితమైన ప్రపంచంలో ప్రతీ చోట వినిపించే మాట 'పర్యావరణం'. పర్యావరణాన్ని పరిరక్షించి, భూతలాన్ని కాపాడేందుకు 'రాచెల్ లూయిస్ కార్సన్' వంటి పర్యావరణ వేత్తల ఆలోచనలు స్ఫూర్తి కావాలి. గేలార్డ్ నెల్సన్ లాంటి దూరదృష్టి గల పర్యావరణ ప్రేమికులను వర్తమాన ప్రపంచం తయారు చేయాలి. జాదవ్ పాయెంగ్, వనజీవి రామయ్య వంటి ప్రకృతి, పర్యావరణ సేవకులు సమాజం నుండి ఉద్భవించాలి. ప్రపంచ స్థాయి సంస్థలు, ప్రభుత్వాలు, పర్యావరణ వేత్తలు పర్యావరణ పునరుద్ధరణ కు నడుంబిగించి, మానవాళిని పెను సంక్షోభం నుండి బయటకు తీసుకురావడానికి వడివడి అడుగులు వేయాలి. సహజసిద్ధమైన, కలుషిత రహితమైన గత కాలం నాటి, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పునర్జీవింపచేయాలి. మానవ చర్యల వలన ఏర్పడుతున్న వాతావరణ మార్పులకు అడ్డుకట్ట వేయాలి. ప్రకృతి వైపరీత్యాలనుండి ప్రజలను కాపాడాలి.

— సుంకవల్లి సత్తిరాజు

## ఘనంగా ఎఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవం

**ప్రజాపక్షం/చర్లపల్లి :** గతంలో సాధించుకున్న హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాస్తుందని ఉప్పల్ సిపిఐ మండల కార్యదర్శి టి సత్యప్రసాద్ అన్నారు.ఏఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవం వేడకులు సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐటియుసి జెండాను ఏఐటియుసి భారత ఆహర సంస్థ హమాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ ఆవిష్కరించారు.వారు మాట్లాడుతూ 1920లో ఏఐటియుసి కార్మిక సంఘంగా ఏర్పడి నేటికి 106వ ఆవిర్భావ దినోత్సవమని అన్నారు.త్యాగాల ఫలితామే మనం ప్రస్తుతం హక్కులను అనుభవిస్తున్నామని గుర్తుచేశారు.గతంలో మనం సాధించుకున్న హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాస్తుందని అన్నారు.మోదీ ఎల్ఐసి నుండి రెండు లక్షల కోట్ల రూపాయలను అప్పనంగా ఇచ్చిందన్నారు.కార్మిక రాజ్యం కోసం మరో పోరాటం చేయాలని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు పొన్నికంటి దస్తగిరి,సందేశ్,యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** దేశ ప్రధానిగా ఇందిరాగాందీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ అన్నారు. శుక్రవారం మూడుచింతలపల్లి మున్సిపాలిటిలోని ప్రధాన చౌరస్తాలో ఇందిరాగాంధీ వర్ధంతి, భారతదేశ ఉప ప్రధాని సర్దార్ వల్లబాయ్‌పటేల్ 150 వ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రధానిగా ఇందిరాగాంధీ దేశానికి ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు.
ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ అద్యక్షుడు దోసకాయల వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు రవీందర్‌రెడ్డి, జగన్నాదం, వీరేషం, వేణుగోపాల్‌రావు, బస్వారెడ్డి, గోపి, రవీందర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో భార్య,భర్తలకు తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** కారు ద్విచక్ర వాహనం ఢీకొనడంతో భార్యభర్తలకు తీవ్ర గాయాలైన ఘటన నవాబుపేట్ మండలంలో చోటుచేసుకుంది.దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మీనేపల్లికలాన్ గ్రామానికి చెందిన చాకలి శ్రీనివాస్ (28), కావేరి (25) భార్యభర్తలు.ప్రవేట్ ఉద్యోగులు.రోజు మాదిరిగానే భార్యభర్తలు ఇద్దరు ఉద్యోగ నిమిత్తం స్వగ్రామం మీనేపల్లి కలాన్ నుండి శుక్రవారం ఉదయం వెళ్తుండగా గ్రామసరిహద్దు వద్దా నవాబ్ పేట్ నుండి ఎదురుగా వస్తున్న మహీంద్ర టియువి 300 వాహనం టిఎస్ 13 ఈ కె 8297 గల (కారు) వేగంగా వచ్చి టిఎస్ 34 3142 గల ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది.ఈ ఘటనలో బైకుపై ప్రయాణిస్తున్న మీనేపల్లికలాన్ గ్రామానికి చెందిన భార్యభర్తల ఇద్దరికీ కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడ్డారు.గాయపడిన ఇద్దరిని అంబులెన్స్ లో సంగారెడ్డిలోని ఓ ఆసుపత్రికి చికిత్స కోసం గ్రామస్తులు తరలించారు.సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని ప్రమాదంపై దర్యాప్తు నిర్వహిస్తున్నారు. కారు కిలోమీటర్ దూరంలో వదిలేసి కారు యజమాని హైదరాబాద్ సమీపంలోని ఇబ్రహీంబాగ్‌కి చెందిన మల్లె గండయ్య తండ్రి కిష్టయ్య వయసు 59 సంవత్సరాలు గల వ్యక్తి పారిపోయి పోలీస్ స్టేషను ఆశ్రహించారు. ఇప్పటి వరకు ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని నవాబ్ పేట్ ఎస్సై జీ.పుండ్లిక్ తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




## జాతీయ ఐక్యత పట్ల ప్రజల్లో చైతన్యం

### నవాబుపేట్ ఎస్సై జి.పుండ్లిక్

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** సర్ధార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా నవాబ్ పేట్ పోలీస్ శాఖ ఆద్వర్యంలో శుక్రవారం నవాబ్ పేట్ మండలం కేంద్రం లోని ఆర్కతల ఎక్స్ రోడ్డు వట్టిమీనేపల్లి వరకు రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జీ. పుండ్లిక్ జండా ఊపి 2కె రన్ ను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై జీ.పుండ్లిక్ మాట్లాడుతూ, దేశ ఐక్యత, సమగ్రతకు సర్ధార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయమని,ఆయన ఆలోచనలు, స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని తెలిపారు. రన్ ఫర్ యూనిటీ వంటి కార్యక్రమాల ద్వారా జాతీయ ఐక్యత పట్ల ప్రజల్లో చైతన్యం పెంపొందుతుందని పేర్కొన్నారు. యావత్ భారతావనిలోని ప్రజలందరూ ఒకే కుటుంబ సభ్యులుగా భావించి, జాతి ఐక్యతకు పునరంకితమై, మాతృదేశ సేవలో తమ వంతు పాత్ర పోషించడం ద్వారానే స్వాతంత్ర్య సమరయోధులకు నిజమైన నివాళి అర్పించినట్టవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మండల నాయకులు, మండల యువతి యువకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర ఐక్యతకు ప్రతీకగా రన్ ఫర్ యూనిటీ

**ప్రజాపక్షం/ఉప్పల్ :** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి, పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సమాప్తి సందర్భంగా రాచకొండ పోలీస్ కమిషనరేట్ మల్కాజ్‌గిరి జోన్ ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ 2025 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఉప్పల్ రింగ్‌రోడ్డు నుండి రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వరకు 2 కిలోమీటర్ల దూరానికి రన్ ఫర్ యూనిటీ సాగింది. ఈ కార్యక్రమానికి రాచకొండ పోలీస్ కమిషనర్ సుదీర్ బాబు, సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, ఎవరెస్ట్ అధిరోహిణి అన్విత రెడ్డి, అంతర్జాతీయ అథ్లెట్ కల్పనా ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంలో సీపీ సుదీర్ బాబు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ ఐక్యతకు ప్రతీకగా నిలిచారని, పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకునే ఉద్దేశ్యంతో ప్రతి ఒక్కరూ దేశసేవా భావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశ ఐక్యమత్యాన్ని చాటే ఉద్దేశ్యంతో ‘రన్ ఫర్ యూనిటీ’ ని నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి డీసీపీ పీవీ పద్మజ,అదనపు డీసీపీ, ఏసీపీలు, ఉప్పల్, నాచారం, మేడిపల్లి, పోచారం, ఘటికేసర్ ఇన్‌స్పెక్టర్లు, సన్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తాండూరులో ఉత్సహంగా రన్ ఫర్ యూనిటీ

**ప్రజాపక్షం/తాండూరు :** దేశ మాజీ తొలి హోంమంత్రి సర్దార్ వల్లబాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి వేడుకలను పురష్కరించుకుని తాండూరు పట్టణంలో తాండూరు డిఎస్పీ బాలకృష్ణారెడ్డి ఆద్వర్యాన రన్ ఫర్ యూనిటి కార్యక్రమాన్ని ఉత్సహాంగా నిర్వహించారు. పట్టణంలోని విలేమూన్ చౌరస్తా నుంచి చేపట్టిన రన్ ఫర్ యూనిటి ర్యాలీని డిఎస్పీ బాలకృష్ణారెడ్డి పాల్గోని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో తాండూరు డిఎస్పీతో పాటు పట్టణ ప్రముఖులు,రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంధ సంఘాల ప్రతినిధులు, యువకులు ఉత్సహాంగా పాల్గోన్నారు. ఈ ర్యాలీలో ఉక్కు మనిషి సర్దార్ వల్లబాయ్ పటేల్‌కు జోహర్లు అర్పిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో తాండూరు రూరల్ సిఐ నగేష్, పోలీసు సిబ్బంది, పట్టణ వాసులు తదితరులు పాల్గోన్నారు.




# కార్మికవర్గం మరోసారి పోరాటానికి సిద్ధం కావాలి

### ఎఐటియుసి మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్.బోస్









**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** కోట్లా మంది కార్మికవర్గ గొంతుకగా పోరొడుతూ వస్తున్న ఏఐటియుసి వారి గుండెల్లో స్థానం సంపాదించుకొందని, నేటికీ అదే స్ఫూర్తితో మరింత ఉత్సాహంతో కార్మిక శ్రేయస్సు కోసం పాటుపడుతుందని ఏఐటియుసి మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్.బోస్ అన్నారు. ఏఐటియుసి కాప్రా సమితి ఆధ్వర్యంలో ఇసిఐఎల్ చౌరాస్తాలో శుక్రవారం ఏఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవ సందర్భం సీనియర్ నేత ఎస్.శంకరరావు కార్మిక జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బోస్ మాట్లాడుతూ బొంబాయిలో స్వాతంత్ర సమర యోధులు లాలా లజపతి రాయ్ అధ్యక్షతన 1920లో ఆవిర్భవించిన ఏఐటియుసి దేశ స్వాతంత్ర పోరాటంతో పాటు ఆధునిక భారతదేశ నిర్మాణం కసం బలిదానాలు, ప్రాణ త్యాగాలు చేసిందన్నారు. భారత ప్రభుత్వ 1935 చట్టానికి వ్యతిరేకంగా ఏఐటియుసి 1937లో రాజ్యాంగ సభ నిర్వహించిందన్నారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం గత పదేళ్ల పైబడి కార్మిక వ్యతిరేక చట్టాలు, అణచివేత ధోరణులు, పెట్టుబడిదారుల వెన్నంటి ఉండటం పట్ల మరోసారి కార్మిక లోకం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధర్మేంద్ర, ఏఐటియుసి కాప్రా మండల కార్యదర్శి మిరియాల, ఏఐటియుసి ప్రతినిధులు నారా నర్సింహబాబురావు, రాఘవేంద్ర, శ్రీనారాయణ, మోహన్, ఎల్లయ్య, కోల దయానంద్, నర్సింహ రావు, స్వామిదాస్, శ్రీనివాస్, నాగేష్, ఆనంద్, గిరిబాబు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**జవహర్‌నగర్‌లో...**జవహర్‌నగర్‌లో నిర్వహించిన ఏఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా శుక్రవారం భవన కార్మిక సంఘం మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు దర్మనం యాదగిరి ఆధ్వర్యంలో ఏఐటియుసి ఆటో యూనియన్ అడ్డమీద కాప్రా మండల అధ్యక్షుడు అంబాల ఎల్లయ్య కార్మిక జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి.స్వరూపనాయక్, భవన కార్మిక సంఘ కాప్ర మండల అధ్యక్షులు కొండ సత్యం, కురుమయ్య, మహిళా సమైక్య కాప్రా మండల అధ్యక్షురాలు జయమ్మ, కోదాసు గంగారం, మహిళా సమైక్య నాయకురాలు డి.మల్లిక, ఏఐటియుసి నేతలు లింగం, అనిల్, శ్రీశైలం, మహేష్‌బాబు గౌడ్, వెంకటేష్, పాల్గొన్నారు.

**ఘట్‌కేసర్ :** కార్మికుల హక్కుల కోసం నిరంతరం అనేక పోరాటాలు అనేక త్యాగాలు నడిపిన ఘనత అని ఎఐటియుసి రాష్ట్ర నాయకులు కల్లూరి జయచంద్ర పేర్కొన్నారు. ఎఐటియుసి 106వ ఆవిర్భవ దినోత్సవ సందర్భంగా ఔటర్ రింగ్ రోడ్డు యంనంపేట్ చౌరస్తా భవన కార్మికుల వద్ద కల్లూరి జయచంద్ర,సిపిఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్,అధ్యక్షులు శ్రీను కలిసి ఎఐటియుసి జెండాను ఎగురవేశారు.
ఈ సందర్భంగా కల్లూరి జయచంద్ర,లొట్టి ఈశ్వరులు మాట్లాడుతూ మన దేశంలో 1920 అక్టోబర్ 31న ముంబాయిలో ఆవిర్భావించిన ఎఐటియుసి భారతదేశంలో తొలి ట్రేడ్ యూనియన్ ఏర్పాటు అయిందని ఎఐటియుసి105 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో చారిత్రిక పోరాటాలకు నాయకత్వం వహించడంతో పాటు కార్మికుల పక్షాన అనేక పోరాట విజయాలను సాధించుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటి ప్రధాన కార్యదర్శి దాసు, యాదగిరి,సతీష్,బానోత్ విజయ్,వి యాదగిరి, బసవయ్య, నీల, స్వాతి, రాజేష్, యాదమ్మ పాల్గొన్నారు.

**బోడుప్పల్ :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇందిరానగర్ చౌరస్తాలో ఏఐటీయూసీ 106 ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి అంగన్వాడి వర్కర్స్ రాష్ట్ర నాయకురాలు పారిజాన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా మేడిపల్లి మండల సిపిఐ మండల కార్యదర్శి రచ్చ కిషన్ హాజరైనారు. ఏఐటియుసి మండల కార్యదర్శి దండు రమేష్ ఏఐటియుసి జండాను ఎగరవేసినారు. ఈ కార్యక్రమమును ఉద్దేశించి రచ్చ కిషన్, దండు రమేష్ మాట్లాడుతూ కార్మిక హక్కుల సాధనలో ఏఐటీయూసీ విశేష కృషి చేసిందని అన్నారు.
ఈ కార్యక్రమం లో మేడిపల్లి మండలం సిపిఐ పార్టీ మండల కౌన్సిల్ సభ్యులు జి.నాగరాజు, ఎండి.అన్వర్, బి.ఐలయ్య, కే.ప్రమీల, ఆండాలు, ఇస్తారి, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు ఎన్ ధనలక్ష్మి, జే మనోహర, డి కృష్ణకుమారి, కే కుమారి, పి సుశీల తదితరులు పాల్గొన్నారు.

**నిజాంపేట్ :** ఎఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిజాంపేట్ వార్డు కార్యక్రమం వద్ద అలాగే నిజాంపేట్ డంపింగ్ యార్డ్ దగ్గర ఆశి. యాదయ్య ఆధ్వర్యంలో ఎఐటియుసి జెండా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలభిందెల శ్రీనివాస్ హాజరైన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఏఐటీయూసీ ఏర్పడి 106వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటున్నామని, ఎంతో మంది త్యాగల, అమరుల వల్ల ఈ కార్మికుల చట్టాలు, హక్కులు అనుభవిస్తున్నాము అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో భాగ్యమ్మ, నర్సమ్మ, పొన్నికంటి దస్తగిరి, మోహన్ రెడ్డి, పరమేష్ గౌడ్, తిమన్న, సాయి, కృష్ణ, రామకృష్ణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పౌరసేవా కేంద్రంతో ప్రజలకు మరిన్ని సేవలు

### మున్సిపల్ ప్రత్యేకాధికారి సంధ్య



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు పౌరసేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఈ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తూంకుంట మున్సిపాలిటి ప్రత్యేకాదికారి, సిడిఎంఎ జాయింట్ డైరక్టర్ సంధ్య అన్నారు. శుక్రవారం తూంకుంట మున్సిపాలిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన పౌరసేవా కేంద్రాన్ని కమిషనర్ జ్యోతితో కలిసి ఆమె ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌరసేవా కేంద్రంతో మరిన్ని సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని, మున్సిపల్ పట్టణ ప్రజలు ఇట్టి కేంద్రాన్ని సద్వినియోగ పరుచుకోవాలని అన్నారు. వినియోగదారులు ఈ కేంద్రాన్ని సందర్శించి వారికి అవసరమైన సేవలను తెలుసుకోవచ్చని చెప్పారు. బర్త్ సర్టిఫికెట్‌తో పాటు మనిషి జీవన విధానంలో అవసరమైన ప్రతి ఒక్క సర్టిఫికెట్ ఈ సేవా ద్వార పొందవచ్చని పేర్కోన్నారు. ఇట్టి సేవా కేంద్రాన్ని తూంకుంట మున్సిపల్‌లో ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి మాట్లాడుతూ ఈ పౌరసేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయుటకు అన్ని విధాలుగా సహకరించిన ప్రత్యేకాదికారికి ఆమె ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. స్పెషల్ ఆఫీసర్ ఆదేశాల మేరకు మున్సిపల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుచుటకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఇఇ సునీత, తూంకుంట మేనెజర్ శ్రావన్‌కుమార్, ఎఇ నిరోష, పర్యావరణ ఇంజనీర్ కన్నేశ్వర్‌రావు, సీనియర్ అసిస్టెంట్‌లు, వార్డు ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల సాధనలో ఎఐటియుసి ఎనలేని పోరాటం

**ప్రజాపక్షం/తాండూరు :** కార్మికుల హక్కుల సాధన కోసం ఎఐటియుసి అలుపెరగని పోరాటం చేస్తుందని ఎఐటియుసి కార్మికుల సంఘాలనేతలు పేర్కోన్నారు. ఎఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురష్కరించుకుని శుక్రవారం తాండూరులోని సిసిఐ సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి వంశీకృష్ణ,పెన్నా ఫ్యాక్టరి, పెన్నా సిమెంట్ ఫ్యాక్టరి ముందు జనరల్ సెక్రెటరి దశరథ్‌గౌడ్, మున్సిపల్ కార్యాలయం ముందు ఐటియుసి యూనియన్ అధ్యక్షులు నర్సిములు ఎఐటియుసి జెండాను ఎగురవేసారు.ఎన్నో కార్మీక ఉద్యమాలు చేపట్టి కార్మీకుల హక్కులను సాదించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి కార్మీక సంఘాల నాయకులు రాజ్ కుమార్, ప్యాకింగ్ ప్లాంట్ నాయకులు దస్తప్ప, సాహేర్ పాష, రాజు, రాజేందర్, మున్సిపల్ కార్మీక సంఘం నాయకులు గోపాల్, అశోక్, రాజు, వెంకటయ్య తదితరులు పాల్గోన్నారు.

## రైతుల భూసమస్యలను వెంటనే పరిష్కరించాలి

### ఎఎంసి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రైతుల భూసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, రైతులకు ఉత్తమ సేవలు అందించాలని మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ అన్నారు. శుక్రవారం మూడుచింతలపల్లి మండలానికి నూతనంగా విచ్చేసిన తహాశీల్దార్ సుచరితను ఎఎంసి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడుచింతలపల్లి మండల రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా తహాశీల్దార్ కార్యాలయానికి వచ్చి తమ సమస్యలను తహాశీల్దార్‌కు విన్నవించాలని చెప్పారు. ప్రజల భూసమస్యలను పరిష్కరించుటకు రెవెన్యూ అధికారులు కృషి చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అద్యక్షుడు దోసకాయల వెంకటేష్, మాజి ఎంపిటిసి రవీందర్‌రెడ్డి, నాయకులు జగన్నాదం, వీరేషం, వేణుగోపాల్‌రావు, బస్వారెడ్డి, వెంకటేష్, గోపి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## లీవ్‌ఇన్‌క్యాష్‌మెంట్ తక్షణమే చెల్లించాలి

### హకింపేట డిపో ఆర్‌టిసి రిటైర్డ్ ఉద్యోగుల వినతి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** లీవ్‌ఇన్ క్యాష్‌మెంట్ తక్షణమే చెల్లించాలని అలాగే రీటైర్డ్ అయిన ఆఖరు నెల జీతం ఇవ్వాలని హకింపేట డిపో ముందు ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం తూంకుంట మున్సిపాలిటిలోని హకింపేట డిపోలో విశ్రాంత ఆర్‌టిసి ఉద్యోగులు డిపో మేనెజర్, సెక్యూరిటి విజిలెన్స్ అధికారులకు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులైన బాల్‌రాజ్, చందర్, నవీన్, నారాయణ, నర్సింగరావులు మాట్లాడుతూ హకింపేట డిపోలో గతంలో విధులు నిర్వహించిన డిపో మేనెజర్ భవభూతి నిర్లక్ష్యం వల్లనే విశ్రాంత ఉద్యోగులకు లీవ్‌ఇన్ క్యాష్‌మెంట్, రిటైర్ట్‌మెంట్ అయిన ఆఖరి నెల వేతనం రాలేదని ఆరోపించారు. డిపో మేనెజర్ భవభూతి, సూపరిండెంట్‌ల నిర్లక్ష్యంతో రిటైర్డ్ అయిన కార్మికులకు 2022 నుంచి 2024 వరకు వచ్చే లీవ్ ఇన్ క్యాష్‌మెంట్ రాలేదని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆర్‌టిసి డిపోలలో సెప్టెంబర్ 2024 వరకు రిటైర్డ్‌మెంట్ అయిన ఉద్యోగులందరికి నగదు రూపంలో డబ్బులు చెల్లించారని చెప్పారు. కేవలం హకింపేట డిపోలో డిపో మేనెజర్ భవభూతి రిటైర్డ్‌మెంట్ బకాయిలకు సంబందించిన పత్రాలను పై అధికారులకు పంపించలేదని దీంతో మాకు రావాల్సిన బెనిఫిట్స్ రాలేదని వాపోయారు. తక్షణమే సికింద్రాబాద్ రీజినల్ మేనెజర్ రిటైర్డ్‌మెంట్ అయిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇటీవల హకింపేట డిపో మేనెజర్‌గా బాద్యతలు స్వీకరించిన సరితాదేవి ఇట్టి విషయంపై దృష్టి సారించి బకాయిలు వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. పది రోజుల్లో మాకు రావాల్సిన బకాయిలు చెల్లించని యెడల తదుపరి కార్యచరణ ప్రకటిస్తామని ఉద్యోగులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్‌మెంట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి చరిత్రలో చిరస్మరణీయం

### జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్




**ప్రజాపక్షం/వికారాబాద్ :** సర్దార్ వల్లబాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎన్నెపల్లి చౌరస్తా నుండి ఎన్టీఆర్ చౌరస్తా వరకు నిర్వహించిన రన్‌ఫర్ యూనిట్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్యఅతిథాగా పాల్గొని మాట్లాడుతూ దేశ ఐక్యత ,సమగ్రతకు సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయమని, అయన అలోచనలు స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని తెలిపారు.
రన్ ఫర్ యూనిటీ వంటి కార్యక్రమాల ద్వారా జాతీయ ఐక్యత పట్ల ప్రజల్లో చైతన్యం పెంపొందుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. యావత్ భారతావాలోని ప్రజలందరూ ఒకే కుటుంబ సభ్యులుగా భావించి,జాతి ఐక్యతకు పట్ల ప్రజల్లో చైతన్యం పెంపొందుతుందని కలెక్టర్ పేర్కోన్నారు. మాతృదేశ సేవల్ తమవంతు పాత్ర ఫోషించడం ద్వారానే స్వాతంత్ర్య సమరయోధులకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ భారతదేశపు ఉక్కు మనిషి సర్దార్ వల్లబాయ్ పటేల్ 150వ జయంతి జాతీయ ఐక్యతా దినోత్సవం జరుపుకోవడం మనందరి అదృష్టిం ఈ రన్‌పర్ యూనిట్ వంటి కార్యక్రమాలు దేశ ఐక్యత, సమగ్రత సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్తాన్నాయి. స్వాతంత్ర్యం తరువాత సర్దార్ పటేల్ ఎంతో దార్శనికత సంకల్పంతో సుమారు 565 స్వదేశీ సంస్థానాలను భారతదేశంలో వలీనం చేసి భారతదేశాన్ని ఏకీకృతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమంలో ట్రేనింగ్ అధికారి హర్స్ చౌదరి, అదనపు ఎస్పి రాములు నాయక్,శ్రీనివాసులు, విరేస్, సిఐ బీంకుమార్ పాల్గోన్నారు.



మూడుచింతలపల్లి మున్సిపాలిటీలోని ప్రధాన చౌరస్తాలో మాజీ దేశ ప్రధాని ఇందిరాగాంధీ, సర్దార్ వలభాయ్ పటేల్‌కు నివాళ్లర్పిస్తున్న మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్

# బాధిత కుటుంబానికి భరోసా

### తక్షణమే నివేదికలు అందించాలి అధికారులను ఆదేశించిన ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/పెద్దేముల్ :** గొర్రెల కాపరుల కుటుంబానికి ప్రభుత్వం తరపున తగిన సహాయం అందజేస్తామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్ రెడ్డి భరోసా నిచ్చారు.గత మూడు రోజుల క్రితం పెద్దేముల్ మండల పరిధి కందనెల్లి గ్రామానికి చెందిన కుర్వ సాతప్ప,మలమ్మలకు చెందిన 55గొర్రె పిల్లలను వీది కుక్కల దాడిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఇట్టి విషయాన్ని గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, నాయకులు అంపల్లి రాజులు పట్న మహేందర్‌రెడ్డి దృష్టికి తీసుక పోయ్యారు. ఇట్టి విషయాన్ని తెలుసుకున్న ప్రభుత్వ చీప్‌విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి శుక్రవారం కందనెల్లి గ్రామానికి చేరుకుని కుర్వ సాతప్ప,మలమ్మల బాధిత కుటుంబాన్ని పరమార్శించారు. ఈ సందర్భంగా పట్నం మహేందర్‌రెడ్డి అక్కడి నుండియే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి వీది కుక్కల దాడిలో గొర్రెలను కోల్పోయిన కుటుంబానికి ప్రభుత్వం తరపున ఆదుకోవాలని, ఇందుకు సంబంధించిన ఉన్నతాధికారులకు నివేధికలు అందించాలని అధికారులను ఆదేశించారు. నిరుపేదల గొర్రెల కాపరికి కుర్వ సాతప్పకు రూ.10లక్షల వరకు నష్టం జరిగిందని,వారి జవీనాధరమైన గొర్రెలను వీది కుక్కలు దాడి చేసిన చంపి వేయడం బాధకరమని అన్నారు. తక్షణమే ఆ కుటుంబానికి ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందజేస్తామని భరోసా ఇచ్చారు. వారి వెంట టిపిసిసి రాష్ట్ర ప్రచార కార్యనిర్వహక కార్యదర్శి కరణం పురుషోత్తమ్‌రావు, మోహన్‌రెడ్డి, రాజులు ఉన్నారు.

## లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/కేశంపేట:** సిఎం సహాయనిధి పేదలకు వరంగా మారిందని మార్కెట్ కమిటీ డైరెక్టర్లు త్రిపతిశెట్టి కరుణాకర్, భాస్కర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం షాద్‌నగర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో మండలానికి చెందిన 28మంది లబ్ధిదారులకు రూ.9.62లక్షల చెక్కులను పంపిణీ చేయించారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, బిసా కరుణాకర్‌రెడ్డి, గిరిధర్ యాదవ్, రావుల పెంటయ్య, భాస్కర్‌రెడ్డి, కృష్ణయ్య, సుందరయ్య, తుమ్మల గోపాల్, ఎండి అమేర్, ఎదిరే నాగేష్, జంగయ్య, నారాయణ పాల్గొన్నారు.

## ఒంటరిగానే టిఆర్‌ఎస్(డి) పోటీ : నరాల

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** రాష్ట్రంలో ఎలాంటి ఎన్నికలు జరిగినా తెలంగాణ రక్షణ సమితి (డి) పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని, ఏ పార్టీతో పొత్తు ఉండదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నరాల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ఆయన మాట్లాడుతూ 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో, 17 పార్లమెంట్ స్థానాల్లో ఒంటరి పోటీకి పార్టీ తరపున కొత్త వాళ్లకు అవకాశం ఇవ్వనున్నట్లు అవుతుందన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రజా సమస్యలపై ధర్నాలు, పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కేసులు పెట్టినా కష్టాలు ఎదురొడ్డిన ప్రజలకోసం తట్టుకొని నిలబడాలని సూచించారు. యువతకు, ఉద్యమకారులకు, మహిళలకు పార్టీలో మంచి అవకాశం కల్పిస్తామని తెలిపారు. సమావేశంలో పార్టీ నేతలు పేరాల రాంబాబు, ఉపాధ్యక్షులు బొక్క నాగేశ్వరరావు, నాయకులు కొత్తూరు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలి



**ప్రజాపక్షం/కొందుర్గు:** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించేందుకు షాపు యాజమానులు కృషి చేయాలని కొందుర్గు మండల మాజీ వైస్ ఎంపిపి రాజేష్ పటేల్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని రామచంద్రాపూర్ గ్రామ వద్ద శ్రీకాంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన షాప్ సీడ్స్, ఫర్టిలైజర్స్ షాపును మాజీ వైస్ ఎంపిపి రాజేష్ పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేష్ పటేల్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎక్కువగా వ్యవసాయ రంగంపై ఆధారపడి ప్రజలు జీవిస్తున్నారని, వారికి అండగా ఉండాలంటే నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. యువత రాజకీయాలతోపాటు వ్యాపార రంగాల్లో రాణించే విధంగా పనులు చేయాలని సూచించారు. ఏకాగ్రతతో వ్యాపారం చేస్తే అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తేనే అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నేతలు రామకృష్ణ, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, శ్రీరంగాపూర్ యాదయ్య, ప్రవీణ్, నరేష్, బాలరాజ్‌లు పాల్గొన్నారు.

## అంబులెన్స్ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/కొందుర్గు:** ఉచిత అంబులెన్స్ సేవలను ప్రజలందరు సద్వినియోగం చేసుకునేందుకు కృషి చేయాలని కొందుర్గు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి కోరారు. శుక్రవారం కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శంషాబాద్ లిమ్స్ అసుపత్రి అధినేత డాక్టర్ రామరాజు ఉచితంగా అంధించిన అంబులెన్స్‌ను పిహెచ్‌సి వైద్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ కొందుర్గు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో పర్యటించడం జరుగుతుందని, ప్రత్యేకంగా ఒక ఫోన్ నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 24గంటల పాటు అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంటాయని, అపదలో ఉండి ఫోన్ చేస్తే నిమిషాల వ్యవధిలోనే చేరుకునే విధంగా సౌకర్యాలను ఏర్పాటు చేశామని వివరించారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, మండలానికి ఉచితంగా అంబులెన్స్ అంధించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మెన్ కృష్ణయ్య, కాంగ్రెస్ నాయకులు రాములు గౌడ్, మల్లేష్ గౌడ్, మాణెయ్య, ప్రసాద్, మనోహార్, గోపాల్, పెంటయ్య, అశోక్‌తోపాటు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరాగాంధీ సేవలు మరవలేము



**ప్రజాపక్షం/షాబాద్:** మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ సేవలు మరువలేమని గుడిమల్కాపూర్ మార్కెట్ వైజ్ చైర్మెన్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరా గాంధీ చిత్ర పటానికి పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు ప్రజలకు ఇందిరమ్మ సేవలు అందుతున్నాయని వివరించారు. తెలంగాణ ఇచ్చిన పార్టీ, రాష్టానికి అభివృద్ధి చేస్తున్న ఘనత స్వర్గీయ ఇందిరా గాంధీకి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి డైరెక్టర్ సంజీవ రెడ్డి, మాజీ సర్పంచ్ జనార్ధన్ రెడ్డి, మాజీ ఎంపిటిసిలు కుమ్మరి చెన్నయ్య, గుండాల అశోక్, పార్టీ నాయకులు ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్, గౌరీశ్వర్, రమేష్, మాణిక్యం శేఖర్ పాల్గొన్నారు.

## వైభవంగా దేవాలయాల ప్రతిష్ఠాపన



**ప్రజాపక్షం/శంకర్ పల్లి:** శంకర్‌పల్లి మండల పరిధిలోని కొండకల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ మల్లన్న, బీరప్ప, కొండపోచమ్మ దేవాలయాల ప్రతిష్టాపన కార్యక్రమాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. గ్రామమంతా భక్తి మయంగా మారి, ప్రతి ఒక్కరు పూజలో పాల్గొంటున్నారు ప్రతిష్టాపన కార్యక్రమాల రెండవ రోజు సందర్భంగా, వేదపండితుల ఆధ్వర్యంలో విగ్రహాలకు పంచామృత అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుండి భక్తులు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చక్కెర తీసుకువచ్చి, పంచామృతాలతో దేవతలకు అభిషేకాలు చేశారు. సాయంత్రం వేళలో గ్రామంలోని ప్రతి ఇంటి నుండి పవిత్ర జలాన్ని తెచ్చి, విగ్రహాలకు జలాభిషేకం నిర్వహించారు. ప్రతిష్టాపన కార్యక్రమాలు నవంబర్ 3వ తేదీ వరకు కొనసాగనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**ప్రజాపక్షం/కొత్తూరు:** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన మండల పరిధిలోని పెంజర్ల రోడ్డు జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కొండా హరినాథ్‌రెడ్డి అనే వ్యక్తి కారులో హైద్రాబాద్ నుండి కొత్తూరు సమీపంలో ఉన్న హిమాక్షి బేకరీ పరిశ్రమకు వస్తుండగా కొత్తూరు మండల కేంద్రంలోని పెంజర్ల రోడ్డు జంక్షన్ వద్ద రోడ్డు పక్కన ఉన్న రియల్ ఎస్టేట్ బోర్డును ఢీకొని తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. అక్కడ ఉన్న స్థానికులు పరిశ్రమ కార్మికులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన శంషాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. చికిత్సపొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి బందువు మురళి మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## రిజర్వేషన్లపై పరిమితి ఎత్తివేతకు
# నవంబర్‌లో పార్లమెంట్ ముట్టడి



జాజుల శ్రీనివాస్‌గౌడ్, కేసన శంకర్‌రావు వెల్లడి

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** సుప్రీంకోర్టు విధించిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి రిజర్వేషన్లపై 50శాతం పరిమితిని కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టం చేసి ఎత్తివేయాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు డిమాండ్ చేశారు. దీంతో పాటు బిసి రిజర్వేషన్లు పెంచాలని,మహిళా బిల్లులో బిసి మహిళకు సబ్‌కోటా కల్పించాలని డిమాండ్‌తో నవంబర్ 25 నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో పార్లమెంట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. బిసి సంఘం పోరాటం ఫలితంగానే నేడు తెలంగాణలో కులగణన జరిగిందని, ఏపితోపాటు దేశవ్యాప్తంగా కులగణన ప్రక్రియ ప్రారంభమైందన్నారు. కులగణన ఆధారంగానే బిసిల వాటా బిసిలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్లు పెంచే బాధ్యత ఇండియా, ఎన్‌డిఎ కూటమిలేదన్నారు. దీంతో ప్రధాని మోదీని, ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని కలిసి బిసి రిజర్వేషన్లపై ఒత్తిడి పెంచుతామని తెలిపారు. సమావేశంలో బిసి సంఘం నేతలు కుందారం గణేశ్‌చారి, శ్యాం కుర్మ, శేఖర్ సగర, పిట్ల శ్రీధర్, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, నర్సింహా నాయక్ పాల్గొన్నారు.

## ‘మార్షల్ ఆర్ట్స్’తో శారీరక, మానసిక దృఢత్వం

‘ప్రెసిడెంట్ కప్’ బ్రోచర్‌ను ఆవిష్కరించిన హీరో సుమన్

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** శారీరక, మానసిక ధృడత్వంపాటు ఓర్పు, సహనం చేకూర్చేందుకు ‘మార్షల్ ఆర్ట్స్’ ఎంతో దోహదం చేస్తుందని సినీ హీరో సుమన్ అన్నారు. ఎన్నిసార్లు ఓడినా క్రుంగిపోవద్దని, అనుకొన్నది సాధించేవరకు శ్రమించాలని యువతకు సూచించారు. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కరాటే ఫెడరేషన్ ఆఫ్ షోటకాన్ ఇండియా అధ్యక్షులు గడియారం గణేశ్ అధ్యక్షతన మీడియా సమావేశం జరిగింది. దీనికి సుమన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి, నవంబర్ 15,16 తేదీల్లో సరూర్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో జరిగే ‘ప్రెసిడెంట్ కప్ ఆలిండియా ఒపెన్ కరాటే చాంపియన్‌షిప్ – 2025’ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల ఆత్మరక్షణకు కరాటే నేర్పించాలని ఆయన తల్లిదండ్రులకు సూచించారు. గణేశ్ మట్లాడుతూ ప్రెసిడెంట్ కప్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, హీరో సుమన్ హాజరవుతారని తెలిపారు.




## లక్ష్యాలు వెంటనే పూర్తిచేయాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా సంచాయి జన భాగదారి పథకంలో ఆయా మండలాల అభివృద్ధికి అధికారులకు ఇచ్చిన లక్ష్యాలను వెంటనే పూర్తి చేయాలని లేనియెడల తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయం సముదాయం నందు గూగుల్ మీట్ ద్వారా జల సంచాయి జనభాగదారి పథకంపై ఎంపిడిఒ,ఎపిఒ లు ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామానికి 10 మ్యాజిక్ సోక్ కిట్స్, కమ్యూనిటీ సోక్ కిట్స్, బోర్ వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్, రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, నిర్మాణం నిర్ణయించి వాటికి సంబంధించిన అంచనాలను గత సమావేశంలో ఆదేశించినప్పటికీ కొన్ని మండలాల్లో ఇంకా తమ లక్ష్యాలను అధిగమించకుండా ఉండడం పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పథకంలో ప్రతి గ్రామంలో సూచించిన విధంగా రెండు రోజుల్లో గుర్తించి అంచనాలను సమర్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి (డిఆర్ డి ఒ పి డి) ఎల్ శ్రీలత, అదనపు పిడి సుభాషిని, ఎంపి డి లు,ఎపిఒ లు పాల్గొన్నారు.



# పేదలకు అండగా ఉండాలన్నదే ధ్యేయం





ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పేదలకు అండగా ఉండటంతోపాటు ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కొత్తూరు, నందిగామ, కేశంపేట మండలాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వచ్చిన 65 చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. శంషాబాద్ లిమ్స్ ఆసుపత్రి డాక్టర్ రామారాజు అంధించిన నాలుగు అంబులెన్స్‌లను కొత్తూరు, కేశంపేట, కొందుర్గు, ఫరూఖ్‌నగర్ మండలాలను అందజేశారు. అనంతరం దివంగత ఇందిరాగాంధీ వర్థంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. సర్థార్ వల్లబాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పేద ప్రజలకు కొండంత అండగా భరోసాను ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, అర్హులైన ప్రతి లబ్దిదారుడిని ప్రభుత్వ పథకాలను అంధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇందిరాగాంధీ ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో దేశ ప్రజల అభ్యున్నతి కోసం ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిందని గుర్తు చేశారు. అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం చేయాలన్న లక్ష్యంతోనే అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. సర్థార్ వల్లబాయ్ పటేల్ నాయకత్వంలో హైద్రాబాద్ సంస్థానాన్ని రాజకార్ల పరిపాలన నుండి విడిపించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్ కరుణాకర్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, వీరేశం, కృష్ణారెడ్డి, హరినాథ్‌రెడ్డి, జంగ నరసింహా యాదవ్, రాజు, చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, లింగారెడ్డిగూడ అశోక్, బాదేపల్లి సిద్దార్థ పాల్గొన్నారు.

## పోలీసుల అమరవీరుల దినోత్సవం

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్/హయత్ నగర్:** పోలీసుల అమరవీరుల దినోత్సవను వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్నింగ్ వాక్‌లో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంను ఎన్జీవోస్ కాలనీలోని వివేకనంద పార్కులో టుకే రన్‌ను ప్రారంభించారు.



అనంతరం వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో మెగా రక్తదానం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి వనస్థలిపురం ఏసిపి పి. కాశిరెడ్డి హాజరై రక్త దాన శిబిరంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోలీసులతో పాటు 60 మంది ప్రజలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఏసిపి కాశిరెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి పోలీసులకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు పోలీసుల మధ్య సమన్వయంతోనే నేరాలను అదుపుచేయడం సాధ్యమైతుందన్నారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం, హయత్ నగర్, మీర్పేట్, అబ్దుల్లాపూర్‌మెంట్ సర్కిల్ సీఐలు టి.మహేష్ కుమార్, డిఐ భూక్య రాజేష్ నాయక్, పల్స నాగరాజు గౌడ్, శంకర్ నాయక్, అశోక్ రెడ్డి, ఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం చేస్తాం : కృష్ణ

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** బీసిలకు 42శాతం రిజర్వేషన్లు సాధించే వరకు నిర్వీరామంగా ఉద్యమాలు, పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలంగాణ రాష్ట్ర బీసి జెఎసి కన్వీనర్ బర్క కృష్ణ తెలిపారు. శుక్రవారం షాద్‌నగర్‌లో బర్క కృష్ణను స్థానిక బీసి సేన నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జెఎసి కన్వీనర్ బర్క కృష్ణ మాట్లాడుతూ బీసిలకు 42శాతం రిజర్వేషన్లు సాధించే వరకు అలుపెరగని పోరాటం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప, మహిళా అధ్యక్షురాలు భాస వరలక్ష్మి, యువజన అధ్యక్షుడు పాలది శ్రీనివాస్, కార్యదర్శి జూపల్లి చంద్రశేఖర్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులు సౌజన్య, భూషణ్, నరేష్, ప్రచార కార్యదర్శి మమత తదితరులు పాల్గొన్నారు.



## ఆదర్శమూర్తి సర్దార్ పటేల్

కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**ప్రజాపక్షం /హయత్ నగర్ :** సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ గారి జయంతి సందర్భంగా హయత్‌నగర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో హయత్‌నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రత్యేక కార్యక్రమానికి హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని సర్దార్ వల్లభభాయ్ పటేల్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉగాది ఎల్లప్ప, పారంద మహేష్, ఎర్రవెలి సత్యనారాయణ, వస్పరి వెంకటేష్, జనార్ధన్, ఇట్టబోయిన నర్సింహా, పిట్టల జంగం, శక్తి సింగ్, మధు, సూర్య నాయక్, బాలు, జంగా రెడ్డి, మొగులయ్య, శంకర్ నాయక్, అమల్, సురేష్, ఎర్ర శ్రీకాంత్, బాలు నాయక్, అరుణ్ బీజేవైఎం నాయకులు ప్రేమ్, అఖిల్, అభి, నాగరాజ్ పాల్గొన్నారు.

# ఘనంగా ఎఐటియుసి ఆవిర్భావ వేడుకలు

**ప్రజాపక్షం/హయత్‌నగర్ :** ఎఐటియుసి 106వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా హయత్‌నగర్ లేబర్ అడ్డ వద్ద మందుల కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డి హాజరై కార్మిక జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, 4 లేబర్ కోడులను రద్దుచేసి, 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26,000 నిర్ణయించి అమలు చేయాలన్నారు. అసంఘటిత కార్మికులకు సమగ్ర సంక్షేమ బోర్డుని ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్మిక రైతు అసంఘటిత కార్మికులకు సమగ్ర సంక్షేమ బోర్డుని ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ, రంగ సంస్థలను పరిరక్షించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొటాలని కార్మిక లోకానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ హయత్‌నగర్ మండల కార్యదర్శి శేషరాజు పల్లి శ్రీదేవి, సహాయ కార్యదర్శి మర్రి శోభన్, ఎఐటియుసి మండల కార్యదర్శి గోల్కొండ నాగరాజు, బిఒసి రాష్ట్ర సమితి సభ్యురాలు కవిత, అంకన్న, యమునా, పారిజాత, సౌజన్య, దిలీప్, స్వరూపతో కార్మికులు పాల్గొన్నారు.

**షాబాద్ :** కార్మికుల హక్కులను సాధించే వరకు పోరాటం చేద్దామని ఎఐటియుసి రాష్ట సమితి సభ్యులు కే.రామస్వామి అన్నారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలో ఎఐటియుసి అవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్మిక జెండాను అవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ వివిధ కంపెనీల నిర్వహాకులతో మాట్లాడి కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు ఎఐటియుసి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలోఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభులింగం, మక్బూల్, జిల్లా కౌన్సిల్ సభ్యులు వడ్ల సత్యనారాయణ, మంజుల, మండల కార్యదర్శులు సత్తిరెడ్డి, సుధీర్, నాయకులు పెంటయ్య, నర్సింలు, సుధాకర్ గౌడ్, అంజమ్మ, వెంకటమ్మ, సత్తయ్య, శౌరిలు బాబు తదితరులు పాల్గొన్నారు.

**గండిపేట :** ఎఐటియుసి ఆవిర్భావ వేడుకలు శుక్రవారం గండిపేట్ మండలం మణికొండ మున్సిపాలిటీలో ఘనంగా నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్.మల్లేష్, సీనియర్ నాయకులు ఎం.శంకరయ్య హాజరై కార్మిక జెండా ఆవిష్కరించి మాట్లాడారు. నాటి నుండి నేటి వరకు కార్మికులకు, కష్టజీవులకు అండగా దోపిడీదారులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ ఎఐటియుసి అండగా నిలిచిందని మల్లేష్ తెలిపారు. పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని, 4 లేబర్ కోడ్‌లను రద్దుచేసి 44 కార్మిక చట్టాలను పునరుద్దించాలని, కనీస వేతనాలు రూ.26.000 లు నిర్ధారించి అమలు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.బాబు రావు, శ్రీకాంత్, ప్రకాష్, శ్రీరాము, ప్రభు, లక్ష్మి, దేవి, చిన్న, రాము, లక్ష్మణ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.





# క్రీడ

## వరల్డ్ కప్ గెలిస్తే..
# ఆమెతో కలిసి పాడతా..
### ఫ్యాన్స్‌కు గావస్కర్ ప్రామిస్



మహిళల వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌కు టీమ్‌ఇండియా దూసుకెళ్లింది. సెమీస్‌లో ఆస్ట్రేలియాను చిత్తు చేసిన భారత్ తుది పోరుకు అర్హత సాధించింది. ఆదివారం దక్షిణాఫ్రికాతో టైటిల్ పోరులో టీమ్‌ఇండియా తలపడనుంది. ఈ క్రమంలో క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ అభిమానులకు ఓ హామీ ఇచ్చాడు. సెమీస్‌లో అజేయంగా సెంచరీ చేసిన జెమీమా రోడ్రిగ్స్‌తో కలిసి పాట పాడతానని వెల్లడించాడు. అయితే, జెమీమా అందుకు అంగీకరిస్తేనేనని స్పష్టంచేశాడు. ఇంతకుముందు భారత పురుషుల జట్టు టీ20 ప్రపంచ కప్ గెలిచినప్పుడు మైదానంలోనే డ్యాన్స్ చేసిన సంగతి తెలిసిందే. 'ఒకవేళ భారత్ వన్డే ప్రపంచ కప్‌ను గెలిస్తే.. నేను జెమీమాతో కలిసి పాట పాడుతా. ఆమె గిటార్ అద్భుతంగా వాయిస్తుంది. గిటార్ వాయిస్తూ ఉంటే నేను గాయకుడిగా మారతా. మేమిద్దరం కొన్నాళ్ల కిందట బీసీసీఐ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్నాం. అక్కడ బ్యాండ్ ప్లే అవుతూ ఉంటే మేమిద్దరం జాయిన్ అయ్యాం. జెమీమా గిటార్ ప్లే చేసింది. నేను నా వాయిస్‌తో ఏదో పాడేశా. అందుకే అభిమానులకు హామీ ఇస్తున్నా.. మన జట్టు వరల్డ్ కప్ గెలిస్తే మరోసారి ప్రదర్శన ఇస్తాం. అయితే, ఈ ఓల్డ్‌మ్యాన్‌తో కలిసి ప్లే చేయడం జెమీమాకు ఇష్టమైతేనే సుమా..' అని గావస్కర్ వ్యాఖ్యానించాడు. 2024లో బిసిసిఐ ఏర్పాటు చేసిన అవార్డుల కార్యక్రమంలో జెమీమా రోడ్రిగ్స్ గిటార్‌ను ప్లే చేసి అలరించింది. అక్కడి స్టేజ్ పైకి వెళ్లిన సునీల్ గావస్కర్ తన గానంతో క్రికెటర్లను ఆకట్టుకున్నాడు.

## పుణెరి పల్టన్‌కు చుక్కెదురు..
### రెండోసారి ఛాంపియన్‌గా దబాంగ్ ఢిల్లీ



ప్రోకబడ్డీ లీగ్ పన్నెండో సీజన్‌లో దబాంగ్ ఢిల్లీ ఛాంపియన్‌గా నిలిచింది. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన ఫైనల్లో పుణెరి పల్టన్‌కు షాకిస్తూ మూడు పాయింట్ల తేడాతో జయభేరి మోగించింది. చివరి రెండు నిమిషాల్లో ఇనాందార్ రెండు పాయింట్లు సాధించగా స్కోర్లు సమం అవుతాయనిపించింది. కానీ, తర్వాతి రైడ్‌లో ఫజల్ అత్రాచెలీ పట్టేయడంతో ఢిల్లీకి విజయం సొంతమైంది. దాంతో.. రెండోసారి విజేతగా నిలవాలనుకున్న ఆ జట్టు కథ రన్నరప్‌తోనే ముగిసింది. మూడు నెలలు అభిమానులు అలరించిన

ప్రోకబడ్డీ లీగ్‌లో దబాంగ్ ఢిల్లీ టైటిల్ కొల్లగొట్టింది. ఎనిమిదో సీజన్‌లో కప్ తన్నుకుపోయిన ఆ టీమ్ ఇప్పుడు రెండోసారి విజేతగా నిలిచింది. రెండు సమఉజ్జీలైన ప్రత్యర్థులు కావడంతో మ్యాచ్ ఆసాంతం హోరాహోరీగా సాగింది. తొలి అర్ధ భాగంలోనే పుణెరిని ఆలౌట్ చేసిన ఢిల్లీ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. రెండో అర్ధ భాగంలో పుంజుకున్న పుణెరి టాకిల్ పాయింట్లతో గుబులు రేపింది. కానీ, చివరకు కూల్‌గా ఆడిన ఢిల్లీనే విజయం వరించింది. లీగ్ దశలో అత్యధిక పాయింట్లతో ప్లే ఆఫ్స్ దూసుకెళ్లిన ఢిల్లీ.. క్వాలిఫయర్ 1లో పుణెరి పల్టన్‌ను ఓడించి ఫైనల్ చేరింది. మరోవైపు.. క్వాలిఫయర్ 2లో తెలుగు టైటాన్స్‌కు చెక్ పెట్టిన పల్టన్ టీమ్ ఫైనల్లో మాత్రం ఢిల్లీని దాటలేకపోయింది. దాంతో..10వ సీజన్ ఛాంపియన్ పుణెరి పల్టన్‌కు నిరాశ తప్పలేదు. పుణెరి పల్టన్ జట్టులో ఆదిత్య షిండే సూపర్ 10 సాధించగా.. ఢిల్లీ నుంచి నీరజ్ నర్వాల్ 9 రైడ్ పాయింట్లతో మెరిశాడు.




ఐసిసికి

## ఒకట్రెండు రోజుల్లో
# ఆసియా కప్ ట్రోఫీ భారత్‌కు

ఆసియా క్రికెట్ కౌన్సిల్ చీఫ్ నఖ్వీ ఒకటి లేదా రెండు రోజుల్లో ఆసియా కప్ ట్రోఫీని భారత్‌కు అప్పగించే అవకాశముందని బిసిసిఐ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్థాన్‌పై టీమ్‌ఇండియా విజయం సాధించి ట్రోఫీని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే దాదాపు నెలరోజులు గడుస్తున్నా.. ఇంకా ట్రోఫీ, మెడల్స్‌ను అందించకపోవడంపై బిసిసిఐ సెక్రటరీ దేవజిత్ సైకియా అసంతృప్తి వ్యక్తం చేశారు. నవంబర్ 4న ఐసిసి త్రైమాసిక సమావేశం జరగనుంది. ఈలోగా నఖ్వీ.. ఆ ట్రోఫీని భారత్‌కు అప్పగించాలని, లేకపోతే ఈ విషయాన్ని ఐసిసి దృష్టికి తీసుకువెళతామని ఆయన హెచ్చరించారు. 'దాదాపు నెల గడుస్తున్నా.. ఇప్పటికీ ఆసియా ట్రోఫీని మాకు అందించలేదు. ఇది సరికాదు' అని సైకియా ఓ న్యూస్ ఏజెన్సీతో అన్నారు. అలాగే ట్రోఫీ విషయమై ఏసీసీకి లేఖ పంపిన విషయాన్నీ ధ్రువీకరించారు. అయితే దానికి బదులుగా నఖ్వీ.. ఏసీసీ కార్యాలయంలోనే ట్రోఫీని తీసుకోవాలని బదులిచ్చినట్లు తెలిపారు. 'మేం ఏసీసీ ఛైర్మన్‌కు ఆసియా కప్ ట్రోఫీ విషయమై లేఖ పంపాం. అయినా పరిస్థితిలో ఏ మార్పూ రాలేదు. ట్రోఫీ ఇప్పటికీ వారి స్వాధీనంలోనే ఉంది. ఒకట్రెండు రోజుల్లో తప్పకుండా అది ముంబయిలోని బిసిసిఐ కార్యాలయానికి వస్తుంది' అని సైకియా ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆసియా కప్‌లో భారత్ మొత్తంగా మూడుసార్లు పాకిస్థాన్‌తో తలపడితే, అన్ని మ్యాచ్‌లనూ టీమ్‌ఇండియా గెలిచింది. ఫైనల్‌లోనూ పాక్‌పై నెగ్గి ట్రోఫీని కైవసం చేసుకుంది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత ఆటగాళ్లు.. పాక్ క్రికెటర్లతో కరచాలనానికి ఆసక్తి చూపని విషయం తెలిసిందే. అలాగే పాకిస్థాన్‌కు చెందిన ఏసీసీ చీఫ్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని అందుకోవడానికీ ఇష్టపడలేదు. అయితే ఆ ట్రోఫీని మరొకరి చేతుల మీదుగా భారత జట్టుకు అందించకుండా.. నఖ్వీ పిల్ల చేష్టలకు పాల్పడ్డాడు. ట్రోఫీ, మెడల్స్‌ను మైదానం నుంచి తనతోపాటు తీసుకెళ్లాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ వాటిని ఆసియా కప్ విజేతగా నిలిచిన టీమ్‌ఇండియాకు అందించకుండా నఖ్వీ.. క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాడు.

# ఫోకస్

# సైన్స్


# గురుత్వాకర్షణపై కొత్త సిద్ధాంతం!




ఇప్పటి వరకూ అందరూ గుర్తించిన గురుత్వాకర్షణ శక్తికి యూనివర్సిటీ ఆఫ్ పోర్ట్స్‌మౌత్ భౌతికశాస్త్రవేత్త మెల్విన్ వాప్సన్ కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తున్నాడు. ఆయన వాదనను అనుసరించి గురుత్వాకర్షణ అనేది కేవలం వస్తువులను ఆకర్షించే శక్తి మాత్రమేకాదు.. అది విశ్వం సంగ్రహిస్తున్న సమాచారాన్ని నిర్వహించేందుకు ఉపయోగించే ఒక గణనాత్మక (computational) ప్రక్రియ. వాప్సన్ సిద్ధాంతంలో, ప్రతి పరమాణువు ఒక డిజిటల్ బిట్ లాంటి స్పేస్‌టైమ్ పిక్సెల్‌ను నింపే సమాచార అణువుగా పనిచేస్తుంది. ఒకే పిక్సెల్‌లో చాలా పరమాణువులు చేరితే, కంప్యూటర్‌లో ఫైల్‌ను కంప్రెస్ చేసే విధంగానే, గురుత్వం వాటిని ప్రాథమికమైన, సరళమైన నిర్మాణంగా కుదించేస్తుంది. అంటే దత్తాంశ సంరక్షణ కార్యక్రమం సాగుతోంది. ఇక ఆయన ప్రతిపాదించిన రెండో సూత్రం 'ఇన్ఫోడైనమిక్స్'. ఇది వాప్సన్ అభివృద్ధి చేసిన సమాచార వ్యవస్థ పరిణామం గురించి వర్ణించే నూతన మూల సూత్రం. ఇందులో సమాచార ఏకాంత వ్యవస్థల్లో ఏర్పడే స్థూల డేటా తగ్గిపోతూ ఉంటుంది. ఇది స్థిరంగా ఉండదన్నది వాప్సన్ అభిప్రాయం. దీని వల్ల విశ్వం నిర్బంధంగా అనిశ్చితిని పెంచడమేగాక, అపరమిత దత్తాంశాన్ని బహుళంగా క్రమబద్ధీకరించే ప్రక్రియ అని అర్థమవుతుంది. ఈ పద్ధతిలో, గురుత్వం అనేది ఒక వ్యవస్థాపిత హౌస్‌కీపింగ్ విధానంలా పని చేస్తుంది. విశ్వం స్పేస్‌టైమ్‌ను ప్రాప్యత, సామర్థ్యం, సమాచార మార్గీకరణ వంటి గణనాత్మక పనులు చేస్తూ పరిరక్షిస్తోంది. ఈ సిద్ధాంతం ప్రకారం, గురుత్వం అనేది వివిధ అణువులు, వస్తువులు, రంగులో నమోదైన సమాచారాన్ని తగ్గించడానికి జరుగుతున్న కంప్రెషన్ చర్య. ఇది ఉహాజనిత సిద్ధాంతమే అయినప్పటికీ, గురుత్వం, క్వాంటం సమాచారం, బ్లాక్ హోల్ థెర్మోడైనమిక్స్, డార్క్ మ్యాటర్, డార్క్ ఎనర్జీ, వ్యవస్థాపక ప్రాముఖ్యత మధ్య కొత్త సంబంధాలను సూచిస్తుంది. కంప్యూటర్ శాస్త్ర నియమాలతో కూడిన విశ్వ విచిత్ర పనితీరు, కేవలం భావ పరంగా కాదు, వాటిని పరిశీలించేందుకు, గణిత, అనుకరణ, ప్రయోగవిజ్ఞానం ఆధారంగా పరిశోధన కొనసాగడానికి ఉపయోగపడుతుంది. ఈ విధంగా, గురుత్వం ఒక స్వయంకల్పింత సమాచార నియంత్రణ విధానంగా, అసలైన భౌతిక అర్థాన్ని మించిపోయే డిజిటల్ లాజిక్‌లో విశ్వం నడుస్తోంది అని వాప్సన్ సిద్ధాంతం అంటోంది. మనం అధిక సమాచారం, కంప్రెషన్, లాజికల్ నిర్మాణాలు విశ్వం ఎలా నడుస్తుందో తెలుసుకునే కొత్త దశకు ప్రయాణిస్తున్నామని ఈ సూత్రం సూచిస్తున్నది.

'బిగ్ బ్యాంగ్'తో విశ్వ మొదలైందనేది ఇప్పటి వరకూ శాస్త్రవేత్తలు నమ్ముతున్న సిద్ధాంతం. అయితే, ఈ సృష్టికి తెరపడుతుందని, నిరంతరం వ్యాపిస్తున్న విశ్వం ఒక్కసారిగా కుదించుకుపోతుందని 'బిగ్ క్రంచ్' సిద్ధాంతం పేర్కొంటున్నది. దీనిని అనుసరించి, భవిష్యత్తులో విశ్వం అతి విచిత్రమైన కాల గమనంలో కదులుతుంది. ఫలితంగా డార్క్ ఎనర్జీలోకి కుప్పకూలుతుంది. మొత్తం విశ్వం జీవితం సుమారు


## విశ్వ విస్తరణకు కళ్లెం!



33 బిలియన్ సంవత్సరాలు అని ఈ విశ్లేషణ అంచనా వేస్తున్నది. ఇప్పటివరకు ఈ సృష్టి కాలం సుమారు 13.8 బిలియన్ సంవత్సరాలు అనుకుంటే, ఇంకా సుమారు 19 బిలియన్ సంవత్సరాలు మిగిలి ఉంటుంది. అప్పటి వరకూ విశ్వం అనంతంగా విస్తరిస్తునే ఉంటుంది. ఈ విస్తరణకు ఒక దశలో ముగింపు తప్పదు. అప్పుతు వేగవంతమైన సంకోచానికి గురవుతుంది. ఈ స్థితిని 'బిగ్ క్రంచ్'గా పేర్కొంటున్నారు. కాలచక్రంలో ప్రారంభం, ఎదుగుదల, పతనం ఎలా కొనసాగుతాయో, అదే రీతిలో విశ్వం మొదలైంది. కొనసాగుతున్నది. భవిష్యత్తులో పతనమై, ముగుస్తుంది. 'బిగ్ బ్యాంగ్'తో విస్తరణం... 'బిగ్ క్రంచ్'తో కుదింపు.. వెరసి విశ్వం మొదలు... అంతం. ఇదే ఈ సిద్ధాంతాల సారాంశం.

ఆశ్చర్యం గొలిపే ప్రయోగంలో అమెరికన్ శాస్త్రవేత్తలు కేబుల్స్ ద్వారా కాంతిని ప్రసారం చేసి, ఓ అద్భుతాన్ని ఆవిష్కరిచారు. ఇంటర్నెట్ కేబుల్స్ ద్వారా 30 కిలోమీటర్ల దూరానికి, క్వాంటం స్టేట్ ఆఫ్ లైట్‌ను పంపించారు. కేబుల్స్ ద్వారా కాంతిని పంపడం ప్రపంచంలో ఇదే మొదటిసారి. ఈ ప్రయోగాన్ని ఆన్‌లైన్ ట్రాఫిక్ సాగే సాధారణ ఇంటర్నెట్ ఫైబర్ కేబుల్స్‌లో, క్వాంటం కంకణాలతో సహజంగా కలిసి, క్వాంటం గుణాలకు భంగం లేకుండా కాంతి ప్రయాణానికి అనువైన పరిస్థితులు సృష్టించారు. దీనినే 'టెలిపోర్టేషన్'గా పిలుస్తారు. ప్రత్యేకమైన కొత్త మౌలిక సదుపాయాలు లేకుండా ప్రస్తుత ఇంటర్నెట్ ఫైబర్ సౌకర్యాలను ఉపయోగించి క్వాంటం సంభాషణ సాధ్యమవుతుందని శాస్త్రవేత్తలు నిరూపించారు. ఈ ఆవిష్కరణ సాధారణంగా కనిపించినప్పటికీ, దీని ప్రభావం చాలా గొప్పగా ఉండబోతుంది. సమాచార రంగంలో విప్లవాత్మక మార్పులకు ఈ ప్రయోగం శ్రీకారం చుట్టింది.

## కేబుల్స్ ద్వారా కాంతి ప్రసారం!



# కార్మికవర్గ పోరాటంలో ఎఐటియుసిది అజరామర చరిత

### ఘనంగా ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం


భద్రాద్రి...


నల్లగొండ...


నిజామాబాద్...

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కార్మిక వర్గ పోరాట చరిత్రలో ఎఐటియుసిది అజరామరమైన అధ్యాయం అని, స్వాతంత్ర సమరంలోనూ, ఆ తర్వాత కార్మిక హక్కుల కోసం సాగిన ప్రతీ ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించిందని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి, ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. ఎఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘటిత, అసంఘటిత కార్మిక అడ్డాలు కార్మిక వాడల్లో జరిగిన ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య, కార్యదర్శి గెద్దాడు నగేష్, నాయకులు దమ్మాలపాటి శేషయ్య, వంగా వెంకట్, జి.వీరస్వామి, వి.మల్లిఖార్జునరావు, జక్కుల గట్టయ్య, కె.రాములు, కిష్టాపర్, సంధ్యబోయిన శ్రీను, యూమాయున్, నాగేశ్వరరావు, కృష్ణయ్య, మాచర్ల శ్రీనివాస్, కె.నవీన్, లక్ష్మి , గుడిపాటి వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**మందమర్రి :** ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం సిపిఐ కార్యాలయం వద్ద ఎఐటియుసి జెండాను ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కలిందర్ అలీఖాన్, మిట్టపల్లి పౌలు, దొడ్డిపట్ల రవీందర్, కాదండి సాంబయ్య, చాడా మహేందర్ రెడ్డి, కొత్తపల్లి మహేష్, రాయమల్లు, కోడి వెంకటేష్, సర్వ శ్రీనివాస్, రమేష్, నర్సయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**భువనగిరిరూరల్ :** ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షుడు బోలగాని సత్యనారాయణ భువనగిరి జిల్లా కార్యాలయం ముందు కార్మిక జెండా ఆవిష్కరించారు. భువనగిరి ప్రభుత్వ జిల్లా హాస్పిటల్, సివిల్ సప్లై హమాలి యూనియన్, కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డ్, కొత్త బస్టాండ్ వద్ద భువనగిరి టూ ఉప్పల్ మరియు మోత్కూర్ రూట్ టాటా ఏసీ యూనియన్, ఘట్కేసర్, యాదగిరిగుట్ట మరియు భువనగిరి లోకల్ ఆటో యూనియన్‌ల అడ్డ వద్ద ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి ఎండి ఇమ్రాన్ కార్మిక జెండా ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో సామల శోభన్‌బాబు, పుట్ట రమేష్, సామల భాస్కర్, వల్దస్ నరసింహ, ముంతాజ్ బేగం, గుర్రాల శ్రీను, కొత్త కృష్ణ, మరిపల్లి సాయి, బాగుల వసంత, బోయిని బిక్షపతి, భూపాల్ రెడ్డి, గణేష్, పాండు, మైసయ్య, జహంగీర్, విజయలక్ష్మి , నిర్మల, స్వామి, సంధ్య, లక్ష్మి , జగన్, సత్యనారాయణ, అండాలు, బసవయ్య పాల్గొన్నారు.

**మహబూబాబాద్ :** కేంద్రంలో కార్పోరేట్ ప్రధాని మోదీని గద్దె దించేందుకు కార్మికులు ఐక్యంగా ఉండాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.అజయ్‌సారథిరెడ్డి, రేషపల్లి నవీన్ అన్నారు. ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో బాణాసంచా కాల్చి కేక్ కట్ చేసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మందశంకర్, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, వంకాయలపాటి జకరయ్య, పెరుగు కుమార్, బానోతు లింగ్యనాయక్, జలగం ప్రవీణ్, ఆబోతు అశోక్, వంకాయలపాటి చిరంజీవి, రాము, సోమయ్య, ముత్యాలు రాము లు, కిషన్, నారాయణ, రమణ, మధు, విజయ్, నాగేశ్వరరావు, పాషా, యూసుఫ్, వీరన్న, శేఖర్ పాల్గొన్నారు.



మహబూబాబాద్...

**కోదాడ:** కార్మికుల సమస్యల కోసం వారికి అండగా నిలిచిన జెండా ఎఐటియుసి అని రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కోదాడ ఆర్‌టిసి బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఎఐటియుసి జెండాను ఆయన ఎగురవేసి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె లతీఫ్, నాయకులు నాగరాజున నయీం, మెసిన్, జానీ, రామారావు, వెంకయ్య, గోపి, సుల్తాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** కార్మికుల ఎజెండానే ఎఐటియుసి జెండా అని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు, ఎఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎ గౌస్ పేర్కొన్నారు. శుక్రవారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గోసిక మోహన్, తాళ్ళపెల్లి మల్లయ్య, నాయిని శంకర్, లెనిన్, నవీన్, పొన్నం రంజిత్, తొడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్ అర్బన్ :** ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ నగరంలో ప్రభుత్వ ఆసుపత్రి, మెడికల్ కళాశాల, వ్యవసాయ మార్కెట్ యార్డు, కిషన్ గంజ్, గాంధీ గంజ్, మునిసిపల్ కార్యాలయాల వద్ద కార్మిక జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఎఐటియుసి నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య, జిల్లా అధ్యక్షులు పి.నర్సింగరావు, ఉపాధ్యక్షులు చక్రపాణి, పిన్నెల హనుమాండ్లు, పరశురాం, దేవేందర్, కండ్లకోయ ప్రసాద్, భాగ్య లక్ష్మి , కవిత, స్వరూప, రాధాకుమార్, చిన్ను భాయ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

**నల్లగొండ:** దేశంలో ఏర్పడ్డ మొట్టమొదటి కార్మిక సంఘం ఎఐటియుసి అని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. ఎఐటియుసి వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నల్లగొండలో కార్మిక జెండాను పల్లా దేవేందర్ రెడ్డి డిఇఒ ఆఫీస్ వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కెవిస్ రెడ్డి, జిల్లా కోశాధికారి దొనకొండ వెంకన్న,డివిజన్ కార్యదర్శి విశ్వనాధుల లెనిన్, భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు గుండె రవి, కార్యదర్శి రేవల్లి యాదయ్య, నరసింహ, మిషన్ భగీరథ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎండిజానీ, కృష్ణ,, పోతు రాజు నాగరాజు, కంభంపాటి జానయ్యా, లక్ష్మయ్య, గిరి, వీరయ్య, వెంకన్న పాల్గొన్నారు.

**ములుగు :** కార్మిక చట్టాలను రక్షించుకోవడం కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్యశాల వద్ద ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్మిక జెండాను జంపాల రవీందర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముత్యాల రాజు, ఇంజం కొమురయ్య, పెద్దకాసు వినోద్, కొత్తూరు శ్రీనివాస్, సమత, కళావతి, రాజయ్య, బాలు, బాల్ సింగ్, సమత, కళావతి పాల్గొన్నారు.

**సంగారెడ్డి :** ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జరిగిన పతాకావిష్కరణలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎ రహమాన్, వెంకటరాజ్యం పాల్గొన్నారు. స్థానిక కొత్త బస్టాండ్, సంగారెడ్డి జిల్లా కేంద్రప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో, కలెక్టరేట్ కార్యాలయం వద్ద, తల్లి తెలంగాణ విగ్రహం వద్ద ఎఐటియుసి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు ఆనంద్ సలీం, సుంకన్న శివశంకర్, లక్ష్మి దుర్గయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

**ఖమ్మం :** కార్మికులు అనుభవిస్తున్న హక్కులు, సంక్షేమ పథకాలు ఎఐటియుసి పోరాట ఫలితమేనని ఎఐటియుసి జాతీయ సమితి సభ్యులు బిజి క్లెమెంట్ తెలిపారు. ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం నగరంలోని పర్ణశాల వద్ద గల ఎఐటియుసి పైలాన్ వద్ద కార్మిక జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ, తోట రామాంజనేయులు, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి , జిల్లా నాయకులు పేరబోయిన మోహన్‌రావు, పిట్టల మల్లయ్య, ఎండి.జాకీరుద్దీన్, గుండెపొంగు మల్లేష్, తాటి నిర్మల, జి.నర్సయ్య, కోటేశ్వరరావు, రావుల శ్రీను, గురవయ్య, మంగీలాల్ పాల్గొన్నారు.

**హనుమకొండ టౌన్ :** ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని హనుమకొండలో ఘనంగా నిర్వహించారు. ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి యాదవ్ జెండా ఆవిష్కరించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దేల ఎల్లేష్, నద్దూనురి వెంకట్రాజం , ఎన్ఎ.స్టాలీన్, కొట్టేపాక రవి, రామ రాజేష్ ఖన్నా, ధర్మల రాంమూర్తి, మాలోత్ శంకర్ నాయక్, మద్దెల శ్రీనివాస్, లలిత తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మం...


కోదాడ...


మంచిర్యాల...


ములుగు...


పెద్దపల్లి...


సంగారెడ్డి...


యాదాద్రిభువనగిరి...


హన్మకొండ...



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలి



ప్రజాపక్షం/వెల్దండ : గ్రామపరిపాలన అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలందించాలని ఆర్‌డిఓ ఎంపి జనార్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రెవెన్యూ డాక్యుమెంట్లను ఆయన పరిశీలించారు. గ్రామాలలో రైతులకు భూపరమైన సమస్యలు ప్రభుత్వం నుంచి అందించే కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ తదితర వంటి పథకాలను ప్రజలకు చేరవేసేవిధంగా చూడాలని వారికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఆర్.శంకర్‌నాయక్, గ్రామపరిపాలన అధికారులు కిషన్,శోభ, ముత్తమ్మ, రమేష్, శ్రీలత, వినయ్, సిద్దయ్య,అనిత ఉన్నారు.



## జడ్చర్లమాస్టర్ ప్లాన్ రూపకల్పన

కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశం

ప్రజాపక్షం/జడ్చర్ల : జి.ఐ.ఎస్. ఆధారిత మాస్టర్ ప్లాన్ రూపకల్పన సమర్థవంతంగా చేపట్టాలని, ఇందు కొరకు అవసరమైన వివరాలను సంబంధిత శాఖల అధికారులు అందించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో (కలెక్టరేట్) డి.టి.సి.పి. సంయుక్త సంచాలకులు, అమృత్ 2.0 నోడల్ అధికారి అశ్విని, సంబంధిత శాఖల అధికారులకు, మున్సిపల్ కౌన్సిలర్లకు, వివిధ శాఖల అధికారులకు జడ్చర్ల మాస్టర్ ప్లాన్ రూపకల్పన అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మొదటి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిఐఎస్ ఆధారిత మాస్టర్ ప్లాన్ రూపకల్పన సమర్థవంతంగా చేపట్టాలని, మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు అవసరమైన సమాచారం వివిధ శాఖలు నవంబర్ 7 లోగా అందించాలని అన్నారు. 2051 సంవత్సరం నాటికి నాభా మరింత పెరిగే అవకాశం ఉందని, జనాభా ప్రతిపదికను ప్రజలకు అవసరమైన ఇండ్లు, త్రాగునీరు, రహదారులు, ఇతర సదుపాయాలు ప్రణాళికాబద్ధంగా అందించేందుకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అదనపు ఎస్.పి. రత్నం, జడ్చర్ల మున్సిపల్ చైర్మన్ కావలి పుష్పలత, మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలన కోసం ఇందిరమ్మ కృషి



టిపిసిసి ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్: పేదరిక నిర్మూలన కోసం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఎంతో కృషి చేశారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక క్లాక్‌టవర్‌లో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షులు చంద్రకుమార్ గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, డీసీసీ మీడియా సెల్ కన్వీనర్ సీజె బెనహర్, నాయకులు అమరేందర్ రాజు, సిరాజ్ ఖాద్రి, రాఘవేందర్ రాజు, సాయిబాబా, రాకేష్, పటేల్, కంచిమి లక్ష్మణ్, రాములు యాదవ్, తాహెర్, నాగరాజు, అబ్దుల్ హక్, పీర్ సాధిక్ పాల్గొన్నారు.

## ఉత్తమ ర్యాంకు సాధించాలి



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్: ప్రభుత్వం నిర్వహించే ఎప్సెట్ మరియు నీట్ ఎంట్రెన్స్ పరీక్షలో పయనీర్ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులను సాధించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. ఎమ్మెల్యే తన సొంత నిధులతో ప్రభుత్వ బాలుర మరియు బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పయనీర్ పేరుతో ఎప్సెట్ మరియు నీట్ ఎంట్రెన్స్ టెస్ట్ కోసం ఉచిత కోచింగ్ అందజేస్తున్నారు. అందుకు సంబంధించిన స్టడీ మెటీరియల్స్ ను ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో పయనీర్ కార్యక్రమం ద్వారా కోచింగ్ పొందుతున్న విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ భవిష్యత్తు బాగుండాలంటే అనవసర విషయాలకు దూరంగా ఉండాలని, ఎలాంటి వ్యాపకాలు చేయకుండా మంచిగా చదువుకోవాలని, ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, నాయకులు శ్రీనివాస్ యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్ భగవంతచారి తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు వినతి

తెలంగాణ ఉద్యమ నేత రామలింగం డిమాండ్

ప్రజాపక్షం/మక్తల్ : మక్తల్ మండల పరిధిలోని రుద్రసముద్రం గ్రామ సమీపంలో ప్రభుత్వ గోదాం వద్ద వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనుకు శుక్రవారం తెలంగాణ ఉద్యమకారుడు రామలింగం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేశాఖ ధాన్యాన్ని నిలువ చేసేందుకు కోట్లాది రూపాయలతో గోదాంను నిర్మించింది. ఈ ప్రాంతంలో కొనుగోలు చేసిన ధాన్యం ఇక్కడే నిల్వ ఉంచుతారు. ప్రజా పంపిణీ బియ్యాన్ని కూడా స్టాక్ పైంట్ గా ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. గోదాం దగ్గర లోడింగ్ అన్ లోడింగ్ చేయడానికి కూలీలు సదుపాయం అన్ని వసతులు ఉన్నాయని. మండలంలోని 32 గ్రామ పంచాయతీలు దాదాపు సగానికి పైగా గ్రామాల్లో పొలాలకు సాగు నీరు అందడంతో రైతులు వరి సాగు చేస్తున్నారని తెలిపారు. రుద్రసముద్రం గ్రామ గోదాం రహదారి దగ్గర ఉండి అందరికీ అందు బాటులో ఉన్నందునా ఇక్కడ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

## సిమెంట్ అందజేత

ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ : కల్వకుర్తి మున్సిపాలిటి కైలాసం గుట్టపైన అయ్యప్ప స్వాములు(నివాసస్థలం) నిర్మాణంకోసం ఉప్పల చారిటబుల్‌ట్రస్టుచైర్మన్, రాష్ట్రమిషన్‌భగీరథ మాజీవైస్‌చైర్మన్, బిఆర్ఎస్‌పార్టీ రాష్ట్రనాయకులు ఉప్పల వెంకటేష్ శుక్రవారం స్వాములకు సిమెంటు అందజేశారు. కార్యక్రమంలో దారమోని గణేష్, రవిసాగర్, రవి, రాముగౌడ్, శివ, మహేష్, వీరేష్, వినయ్ పాల్గొన్నారు.

# శ్రమ జీవుల స్వేదనాథం ఎఐటియుసి

ఎఐటియుసి రాష్ట్ర కోశాధికారి సత్యనారాయణరెడ్డి
ఎఐటియుసి 106వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా
భారీ కార్మిక ర్యాలీ సభ, ఘనంగా ఆవిర్భావ వేడుకలు

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్: కోటానుకోట్ల సంఘటిత అసంఘటిత కార్మిక వర్గం, శ్రమజీవుల స్వేదనాదం ఏఐటియుసీ అని ఏఐటియుసి రాష్ట్ర కోశాధికారి తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటియుసి) 106వ, వ్యవస్థాపక దినోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో ఏఐటియుసి శ్రేణులు ఆసుపత్రి కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ రెగ్యులర్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్మికులు ఏఐటియుసి వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఎర్ర చొక్కాలు మహిళా కార్మికులు ఎర్రచీరలు ధరించి డప్పు దరువులతో మహిళలు కోలాటం నృత్యాలతో భారీ ర్యాలీ సభతో కార్మికుల హక్కులకై ఉద్యమిద్దాం కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం అంటూ నినాదాలు చేస్తూ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని 1920లో ఏఐటియుసిని లాలా లజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్ లాంటి యోధులు స్థాపించారని స్వతంత్ర సంగ్రామంలో ఏఐటియుసి విప్లవపంథాలో ఉద్యమించి బ్రిటిష్ ముష్కరులను తరిమి కొట్టిందని అన్నారు. హక్కుల సాధన పోరాటం వల్లే సాధ్యమని డా.బి.ఆర్ అంబేద్కర్ సూచించిన రాజ్యాంగ పద్ధతిలో ఉద్యమిద్దామని, లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేసి కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని ఉద్యోగ క్రమబద్దీకరణపై మరో సంగ్రామానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కాం ట్రాక్టు



వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్, జిల్లా మెడికల్ యూనియన్ అధ్యక్షులు కోటేశ్వర్‌రెడ్డి, జిల్లా కోశాధికారి భాస్కర్, బ్రాంచ్ నేతలు, వెంకటేశ్, గోపాల్ నాయక్, బి.చెన్నయ్య, బుచ్చన్న, అంజి, దేవానంద్, మురళి, యాదయ్య, టంకర వెంకటయ్య, మన్యం, జగ్గనాయక్, నరేష్, రాఘవేందర్, నరసింహా, కృష్ణ, యుగంధర్ రెడ్డి, ప్రవీణ్, శ్రీనివాస్‌రెడ్డి, పద్మ, నాగమ్మ, లక్ష్మమ్మ, అలివేలు, వరలక్ష్మి, ఇందిరా, యాదమ్మ, సత్యమ్మ, అంజమ్మ, శైలజ, జంగమ్మ, సవిత, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో నివేదిస్తాం



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : మొంథాతుఫాన్ కారణంగా తీవ్రవర్షాలు కురవడంతో నిలిచిపోయిన విద్యుత్‌తోపాటు పలు సమస్యలపై రాష్ట్రప్రభుత్వానికి పూర్తిస్థాయిలో నివేదిక అందజేసేందుకు గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి పూర్తివివరాలు సేకరించి నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయంలు అధికారులకు సూచించారు. శుక్రవారం విద్యుత్, రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖల అధికారులతో కలిసి గ్రామాన్ని సందర్శించి నష్టనివారణ చర్యలను పరిశీలించారు. మొంథా తుఫాన్‌కారణంగా తీవ్ర వర్షాలు కురవడంతో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని నక్కలగండి రిజర్వాయర్‌పరిధిలోని మార్లపాడుతండా పూర్తిగా జలమయమైంది. సుమారు 350 కుటుంబాలు, 638మంది జనాభా ఉన్న ఈగ్రామం వరద జలాలు చుట్టుముట్టడంతో ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈనెల 28న రాత్రినుంచి 29వతేదీ మధ్యాహ్నం వరకు కురిసిన అతిభారీవర్షానికి జలదిగ్బంధంలో గ్రామం చిక్కుకొని గ్రామస్తులను సిద్దాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి అధికారులు తరలించి భోజన వసతివైద్య సదుపాయాన్ని కల్పించారు. ప్రతి ఇంటిని సందర్శించి, పంటనష్టం, గృహనష్టం, ప్రజల అవసరాలపై వివరాలు సేకరించారు. కార్యక్రమంలో జిల్లాపంచాయతీ అధికారి శ్రీరాములు, విద్యుత్, రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖల అధికారులు తహసీల్దార్ సైదులు, ఎంపిడిఓ, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




## కార్మికవర్గానికి దిక్సూచిగా ఎఐటియుసి

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : భారతదేశంలోని కార్మికవర్గానికి దిక్సూచిగా ఎఐటియూసి ఉందని ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మణచారిభవనంలో ఎఐటియూసి 106వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కుమ్మెర ఆటోస్టాండ్ దగ్గర ఎఐటియూసి జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు అండగా నిలబడేందుకు 1920 అక్టోబర్ 31న ముంబై నడిసముద్రంలో రహస్యంగా పడవలో సమావేశమై ఎఐటియూసి పేరును నామకరణం చేశారన్నారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్ జిల్లా అధ్యక్షులు చిన్నపాగశ్రీనివాసులు, బిల్డింగ్‌వర్కర్ కార్యదర్శి వెంకటస్వామి, ఎఐటియూసి జిల్లా కోశాధికారి రవీందర్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు దేశమోని ఆంజనేయులు, సిపిఐటౌన్ సహాయ కార్యదర్శి కొత్తరామస్వామి, సిపిఐపార్టీ నాయకులు సత్యం, ఆటోయూనియన్ నాయకులు బాలస్వామి, విష్ణు, సత్యం, కాశన్న, భూపతి, కుర్మయ్య, చెన్నయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మాసన్న డిమాండ్

ప్రజాపక్షం/వనపర్తి టౌన్ : కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం తెచ్చిన లేబర్ కోడులను రద్దు చేయాలని ఏఐటియూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాసన్న డిమాండ్ చేశారు. వనపర్తి స్నేహ పూట్పాత్ వర్కర్స్ కేంద్రం ఏఐటీయూసీ 106 ఆవిర్భావ దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ అరుణ పతకాన్ని మాసన్న ఆవిష్కరించి మాట్లాడుతూ.. గతంలో కార్మికులు రోజుకు 16 గంటల నుంచి 18 గంటలు పని చేసేవారన్నారు. ఏఐటీయూసీ పోరాటం ఫలితంగా పని దినం ఎనిమిది గంటలకు తగ్గించారన్నారు. లేబర్ కోడ్ల అమలులో భాగంగా కార్మికులు సంఘం పెట్టుకునే హక్కు, సమ్మెహక్కును హరించే కుట్ర చేస్తున్నారని, పని దినం 12 గంటలకు పెంచుతున్నారన్నారు. కనీస వేతనం రూ.26, 000 ఇవ్వాలని పోరాడుతున్న చలనం లేదన్నారు. స్వాతంత్రానికి ముందే ఏర్పడిన ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీ అని, కార్మికుల పక్షాన 106 ఏళ్ళగా పోరాడుతూ వస్తుందని ఇంత ఘన చరిత్ర మరే యూనియన్‌కు లేదన్నారు. కార్మిక సమస్యలపై ఏఐటీయూసీ పోరాడని అంశం లేదన్నారు. లేబర్ కోడులకు వ్యతిరేకంగా పోరడాల్సిన అవసరం ఉందన్నారు. కనీస వేతనం కోసం ఏఐటీయూసీ లో చేరి పోరాడాలి అన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి భాస్కర్, సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పృథ్వినాదం నేతలు ఎర్రకుర్మయ్య, చిన్న కుర్మయ్య, శాంతన్న, వెంకటేష్ పాల్గొన్నారు.



# విద్యార్థి సామర్థ్యాలు సాధించే దిశగా కృషి



కలెక్టర్ సిక్తా పట్నాయక్

ప్రజాపక్షం/నారాయణపేట్/ఉట్కూర్ : విద్యార్థులు తమ సామర్థ్యాలు పెంచుకునేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శుక్రవారం ఆమె నారాయణపేట జిల్లాలోని ఉట్కూరు మండలం కేంద్రంలోని మండల ప్రాథమిక సిపిఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల వివరాలను హెచ్ఎం ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యం పెంచేందుకు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. రెండో తరగతి విద్యార్థులకు జాలిఫానిక్స్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ద్వారా ఆంగ్ల విషయంలో నైపుణ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులు సౌండ్ ఆధారంగా ఆంగ్ల పదాలను చదివారు. జిల్లాలో యంగ్ ఓలేటర్ క్లబ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పిక్చర్ రీడింగ్ ద్వారా షోకేస్ నిర్వహించారు. అనంతరం పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల అనుపస్థితి పట్ల ఆసనం వ్యక్తం చేస్తూ హాజరు శాతాన్ని పెంచే విధంగా కృషి చేయాలని హెచ్ఎంను ఆదేశించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుని పరిశీలించారు. తర్వాత పాఠశాల ఆవరణలోనే ఉన్న అంగన్వాడీ 4,12 సుంటర్ లను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారి శ్రీనివాస్, విద్యాశాఖ అధికారి మాధవి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కుసుమ, పాఠశాల హెచ్ ఎం తదితరులు పాల్గొన్నారు.

**పత్తి మిల్లును సందర్శించిన కలెక్టర్**

ఉట్కూర్ మండలం త్రిపాస్ పల్లి గ్రామ సమీపంలో గల విజయ్ కాటన్ మిల్ ను శుక్రవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా సందర్శించారు. మిల్లులో ఉన్న రైతులతో మాట్లాడి పత్తిని అమ్మడానికి ఎలా తీసుకువచ్చారని వాకబు చేయగా కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని మిల్ కు తీసుకొచ్చామని ఆ రైతు తెలిపారు. అనంతరం కలెక్టర్ మిల్లులో పత్తి తుకాలు, కంప్యూటర్ లో కొనుగోళ్ల వివరాలను పరిశీలించారు. పత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్ ను వినియోగించుకుని పత్తిని మద్దతు ధరకు విక్రయించి లాభ పడాలని ఆమె కోరారు. తహసిల్దార్ చింత రవి, ఏవో గణేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దేశ ఐక్యత-ప్రజా శక్తికి ప్రతీకగా రన్ ఫర్ యూనిటీ

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

ప్రజాపక్షం/వనపర్తి : దేశ సమగ్రత, ఐక్యత కోసం ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. యువతలో జాతీయతా స్ఫూర్తి మరింత పెరిగి దేశ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని జిల్లా కలెక్టర్, ఎస్పీ అన్నారు. జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని, వనపర్తి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుండి అంబేద్కర్ చౌరస్తా, రాజీవ్ చౌరస్తా బస్సు డిపో, ఆర్డిఓ ఆఫీస్ నుంచి పాలిటెక్నిక్ కళాశాల మైదానం వరకు రన్ ఫర్ యూనిటీ 2కె రన్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు ఐక్యత జెండాను ఊపి రన్‌ను ప్రారంభించారు. వనపర్తి పట్టణంలో ప్రారంభమైన ఈ పరుగు కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, యువత, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ రోజు మనం కేవలం పరుగెత్తడం కాదు మన దేశ ఐక్యత, సమగ్రత, స్ఫూర్తికి సంకేతంగా పరుగెత్తుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఐక్యత అంటే మనమంతా ఒక కుటుంబం అన్న భావనతో ముందుకు సాగడమే యువత ఒక లక్ష్యం, ఒక దిశ, ఒక దేశం కోసం పరుగెత్తాలని యువతకు స్ఫూర్తి కావాలని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్, యాదయ్య, వివిధ కళాశాల, పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, యువకులు, క్రీడాకారులు, పెద్దలు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## దేశ ఐక్యతకు ప్రతీకగా రన్ ఫర్ యూనిటీ




ప్రజాపక్షం/ కృష్ణ : నారాయణపేట జిల్లా కృష్ణ మండల కేంద్రంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి సందర్భంగా 'రాష్ట్రీయ ఏక్తా దివస్'ను పురస్కరించుకుని, శుక్రవారం రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని హిందూపూర్ గ్రామం నుంచి మండల కేంద్రం వరకు 2 కే రన్ ను కృష్ణ ఎస్సై నవీద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నవీద్ మాట్లాడుతూ భారతదేశంలో విడివిడిగా ఉన్న సుమారు 560 సంస్థానాలను ఏకీకృతం చేసి ఒక దృఢమైన దేశంగా నిర్మించడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి మరువలేనిదని ఆయన సేవలను గుర్తు చేస్తూ ప్రతి సంవత్సరం ఆయన జయంతి ని జాతీయ ఐక్యమాత్య దినోత్సవం జరుపుకుంటున్నమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, పోలీస్ సిబ్బంది, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## పౌరుల ఐక్యమత్యం కోసమే రన్‌ఫర్ యూనిటీ :కలెక్టర్, ఎస్‌పి




ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా: ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి పురస్కరించుకుని జాతీయ ఐక్యత దినోత్సవం, పోలీసు అమరవీరుల వారోత్సవాలు ముగింపు సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ డాక్టర్ వినీత్, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, అదనపు ఎస్పీ యండి, రియాజ్ హుల్ హక్, డిఎస్పి నల్లపు లింగయ్యలు పూలమాల ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా నుండి సత్యనారాయణ చౌరస్తా, ఓల్డ్ బస్టాండు, మెయిన్ చౌక్ నుండి ఎస్పీ కార్యాలయం వరకు పౌరులు, యువత, విద్యార్థులతో కలిసి ఘనంగా రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ డాక్టర్ వినీత్ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, అదనపు ఎస్పీ యం.డి.రియాజ్ హుల్ హక్, డీఎస్పీ నల్లపు లింగయ్య, సిఐ శివశంకర్, ఆర్ఐ నరసింహా, ఎస్ఐలు వెంకటేశ్వర్లు రాముడు, రాజు, నరేష్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.

## మలుపుల వద్ద సూచిక బోర్డులు పెట్టాలి

ప్రజాపక్షం/దామరగిద్ద : దామరగిద్ద మండలంలోని గ్రామం కాన్ కుర్తి నుంచి దామరగిద్ద మీదుగా నారాయణపేట కు వెళ్లే ప్రధాన రహదారి పై భారీ మూల మలుపులు ఉన్నాయి. రోడ్డు పనులు పూర్తయినా, సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. అధికారులు తక్షణమే సూచిత బోర్డులు ఏర్పాటు చేయలని ప్రయాణికులు కోరుతున్నారు.

## పాఠశాల సిబ్బంది నిజాయితీకి మన్ననలు



పుస్తెలతాడు అప్పగింత

ప్రజాపక్షం/వీపనగండ్ల : వీపనగండ్లలోని ఓ ప్రైవేట్ పాఠశాల సిబ్బంది నిజాయితీకి నిలువుటద్దంగా నిలిచే ఘటన చోటుచేసుకుంది. చిన్నంబావి మండలంలోని అమ్మాయిపల్లి గ్రామానికి చెందిన గిరిజ రామచంద్రారెడ్డి దంపతుల కుమార్తె రేవతి, వీపనగండ్లలోని డఫోడీల్స్ పాఠశాలలో యూకేజిలో చదువుతోంది. రెండు రోజుల క్రితం రేవతి తల్లి గిరిజ మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడు తెగిపోవడంతో, అందులోని ఒక భాగాన్ని చిన్నారి ఆడుకునే క్రమంలో పాఠశాలకి తీసుకువచ్చి అక్కడే జారవిడిచింది. ఇంటికి వెళ్లిన తర్వాత గొలుసు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు తీవ్రంగా వెతికినా దొరకలేదు ఇదే సమయంలో, పాఠశాల పరిసరాల్లో సిబ్బంది, విద్యార్థులు ఆ గొలుసును చూసినా అది మామూలు గొలుసేనని భావించి వదిలేశారు. అయితే, పాఠశాల ప్రిన్సిపాల్ బత్తుల రాముడు శుక్రవారం ఆ గొలుసును బ్యాంకుకు తీసుకెళ్లి తనిఖీ చేయగా, అది నిజమైన బంగారం అని నిర్ధారించబడింది. వెంటనే ఆయన పాఠశాల తల్లిదండ్రుల వాట్సాప్ గ్రూపులో ఈ విషయాన్ని షేర్ చేశారు. దీంతో గత రెండు రోజులుగా గొలుసు కోసం వెతికినా రేవతి తల్లి గిరిజ పాఠశాలకు వచ్చి తన వద్ద మిగిలిన గొలుసు భాగాన్ని చూపించగా, ప్రిన్సిపాల్ రాముడు ఆమెకు పోయిన గొలుసు ను అప్పగించారు. ఈ సంఘటన పాఠశాల సిబ్బందిలోని నిజాయితీని, బాధ్యతాయుతమైన ధోరణిని ప్రతిబింబిస్తోందని తల్లిదండ్రులు ప్రశంసించారు. రేవతి తల్లి గిరిజ ప్రిన్సిపాల్ రాముడు, ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.



# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## శత వసంతాల ముగింపు సభను జయప్రదం చేయాలి : బెజవాడ పిలుపు



ప్రజాపక్షం/చింతలపాలెం (మేళ్ళచెర్వు) : ఖమ్మంలో డిసెంబర్ 26న నిర్వహించే సిపిఐ శత వసంతాల ముగింపు సభకు పార్టీశ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షులు బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో బహిరంగ సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న సిపిఐ భారత గడ్డపై పుట్టి వందేండ్లు అవుతుందన్నారు. ఈ ముగింపు మహాసభకు తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణాది రాష్ట్రాలు, 40 దేశాల నుండి కమ్యూనిస్టు ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉస్తెల నారాయణ రెడ్డి, మండల కార్యదర్శి గొంగరెడ్డి భద్రారెడ్డి, యలమందయ్య పాల్గొన్నారు.

## ఎస్ఐ వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య



ప్రజాపక్షం/తుంగతుర్తి : తుంగతుర్తి ఎస్ఐ క్రాంతికుమార్ వేధింపులు తాళలేక ఓ మహిళ మృతి చెందిన సంఘటన సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెంపటి గ్రామంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. మృతురాలి కుమార్తెలు సరిత, అనిత, కుమారుడు మహేష్‌లు తెలిపిన వివరాల ప్రకారం గత 15 రోజుల క్రితం తుంగతుర్తి మండలం వెంపటి గ్రామానికి చెందిన సోమనర్సమ్మ (50) బావ మల్లయ్య ఇంట్లో బంగారం పోయిందనే నెపంతో సోమ నర్సమ్మపై తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో వెంపటి గ్రామానికి చెందిన కొంతమంది పెద్దమనుషులు, మల్లయ్య కలిసి పోలీస్ స్టేషన్‌కి వెళ్లి పలుమార్లు ఫిర్యాదు చేయగా, గురువారం రాత్రి 8 గంటల వరకు తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌లో సోమనర్సమ్మను ఉంచారు. తుంగతుర్తి ఎస్ఐ క్రాంతి కుమార్ కనీసం మహిళ అని కూడా చూడకుండా, వేధింపులకు గురిచేసి, నిన్ను జైలుకు పంపుతాం, నీవే దొంగతనం చేసినట్లు ఒప్పుకోవాలని నీ ఫింగర్ ప్రింట్స్ ఉన్నాయని కుటుంబ సభ్యులను బెదిరింపులకు గురిచేశారన్నారు. దీంతో ఆవేదనకు గురైన సోమనర్సమ్మ రాత్రికి రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. జరిగిన సంఘటనపై ఎస్ఐని వివరణ అడగగా సమాధానం చెప్పకుండా దాటవేశారు. సోమనర్సమ్మ మృతిపై పూర్తిస్థాయి నిర్లక్ష్యం వహించిన ఎస్ఐ క్రాంతి కుమార్‌పై పోలీస్ ఉన్నత అధికారులు, జిల్లా పోలీస్ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## 17శాతం తేమ రాగానే కాంటాలు

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ప్రజాపక్షం/చివ్వెంల : కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు వెంటనే తరలించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆయా ధాన్యపు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని ఐలాపురం, సూర్య తండలలో ఏర్పాటు చేసిన ఐకెపి కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ కారణంగా తడిచిన ధాన్యాన్ని రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రస్తుతం వర్షాలు ఆగినందున దానిని ఆరబెట్టుకొని అమ్మకానికి తేవాలన్నారు. 17 తేమ శాతం రాగానే నిర్వాహకులు కాంటాలు వేయాలని సూచించారు. ధాన్యం తడవకుండా టార్పాలు కప్పాలని చెప్పారు. సూర్య తండలోని ఐకెపి కేంద్రంలో ధాన్యం కొనుగోలు రిజిష్టర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఓ సంతోష్‌కుమార్, ఎంపిఓ వెంకయ్య, మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మద్యంపై ఉన్న శ్రద్ధ విద్యారంగంపై లేదు



ప్రజాపక్షం/చింతపల్లి: పెండింగ్‌లో ఉన్న ఫీజ్ రియబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించకుండా మద్యంపై అమితాసక్తిని చూపడం సిగ్గుచేటని అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నల్లగొండ జిల్లా అధ్యక్షుడు వల్లమల్ల ఆంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 22నెలల కాంగ్రెస్ పాలనలో విద్యాశాఖకు మంత్రిని కేటాయించకుండా, ప్రజల ఆరోగ్యానికి హానికరమైన మద్యానికి మంత్రిని కేటాయించడం సిగ్గుచేటని ఎద్దేవ చేశారు. విద్యారంగానికి మంత్రి లేకపోవడం వల్ల విద్యావ్యవస్థ సమస్యలకు నిలయంగా మారి విద్యార్థులకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించకుండా విద్యాహక్కు చట్టం అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. ఫీజ్ రియబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయకపోతే ఉధృతంగా విద్యార్థి ఉద్యమాలు నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి శంశొద్దీన్, మండల అధ్యక్షులు వలవోజు శివకుమార్, మహ్మద్ అర్షద్, అరవింద్, మనోజ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళ మృతి డాక్టర్‌ను సస్పెండ్ చేయాలని సిపిఐ ధర్నా

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం ఉదయం మహిళ మృతిచెందింది. చికిత్స కోసం మహిళ రావడంతో డ్యూటీలో ఉన్న ఉన్న డాక్టర్ పట్టించుకోకపోవడంతో మహిళ మృతిచెందిందని సీపీఐ నాయకులు ఆరోపిస్తూ ఏరియా ఆసుపత్రి ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మిర్యాలగూడ మండలం ములకలకాల్వకు చెందిన నాగిళ్లి ఎంకమ్మ దగ్గు, జ్వరం, ఆయాసంతో శుక్రవారం 8గంటల సమయంలో ఆమెను కొడుకు ప్రదీప్ ఏరియా ఆసుపత్రికి తీసుకురాగా ఆ సమయంలో డ్యూటీలోఉన్న డాక్టర్ డ్యూటీ నుంచి దిగిపోయేంతవరకు ఆ ఎంకమ్మకు ట్రీట్మెంట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల ఆమెకు ఆయాసం ఎక్కువై ఊపిరాడని సమయంలో ఎంకమ్మ 9.30గంటలకు డాక్టర్ ఫాతిమా వద్దకు నడుచుకుంటూ వెళ్లిందని ఆమెను చూసి వెంటనే ఆక్సిజన్ పెట్టాలని డాక్టర్ సిబ్బందికి చెప్పినా ఎవరూ ఆక్సిజన్ పెట్టకపోవడంతో సీరియస్ కావడంతో డాక్టర్ ఫాతిమా దగ్గరకు వెళ్లి చెప్పగా ఆమె దగ్గరుండి ఆక్సిజన్ పెట్టించింది. కాగా ఆక్సిజన్ పెట్టిన 15 నిమిషాల్లోనే ఊపిరాడక చనిపోయింది. ఆమె చనిపోవడానికి ముఖ్య కారణం డాక్టర్ అని డ్యూటీలో ఉండి కూడా ఎంకమ్మను నిర్లక్ష్యం చేయడం వల్ల ఆమె చనిపోయిందన్నారు. ఎంకమ్మ చావుకు కారణమైన డాక్టర్‌ను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు లేని ప్రదీప్‌ను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, ప్రదీప్ ఉండడానికి ఇల్లు లేనందున ఇందిరమ్మ ఇల్లు సాంక్షన్ చేసి ఆదుకోవాలన్నారు. ధర్నాలో మహిళా సమాఖ్య నియోజకవర్గ అధ్యక్షురాలు దుర్గమ్మ, వెంకన్న, రాము, సోమయ్య, ఎల్లమ్మ, బుజ్జి, కవిత, ఏసు, కొండలు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



# తేమశాతం, నాణ్యత తప్పనిసరి

ధాన్యం ఆరబెట్టుకుని సిద్ధంగా ఉంటే కాంటాలు వేసి మిల్లులకు పంపిస్తాం

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/హాలియా: వర్షాలు తగ్గినందున కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని ఆరబెట్టుకుని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు .రైతులు వారి ధాన్యాన్ని ఆరబెట్టుకుని సిద్ధంగా ఉన్నట్లయితే కాంటాలు వేసి మిల్లులు పంపిస్తామని చెప్పారు. శుక్రవారం ఆమె మండలంలోని రామడుగు లో ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం కుప్పలను పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం వర్షం తగ్గినందున ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని, 17 తేమ వచ్చిన వెంటనే కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రెండు, మూడు రోజుల తర్వాత తిరిగి వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున త్వరితగతిన ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సైతం సరైన తేమశాతం, నాణ్యత ప్రమాణాలతో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి ఎప్పటికప్పుడు మిల్లులకు పంపించాలని, కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని చెప్పారు.జిల్లా కలెక్టర్ వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ,డిఆర్‌డిఓ వై శేఖర్ రెడ్డి ఉన్నారు.

**సబ్జెక్టు విషయాలపై ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలి : కలెక్టర్**

బాగా చదువుకోవడం ద్వారా సమాజంలో ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి విద్యార్థినిలకు సూచించారు. ఇందుకుగాను రెగ్యులర్ గా పాఠశాలకు హాజరు కావాలని అన్నారు.శుక్రవారం ఆమె మండలంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల హాజరు రిజిస్టర్ ను, అదేవిధంగా ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ ను పరిశీలించారు.ఫేస్ రికగ్నిషన్ ఆప్ (ఎఫ్ ఆర్ ఎస్) ద్వారా ఆన్లైన్లో అటెండెన్స్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ రెగ్యులర్‌గా పాఠశాలకు హాజరవుతూ సబ్జెక్టు విషయాల పట్ల ఎప్పటికప్పుడు అప్డేట్‌గా ఉండాలన్నారు. పాఠశాల నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పారిశుద్ధం ,విద్యార్థినిల ఆరోగ్యం, భోజనం, తదితర అంశాల పట్ల ఏలాంటి సమస్యలు రాకుండా చూడాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు . జిల్లా కలెక్టర్ వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ,జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, కేజీబీవీ ప్రిన్సిపల్ కవిత, తదితరులు ఉన్నారు.

# రైతులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలి

వరి పంటకు రూ. 30,000, పత్తి పంటకు 50,000 నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ డిమాండ్



ప్రజాపక్షం/భువనగిరిరూరల్: అక్టోబర్ 28 29 తేదీలలో రాష్ట్ర స్థాయిలో కురిసిన అకాల వర్షాలకు యాదాద్రి భువనగిరి జిల్లాలో పలు మండలాలలో తీవ్రంగా పంట నష్టం జరిగింది క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు రెవెన్యూ అధికారులు నష్టపరిహారాన్ని అంచనా వేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలి, నష్టపోయిన రైతులకు వరి పంటకు ఎకరానికి 30000 పత్తి పంటకు ఎకరానికి 50,000 నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో దామోదర్ రెడ్డి మాట్లాడారు. అట్లాగే ఐకెపి సెంటర్లలో పిఎసిఎస్‌లో మార్కెట్ యార్డుల్లో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. సిసిఐ ద్వారా ఎలాంటి షరతులు లేకుండా పత్తి కొనుగోలు వరి కొనుగోలును వెంటనే కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అట్లాగే నష్టపోయిన రైతులు సంబంధిత అధికారులకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి ఇమ్రాన్ భువనగిరి పట్టణ సిపిఐ కార్యదర్శి పుట్ట రమేష్, నాయకులు శోభన్ బాబు, వసంత, ముంతాజ్, బీరకాయల గణేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

### ప్రభుత్వం రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలి

ప్రజాపక్షం/డిండి; మొంథా తుఫాను కారణంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు డిండి మండలంలోని పంటలు నష్టపోయిన రైతాంగానికి పంట నష్టపరిహారాన్ని ప్రభుత్వం అందజేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యవర్గ సభ్యులు తూము బుచ్చిరెడ్డి, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మైనోద్దీన్, సిపిఐ మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారిలు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ మొంథా తుఫాను కారణంగా మండలంలో పత్తి, వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని నష్టపరిహారాన్ని అధికారులు అంచనా వేసి, నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోనేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపాలని అధికారులను కోరారు.

## పెండింగ్ కేసుల దర్యాప్తులపై పురోగతి

ప్రజాపక్షం/గరిడేపల్లి : సూర్యాపేట జిల్లాలోని గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలలో భాగంగా జిల్లా ఎస్‌పి కె నరసింహ శుక్రవారం సందర్శించారు. ముందుగా పోలీసులు ఇచ్చిన గౌరవ వందనం స్వీకరించిన ఆయన సిబ్బందితో సమావేశమై విధుల నిర్వహణ, పెండింగ్ కేసులు, ధర్యాప్తు పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ పరిధిలోని నేర చరిత్ర, తరచుగా జరిగే నేరాల రకాలు, సమస్యలు, పరిష్కారాలపై ఎస్ఐ చలికంటి నరేష్ నుండి సమాచారం సేకరించారు. స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ బాధితుల పట్ల గౌరవంగా వ్యవహరించడం ప్రతి పోలీస్ సిబ్బంది బాధ్యత అన్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా సిబ్బంది చురుకుగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా రిసెప్షన్, కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఐ చరమందరాజు, ఎస్ఐ చలికంటి నరేష్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం





ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలో చిల్లాపూర్, జనగాం గ్రామాలలో ఎఐటియుసి జెండా ఆవిష్కరించారు. అనంతరం మండల కేంద్రంలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ( ఎఐటియుసి) 106 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎఐటియుసి మండల ప్రధాన కార్యదర్శి చిలువేరు అంజయ్య జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు దుబ్బాక సంజీవ, ఉపాధ్యక్షుడు శంకరయ్య, మంచాల గాలయ్య,ట్రాక్టర్ డ్రైవర్ సంఘం నాయకుడు గిరి, ఆటో యూనియన్ సంఘం నాయకుడు జనగాం అంజయ్య, వీరయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి పల్లె మల్లారెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపక్షం/ఆలేరు : శుక్రవారం రోజున సివిల్ సప్లై ఏఐటియుసి వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆలేరు లో జెండా ఎగరేడవేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ మాట్లాడుతూ 1920 లో ఏర్పడిన ఏఐటియుసి కార్మిక సంఘం ఇప్పటికి 106 సంవత్సరాలు పూర్తి అయ్యింది. ఈ కార్యక్రమంలో కొరుటూరు శీను, పల్లె వెంకటయ్య, ఉప్పలయ్య, బీరయ్య, జాంగిర్, చంద్రయ్య, వెంకటేష్, కుమార్, పల్లె వెంకటయ్య, చంద్రయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.




ప్రజాపక్షం/చండూరు : అసంఘటిత కార్మికులకు సమగ్ర సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకోవాలని ఏఐటియూసి చండూరు మండల అధ్యక్షుడు దోటి వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో భూతరాజు శ్రీను, కావలి శ్రీను, కుక్కల నాగార్జున, మోగుదాల శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కులు కాలరాస్తున్న మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం



### ఎఐటియుసి జెండా ఆవిష్కరణలో వక్తల పిలుపు

ప్రజాపక్షం/యాదగిరిగుట్ట: కార్మికుల హక్కులను కాలరాస్తున్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుదాం అని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోద శ్రీరాములు అన్నారు.అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం రోజున యాదగిరిగుట్ట పట్టణంలో ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గోద శ్రీరాములు పాల్గొని ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం ఉద్యమించి కార్మికులకు అనేక చట్టాలు తీసుకువచ్చి,కార్మికులకు అండగా నిలిచిన జెండా ఏఐటియుసి అని అన్నారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం సుదీర్ఘ పోరాటాలు చేసి సాధించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్మిక చట్టాలను హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తుందని, ప్రభుత్వ రంగ సమస్యలను నిర్వీర్యం చేసి ప్రైవేట్ పరం చేసే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జై హనుమాన్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అనాధాశ్రమంలో పండ్ల పంపిణీ చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ,పేరబోయిన మహేందర్, సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్.మున్సిపల్ శాఖ కార్యదర్శి బబ్బురి శ్రీధర్, మాజీ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య ఎఐటియుసి మండల కార్యదర్శి గోపగాని రాజు పాల్గొన్నారు.



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాల సవరణను వెంటనే ఆపి నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద ఏఐటీయూసీ జెండాను కార్మికులతో కలిసి ఎగురవేశారు. అనంతరం రామస్వామి మాట్లాడుతూ 106 సంవత్సరాల సుధీర్ఘ పోరాట చరిత్ర కలిగిన ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీ అని అన్నారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జూలూరి వెంకటరాములు, ఏఐటీయూసీ నాయకులు మల్లయ్య, మండల కార్యదర్శి వెంకటయ్య, కల్లు చరణ్‌రెడ్డి, సోమ్లనాయక్, బాలు, లచ్చయ్య పాల్గొన్నారు.



ప్రజాపక్షం/డిండి: ఏఐటీయూసీ 106 ఏళ్ల ఆవిర్భావ వేడుకలు డిండిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ జెండాను జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను తుంగలో తొక్కి కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు లింగమయ్య, జవహర్‌లాల్, దేవయ్య, రమేష్, కృష్ణయ్య, ఇద్దమ్మ, కళ్యాణ్, లక్ష్మమ్మ, బాలమ్మ, భాగ్యమ్మ, భారతి, సుజాత, సునిత, లక్ష్మమ్మ, తిరుపతమ్మ పాల్గొన్నారు.



ప్రజాపక్షం/దేవరకొండ: ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పల్లా పర్వత్‌రెడ్డి భవన్ దేవరకొండలో ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి మాట్లాడుతూ ప్రతి కార్మికునికి ఈఎస్ఐ, పిఎఫ్ ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జూలూరి వెంకట్రాములు, జిల్లా కౌన్సిల్ సభ్యులు నీల వెంకటయ్య, మండల కార్యదర్శి మల్లయ్య, బుచ్చయ్య, కృష్ణయ్య, రామేశ్వరయ్య, వెంకటయ్య, అయోధ్య, వెంకటమ్మ, దేవరాజ్, లక్ష్మ , జంగయ్య, అలివేలు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : కార్మికులకు అండ ఏఐటియుసి జెండా అని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్ ఎదుట ఏఐటి



యుసి 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధనే లక్ష్యమని ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు దంతాల రాంబాబు, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఏఐటియుసి ప్రాంతీయ గౌరవ సలహాదారులు చామల అశోక్ కుమార్, టైలరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు దీకొండ శ్రీనివాస్, నాయకులు ఎండి పాషా, దేశగాని హేమలత పాల్గొన్నారు.

ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : ఏఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం పట్టణంలోని ఏఐటియుసి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షులు జడల శ్రీనివాస్ ఏఐటియుసి జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గుండు వెంకటేశ్వర్లు, ఏఐటియుసి నాయకులు ఇందిరాల వెంకటేశ్వర్లు, మామిడాల వెంకటయ్య, జట్టి ప్రసాద్, ముడుసు పాపారావు, దగ్గుపాటి సత్యానందం, రాంమ్మూర్తి, గోపి, జక్కుల మల్లయ్య పాల్గొన్నారు.

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: కార్పోరేట్ శక్తులకు పాలక ప్రభుత్వాలు దాసోహమై కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.సయిాద్‌లు అన్నారు. ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకోని శుక్రవారం సయిాద్ జెండాను ఆవిష్కరించగా వారు మాట్లాడుతూ వెట్టిచాకిరి విముక్తి, కార్మికుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేసిన ఘనత ఏఐటీయూసీదేనన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి ధీరావత్ లింగానాయక్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వల్లంపట్ల వెంకన్న, యూనియన్ నాయకులు ఖయ్యూం, అఫ్సర్‌అలీ, పి.వెంకన్న, రసూల్, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.



# రీల్

## 'కురిసే వాన' పాట ఆవిష్కరణ



నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్'. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఎమోషనల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహిస్తున్నారు. సరికొత్త ప్రేమ కథగా తెరకెక్కుతున్న ఈ సినిమా నవంబర్ 7న హిందీతో పాటు తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ సినిమా నుంచి 'కురిసే వాన..' లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. ఈ పాటకు రాకేందు మౌళి సాహిత్యాన్ని అందించగా కపిల్ కపిలన్ పాడారు. హేషమ్ అబ్దుల్ వాహబ్ ఛాట్ బస్టర్ ట్యూన్ కంపోజ్ చేశారు. 'కురిసే వాన తడిపేయాలన్న భూమే ఏదో, సరదా పడుతూ పురి విప్పేస్తున్న నెమలే ఏదో, ఓ నీలి మేఘం, పెంచింది వేగం, ఆ జాబిలమ్మ చెంత చేరి వంతపాడి, కమ్మితే మైకం, లాయి లాయి లాయిలే..' అంటూ వినగానే ఆకట్టుకునేలా సాగుతుందీ పాట. మెమొరబుల్ లవ్ సాంగ్‌గా 'కురిసే వాన..' లవర్స్‌తో పాటు మ్యూజిక్ లవర్స్‌కు గుర్తుండిపోనుంది. ఈ సినిమాకు సినిమాటోగ్రఫీ కృష్ణన్ వసంత్, సంగీతం హేషమ్ అబ్దుల్ వాహబ్, కాస్ట్యూమ్స్ శ్రావ్య వర్మ, సమర్పణ అల్లు అరవింద్, నిర్మాతలు ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి, రచన దర్శకత్వం రాహుల్ రవీంద్రన్.

## రేజ్ ఆఫ్ కాంత రిలీజ్



వెర్సటైల్ స్టార్ దుల్కర్ సల్మాన్ బైలింగ్వల్ పీరియాడికల్ డ్రామా 'కాంత' నవంబర్ 14న రిలీజ్ కానుంది. 1950 మద్రాస్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందుతున్న ఈ చిత్రానికి సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుండగా సముద్రఖని కీలక పాత్రలో నటిస్తున్నారు. చిత్రాన్ని దుల్కర్ సల్మాన్ వేఫేరర్ ఫిలమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ తో కలిసి సంయుక్తగా నిర్మిస్తున్నారు. టీజర్, సాంగ్స్‌తో ఇంపాక్ట్ క్రియేట్ చేసిన తర్వాత, మేకర్స్ ఇప్పుడు రాప్ ఆంథమ్ రేజ్ ఆఫ్ కాంత రిలీజ్ చేశారు. ఝాను చాంతర్ స్వరపరిచిన ఈ సాంగ్ అదిరిపోయింది. వింటేజ్ ఎలిమెంట్స్‌ను ఆధునిక రాప్ బీట్స్, పవర్ఫుల్ గిటార్ సౌండ్స్‌తో మేళవిస్తూ రూపొందించిన ఈ ట్రాక్ కాంత సినిమా నుండి ఎలాంటి ఎనర్జీ, ఇంటెన్సిటీని ఆశించవచ్చో చెప్పేస్తోంది.ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ డానీ సాంచెజ్ లోపెజ్, ఆర్ట్ డైరెక్షన్‌ను థా.రామలింగం. అదనపు స్క్రీన్‌ప్లేను తమిళ్ ప్రభ ఇచ్చారు. లెవెలిన్ ఆంథోనీ గోన్సాల్వెస్ ఎడిటర్.



## 'మహాకాళి' ఫస్ట్ లుక్

హనుమాన్ సినిమాప్రశాంత్ వర్మ ఆర్‌కెడి స్టూడియోస్‌తో కలిసి కొత్త చిత్రం మహాకాళి రూపొందిస్తున్నారు. ఈ సినిమా నుంచి భూమి శెట్టి ఫస్ట్ లోక్‌ను విడుదల చేశారు. ఈ సినిమా ఇప్పటికే సగం పైగా షూట్ పూర్తిచేసుకుంది. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్స్‌పై ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది. నటీమణులు సూపర్ హీరో పాత్రను పోషించడానికి ఆసక్తిని వ్యక్తం చేసినప్పటికీ, కథ సారాన్ని నిజంగా ప్రతిబింబించగల కొత్త ముఖం కావాలనే నిశ్చయంతో ఆ పాత్రకు సరిపడే డార్క్ స్కిన్ టోన్ అన్నిరకాలుగా పర్ఫెక్ట్‌గా సూట్ అయ్యే భూమి శెట్టిని ఎంపిక చేశారు. మహాకాళి ఇంటెన్స్, డివైన్ ఫస్ట్ ఫస్ట్ లుక్ ఇన్‌స్టంట్‌గా హిట్ అయ్యింది. ఫస్ట్ లుక్‌లో భూమి శెట్టి ఎరుపు, బంగారు వర్ణంలో ఆగ్రహం, కరుణ రెండింటినీ ప్రతిబింబించే దివ్యమైన ఆరాతో మెరిసింది. సాంప్రదాయ ఆభరణాలు, పవిత్ర చిహ్నాలతో అలంకరించబడిన ఆమె చూపు, సృష్టిప్రళయం, విధ్వంసపునర్జన్మ శక్తిని సూచిస్తోంది.ఈ పోస్టర్తో మహాకాళి చిత్రం ప్రశాంత్ వర్మ సినీమాటిక్ యూనివర్స్లోని అద్భుత అధ్యాయమని స్పష్టమవుతోంది. ఈ కథ హనుమాన్తో అనుసంధానమై ఉన్నదనే సంకేతాన్ని ఇస్తోంది. భారతీయ పౌరాణిక సూపర్ హీరో యూనివర్స్కి ఇది మరో మెట్టు అవుతుందనే ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది.ఆర్‌కెడి దుగ్గల్, రివాజ్ రమేష్ దుగ్గల్ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రశాంత్ వర్మ కాన్సెప్ట్, పూజ కొల్లూరు దర్శకత్వం కలిసి గ్రేట్ విజువల్ వండర్ను అందించబోతున్నాయి.

## 'పీటర్' టీజర్ విడుదల



వృద్ధి స్టూడియోస్ పతాకంపై రవి హిరేమత్, రాకేష్ హెగ్డే నిర్మాతలుగా సుకేష్ శెట్టి రచించి దర్శకత్వం వహించిన చిత్రం 'పీటర్'. రాజేష్ ధ్రువ ప్రధాన పాత్రలో నటించగా, జాన్వి రాయల, రవిక్ష శెట్టి ముఖ్యమైన పాత్రల్లో నటించారు. ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. జెస్సీ మళ్లీ వచ్చింది.. డెవిడ్‌ను ఇక్కడకు తీసుకురా.. చెండే వాయిద్యం అంటే మాకు దైవంతో సమానం.. ఎవరైనా అవమానిస్తే ఊరుకోను' అంటూ సాగిన టీజర్ ఉత్కంఠను రేకెత్తించేలా సాగింది. 'పీటర్' టీజర్ను గమనిస్తే కేరళ సంప్రదాయం, కేరళ అందాల్ని అద్భుతంగా చూపించినట్టు కనిపిస్తోంది. టీజర్ కట్ చేసిన విధానం చూస్తుంటే.. సస్పెన్స్, థ్రిల్లర్ జానర్లో మరో అద్భుతమైన చిత్రం రానున్నట్టుగా అనిపిస్తోంది. ఈ టీజర్లో చూపించిన విజువల్స్, భయపెట్టేలా చూపించిన కెమెరా యాంగిల్స్, వెంటాడే నేపథ్య సంగీతం అన్నీ కూడా హైలెట్ అయ్యేలా కనిపిస్తోంది. పీటర్ కథ ఏంటి? జెస్సీ ఎవరు? అనే ఆసక్తికరమైన అంశాలకు త్వరలోనే సమాధానం రానుంది.రాజేష్ ధ్రువ సినిమాలో ఇంటెన్స్ పర్ఫామెన్స్‌తో, అన్ని రకాల ఎమోషన్ను పలికించబోతోన్నాడని అర్థం అవుతోంది. సినిమాటోగ్రాఫర్ గురుప్రసాద్ నార్నాడ్ విజువల్స్ ఎంతో సహజంగా కనిపిస్తుండగా.. రిత్విక్ మురళీధర్ సంగీతం భయాన్ని, భావోద్వేగాన్ని పెంచేలా ఉంది. ఎడిటర్ నవీన్ శెట్టి కట్స్ మరింత ఇంట్రెస్టింగ్గా అనిపిస్తోంది.'పీటర్' త్వరలోనే రిలీజ్ కానుంది. రాజేష్ ధృవ, జాన్వీ రాయల, రవిక్షా శెట్టి, రామ్ నాదగౌడ్, వరుణ్ పటేల్, ప్రతిమా నాయక్, రఘు పాండేశ్వర్, రాధాకృష్ణ కుంబ్లే, దీనా పూజారి, సిద్ధు, భరత్, మను కాసర్గోడ్, రక్షిత్ దొడ్డెర తదితరులు నటించారు.

### అఖండ 2: కోసం ఓకల్స్ అందిస్తున్న

## సర్వేపల్లి సిస్టర్స్



నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న 'అఖండ 2: తాండవం'. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన అఖండ సీక్వెల్ గా వస్తున్న సినిమా ఇది. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఎం తేజస్విని నందమూరి సగర్వంగా చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలై 'అఖండ 2: తాండవం' ప్రమోషనల్ కంటెంట్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. లేటెస్ట్ గా వచ్చిన బ్లాస్టింగ్ రోర్ గ్లింప్స్ పాన్ ఇండియా వైడ్ గా సెన్సేషన్ క్రియేట్ చేసింది.ఈ సినిమా బ్యాగ్రౌండ్ స్కోర్ ని నెక్స్ట్ లెవల్ లో సెన్సేషనల్ కంపోజర్ తమన్. సంస్కృత శ్లోకాలను అద్భుతంగా పఠించే నైపుణ్యం వున్న పండిట్ శ్రవణ్ మిశ్రా, పండిట్ అతుల్ మిశ్రా సోదరులతో ఇప్పటికే గూస్బంప్స్ స్కోర్ ని రికార్డ్ చేశారు.ఇప్పుడు సర్వేపల్లి సిస్టర్స్ ని పరిచయం చేస్తున్నారు. సర్వేపల్లి సిస్టర్స్ 'అఖండ 2: తాండవం' కోసం తమ డివైన్ వోకల్స్ అందించారు. థమన్ అందిస్తున్న బ్యాక్గ్రౌండ్పవర్ ఫుల్ స్కోర్లో సర్వేపల్లి సిస్టర్స్ ఎనర్జిటిక్ వోకల్స్ తో నెక్స్ట్ లెవల్ స్కోర్ లోడ్ అవుతోంది. ఈ చిత్రంలో సంయుక్త ముఖ్యపాత్రలో నటిస్తున్నారు. ఆది పినిశెట్టి ఓ పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. హర్షాలి మల్హోత్రా కీలక పాత్రలో కనిపించనున్నారు.ఈ చిత్రానికి సి.రాంప్రసాద్, సంతోష్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, తమ్మిరాజు ఎడిటర్. ఎఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్.అఖండ 2: తాండవం డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



## 'బైకర్' ఫస్ట్ గ్లింప్స్

శర్వానంద్ హీరోగా నటించిన తాజా సినిమా మూవీ 'బైకర్'. మోటార్సైకిల్ రేసర్‌గా ప్రేక్షకులను అలరించడానికి సిద్ధంగా ఉన్నారు. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో యువి క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ చిత్రం నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తయ్యే దశకు చేరుకుంది. ఫస్ట్ లుక్, టైటిల్‌తో ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ ల్యాప్ గ్లింప్స్ థియేటర్లలో ప్రత్యేకంగా ప్రదర్శించబడనుంది. బాహుబలి: ది ఎపిక్, మాస్ జాతర సినిమాలకు అటాచ్‌గా ఈ గ్లింప్స్ చూపించబోతున్నారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్‌లో రెడ్ అండ్ వైట్ కలర్ కాంబినేషన్ దుస్తుల్లో శర్వా కనిపించడం స్టైలిష్గా, కాన్ఫిడెంట్గా ఉంది. అతని పొడవాటి కర్లీ హెయిర్, సన్గ్లాసెస్ రెబెల్లియస్ టచ్ ఇచ్చాయి.ఇటీవల వైరల్ అయిన షర్ట్లెస్ ఫోటోలతో శర్వా చేసిన అద్భుతమైన ఫిజికల్ ట్రాన్స్ఫర్మేషన్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. 1990 నుంచి 2000 మధ్య బ్యాక్ డ్రాప్‌లో సాగే బైకర్ రేసింగ్ యాక్షన్ తో పాటు ఎమోషనల్, మల్టీ జనరేషనల్ ఫ్యామిలీ డ్రామా. స్పీడ్, అంబిషన్, హార్ట్ఫెల్ట్ రిలేషన్షిప్స్‌తో మూడు జనరేషన్స్ ఒకే రేసింగ్ కలతో, కుటుంబ బంధాలతో సాగే అద్భుతమైన కథ. ఈ చిత్రంలో మాళవిక నాయర్ హీరోయిన్గా నటిస్తుండగా, బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకి సినిమాటోగ్రఫీ జె.యువరాజ్, మ్యూజిక్ జిబ్రాన్, అనిల్ కుమార్ పి ఎడిటర్. రాజీవన్ ప్రొడక్షన్ డిజైనర్. ఎ పన్నీర్ సెల్వం ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు, ఎన్ సందీప్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్.

# ఘనంగా ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎఐటియుసి సారథ్యంలో దేశ స్వాతంత్ర్యానికి ముందు ఆ తర్వాత కార్మికుల అవిశ్రాంత పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కాలరాస్తూ కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేస్తోందని ఎటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజు అన్నారు. ఎఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం వద్ద బాల్‌రాజ్ ఎఐటియుసి జెండాను ఎగురవేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అనుబంధ కార్మిక సంఘాలు, కార్యకర్తలకు, నాయకులకు ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర సమితి తరపున శుభాకాంక్షలు తెలిపారు. 1920 అక్టోబర్ 31న బొంబాయిలో ఆవిర్భవించిన ఎఐటియుసి అనేక పోరాటాలు, ఉద్యమాలు, దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పోరాడుతునే 1923లో ప్రమాద నష్టపరిహార చట్టం బ్రిటీష్ ప్రభుత్వ మెడలు వంచి సాధించుకోవటం జరిగిందన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడి గత 11ఏళ్ల కాలంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు, బడావ్యాపారస్తులకు, ధనవంతులకు మేలు చేసే ఉద్దేశంతో అనేక త్యాగాల ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 కార్మిక చట్టాలను సంపూర్ణంగా రద్దు చేసి, 4 కోడ్‌లు తీసుకొచ్చి కార్మికవర్గానికి ఎనలేని అన్యాయం చేస్తున్నరన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టేందుకు మరింత సమరశీల ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని ఆయన కార్మికులను కోరారు.

ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి యం.నర్సింహ్మా, రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, భవన నిర్మాణ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు మారగోని ప్రవీణ్‌కుమార్, ఎఐటియుసి హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కమతం యాదగిరి, బొడ్డుపలి కిషన్, పి.వెంకటయ్య, చెట్టుకింది శ్రీనివాస్, క్రిష్ణమూర్తి, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

## డీప్ ఫేక్‌పై అసెంబ్లీలో చట్టం : చిరంజీవి



**హైదరాబాద్, అక్టోబర్ 31 :** పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో సెలబ్రిటీలను డీప్ పేక్‌తో ఇబ్బందులకు గురి చేస్తున్న వారిని కఠినంగా శిక్షించేందుకు ప్రభుత్వం అసెంబ్లీలో ఒక చట్టం తీసుకురావలసిన అవసరం ఉందని కేంద్ర మాజీ మంత్రి, సిని నటుడు చిరంజీవి అభిప్రాయపడ్డారు. డీప్ పేక్ నివారణకోసం కొత్త చట్టాన్ని తీసుకురావడానికి పోలీసులు బలంగా కృషి చేస్తున్నారని చిరంజీవి చెప్పారు. తెలంగాణ పోలీసు శాఖా ఆధ్వర్యంలో జరిగిన రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంలో పాల్గొన్న చిరంజీవి డీప్ ఫేక్‌పై స్పందించారు. ఈ విషయాన్నీ డీజీపీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ సీరియస్‌గా తీసుకున్నారు. ఇది మనకు ఒక గొడ్డలి పెట్టు ఒక చట్టం తీసుకొచ్చే దిశగా పోలీస్ వ్యవస్థ ప్రయత్నం చేస్తున్నారు. వాళ్ళు అనుకున్నది నెరవేరుతుంది. సామాన్యులకు సైతం ఇలాంటి అవాంతరాల నుంచి రక్షణ లభిస్తుంది. మంచి జరుగుతున్నప్పుడు చేదు కూడా పుట్టుకొస్తుంది. సాంకేతిక రంగాన్ని స్వాగతించాలి కానీ ఈ క్రమంలోనే కొంత చెడు కూడా వస్తుంది. దీన్ని ఎలా ప్రక్షాళన చెయ్యాలనేది పోలీసులు కసరత్తు చేస్తున్నారు. దీనికి ప్రభుత్వం కూడా సహకరిస్తుంది. అసెంబ్లీలో చట్టాలు తీసుకొస్తారు. ఇలాంటి ఆటలు కొనసాగనివ్వకుండా చేస్తారు. నేను బలంగా నమ్ముతున్నాను అని చిరంజీవి చెప్పారు.

## 'బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్'లో చేర్చాలి

### కేంద్ర ప్రభుత్వానికి టిజెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్ కుమార్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి రిజర్వేషన్ల అంశాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని టిజెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్ కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతూ హైదరాబాద్, బషీర్‌బాగ్‌లని దేశోద్ధారక భవన్‌లో శుక్రవారం సదస్సును నిర్వహించనున్నట్టు తెలిపారు. టిజెఎస్ కార్యాలయంలో శుక్రవారం టిజెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, బిసి జన సమితి రాష్ట్ర కన్వీనర్ జశ్వంత్ కుమార్,నాయకులు హనుమంత్ రెడ్డి, రాంచందర్, దిలీప్ కుమార్‌తో కలిసి వినయ్ కుమార్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన విషయంలో కేంద్రం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్ల సదస్సను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## కార్మిక వర్గంపై మోదీ సర్కార్ కక్ష

### ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వ కార్మిక వర్గంపై కక్షకట్టిందని ఎఐటియూసి తెలంగాణ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ అన్నారు. ఎఐటియూసి 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌గోల్నాక లేబర్ అడ్డా వద్ద నరసింహ ఎఐటియూసి పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎఐటియూసి హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి అధ్యక్షత జరిగిన సభను ఉద్దేశించి నరసింహ మాట్లాడుతూ ప్రధాని మోదీ కార్మిక వ్యతరేక విధానాల వల్ల అభద్రతా ఉద్యోగాలు, సామాజిక భద్రత లేకపోవడం, దోపిడీ పని పరిస్థితులు, తక్కువ వేతనాలు, యూనియన్ల విధ్వంసంతో కార్మికుల బతుకులు ప్రమాదకరంగా మారుతున్నాయని చెప్పారు. కార్మిక వ్యతరేక బిజెపి నయా ఫాసిస్ట్ ధోరణులకు వ్యతరేకంగా కార్మిక వర్గం తీవ్రంగా ప్రతిఘటించాల్సిన అవసరముందని ఆయన పేర్కొన్నారు. ఇందుకు కార్మికులు సంఘటితంగా కార్యచరణ రూపొందించుకొని పోరాటాలకు సిద్ధం కావాలని నరసింహ పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం మాట్లాడుతూ పోరాటాలు, త్యాగాలతో 105 సంవత్సరాలు పూర్తి చేసుకున్న దేశంలో మొట్టమొదటి జాతీయ ట్రేడ్ యూనియన్ ఏఐటీయూసీ అని గుర్తు చేశారు. కమతం యాదగిరి మాట్లాడుతూ శతాబ్దానికి పైగా కార్మిక వర్గానికి అనుకూలంగా మార్పులు తీసుకురావడానికి జరిగిన అన్ని పోరాటాలలో ఎఐటియూసి ముందంజలో ఉందన్నారు. కార్మికుల హక్కుల సాధనలో ఎఐటియూసి పోరాట చరిత్ర స్ఫూర్తిదాయకమైందని, కార్మికుల ఐక్యతే నిజమైన బలం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియూసి హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి. వెంకటయ్య, ఉప ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్‌ఈ, హైదరాబాద్ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు చెట్టుకింద శ్రీనివాస్, గోల్నాక అడ్డా నాయకులు కాశయ్య, గాజుల శ్రీనివాస్, లింగస్వామి. ఎస్.నాగరాజ్, రాము, వి.రవి, భూషయ్య, శీను, శైలేష్, గణేష్, కె.రవి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### బాధ్యతలు స్వీకరించిన హైదరాబాద్ ప్రెస్ క్లబ్

## నూతన పాలకమండలి

### ప్రెస్‌క్లబ్ ఫ్యామిలీ క్లబ్‌గా మార్చి తీరుతాం: కొత్త కార్యవర్గం హామీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ ప్రెస్ క్లబ్ 2025–2027 నూతన కార్యవర్గం నిరాడంబరంగా బాధ్యతలు చేపట్టింది. గత ఆదివారం జరిగిన ఎన్నికలలో ఫ్రెండ్స్ ప్యానల్ ఘన విజయం సాధించింది. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ ఆవరణలో నూతనంగా ఎన్నికైన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.విజయ్ కుమార్ రెడ్డి, రమేష్ వరికుప్పల, ఉపాధ్యక్షులుగా అరుణ అత్తలూరి, ఎ.రాజేష్, సంయుక్త కార్యదర్శులుగా చిలుకూరి హరి ప్రసాద్, బాపు రావు, కోశాధికారిగా రమేష్ వైట్ల బాధ్యతలు చేపట్టారు. కార్యవర్గ సభ్యులు ఎన్.ఉమాదేవి, మర్యాద రమాదేవి, కళ్యాణం రాజేశ్వరి, శిగ శంకర్, కస్తూరి శ్రీనివాస్, వనం నాగరాజు, శ్రీనివాస్ రెడ్డి, రచన, అశోక్ దయ్యాల, సత్యనారాయణ(సత్తిబాబు), అమిత్ భట్టు బాధ్యతలు స్వీకరించారు. ప్రెస్‌అకాడమీ మాజీ చైర్మన్ సీనియర్ పాత్రికేయులు దేవులపల్లి అమర్ సమక్షంలో పాత పాలకమండలి మినిట్స్ బుక్‌ను నూతన కార్యవర్గానికి అందజేసింది. ఎన్నికలకు రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి సహాయ కార్యదర్శి కొండ శ్రీనివాసులు నూతనంగా ఎన్నికైన పాలకమండలి సభ్యులకు ధృవీకరణ పత్రాలను ప్రధానం చేశారు. తెలుగు రాష్ట్రాలలో ప్రతిష్టాత్మక క్లబ్‌గా పేరున్న హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌ను మరింత అభివృద్ధి చేయడంతో పాటు క్లబ్ సభ్యుల సంక్షేమం కోసం పని చేయాలని నూతన పాలకమండలికి సీనియర్ పాత్రికేయులు సూచించారు. తమపై ఎంత విశ్వాసంతో ఓటు వేసి గెలిపించిన సభ్యుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తామని నూతన పాలకమండలి ప్రకటించింది. ఎన్నికల వరకే వేర్వేరు ప్యానల్స్ అని ఎన్నికలు ఎన్నికలు ముగిశాక పోటీ చేసిన వారందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని నూతన పాలకమండలి స్పష్టం చేసింది. ప్రెస్ క్లబ్ పూర్వ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.వేణుగోపాల్ నాయుడు ఆర్.రవికాంత్ రెడ్డిలు తమ బాధ్యతలను కొత్త కమిటీకి అప్పగించారు. ఆరు దశాబ్దాల చరిత్ర గల ప్రెస్ క్లబ్‌ను ఫ్యామిలీ క్లబ్‌గా మార్చడంతో పాటు సభ్యులకు ఇచ్చిన హామీలన్నింటిని నిలుపుకుంటామని నూతన పాలకమండలి ఈ సందర్భంగా హామీ ఇచ్చింది. నవంబర్‌లో ఫ్యామిలీ గెట్ టుగెదర్ నిర్వహించడంతో పాటు వివిధ నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని పాలకమండలి ఈ సందర్భంగా వెల్లడించింది. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షుడు కె.విరహత్ అలీ, కార్యవర్గ సభ్యులు బొమ్మగాని కిరణ్‌కుమార్, రాష్ట్ర బిసి కమిషన్ సభ్యులు సురేందర్, సీనియర్ జర్నలిస్టులు రెహమాన్, , సిజి కె మూర్తి సహా పలువురు హాజరయ్యారు.

## ఐఎఎస్ అధికారుల బదిలీ

**ప్రజాపక్షం/ హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ఎనిమిది మంది ఐఎఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సవ్యసాచి ఘోష్ నియమితులయ్యారు. ఘోష్ సంక్షేమ శాఖ ప్రత్యేక సిఎస్‌గానూ కొనసాగనున్నారు. రవాణా శాఖ కమిషనర్‌గా ఇలంబర్తి బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గిరిజన సంక్షేమ కార్యదర్శి కమిషనర్‌గా అనితా రామచంద్రన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా శాఖ కమిషనర్గా ఇలంబర్తి బదిలీ కాగా, పశుసంవర్ధక శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సిఎస్ రామకృష్ణారావు వద్దే మెట్రో పాలిటన్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్యదర్శి బాధ్యతలు ఉంచుకున్నారు. జిఏడి కార్యదర్శిగా ఇ.శ్రీధర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. టిజి ఆయిల్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా యాస్మిన్ భాషాకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎస్‌సి అభివృద్ధి కమిషనర్‌గా జి.జితేందర్ రెడ్డి బదిలీ కాగా ఎస్‌సి సహకార సంస్థ ఎండిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు ప్రత్యేక కార్యదర్శిగా బి.సైదులుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

## రూ. 5,265 కోట్ల ఆస్తి నష్టం

(మొదటి పేజీ తరువాయి)

సహాయక, పునరుద్ధరణ పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని, అదే సమయంలో వేగంగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. తుఫాన్ కారణంగా భారీ నష్టం జరిగిందని, సుమారు 1,500 మంది సిబ్బంది పరిస్థితిని చక్కదిద్దే పనిలో నిమగ్నమయ్యారని వివరించారు. చాలా ప్రాంతాల్లో 24 గంటల్లోగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్టు రవి కుమార్ పేర్కొన్నారు. వ్యవసాయ, అక్వాకల్చర్ విద్యుత్ సరఫరాను 48 గంటల్లోగా పునరుద్ధరిస్తామని అన్నారు. గతంలో ఇలాంటి విపత్తులు జరిగినప్పుడు ఏమాత్రం స్పందించని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్‌సిపి చీఫ్ జగన్మోహన్ రెడ్డికి ఇప్పుడు తుఫాన్ పనులపై వ్యాఖ్యానించే నైతిక హక్కు లేదని అన్నారు. ముందు జాగ్రత్తలు తీసుకున్నందు వల్లే ఈ తుఫాన్ వల్ల భారీ ప్రాణ నష్టం జరగలేదని పేర్కొంటూ, బహుశా జగన్మోహన్ రెడ్డి ఇందుకు నిరాశ చెంది ఉంటారని ఎద్దేవా చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com